www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

'ట్యాపింగ్' తేలితే కఠిన చర్యలే!

తెలంగాణలో టెలిగ్రాఫ్ చట్టాన్ని ఉల్లంఘించినట్లయితే చర్యలు తప్పవు

కేసీఆర్ పాలనపై అనేక ఆరోపణలు.. తెలంగాణలో మాకు 10 సీట్లు పక్కా!

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీలు చూసి ప్రజలు మోసపోయారు

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకే ఓటేస్తారు.. ఢిల్లీ మద్యం స్కాంలో కవితే కీలకం

ఏపీలో కూటమిదే అధికారం.. బాబు నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం

'ఆంధ్రజ్యోతి'తో కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ 14



శనివారం | 20-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 21

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి రా. 10.42 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పుబ్బ మ 2.04 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా.10.11-11.59; దుర్ముహూర్తం: ఉ.5.59-7.39; అమృతఘడియలు: ఉ.6.50-8.38; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.59; సూర్యాస్తమయం: 6.28

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సికింద్రాబాద్ సభలో అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్. చిత్రంలో కిషన్‌రెడ్డి, ఈటల

రాష్ట్రాన్ని దోచేశారు

బీఆర్ఎస్ అవినీతి పార్టీ.. అది చూడలేకే ఈటల బీజేపీలో చేరారు

హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు ఓట్లడిగే హక్కు లేదు: రాజ్‌నాథ్

బీఆర్ఎస్‌కు డిపాజిట్లు రావు.. కాంగ్రెస్‌తోనే మా పోటీ: కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు 2

రెండో రోజూ అదే జోరు 13

చురుగ్గా నామినేషన్ల ప్రక్రియ.. మొత్తం 57 మంది అభ్యర్థులు 69 నామినేషన్ల దాఖలు

నామినేషన్ వేసిన వారిలో బలరాం నాయక్, ఒవైసీ, పద్మారావుగౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్

టచ్ చేసి చూడు!

హైటెన్షన్ వైరులా ఎమ్మెల్యేలకు కాపలా ఉన్నా

కాంగ్రెస్‌ను ముట్టుకుంటే మాడి మసైపోతావు

ముందు.. నీ దొడ్లో ఎందరుంటారో చూసుకో

చిటికె కాదు.. మిద్దెక్కిడప్పు కొట్టినా ఏం చేయలేరు

కారును ఇక తుక్కు కింద తూకానికి వేయాల్సిందే

కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం

ఢిల్లీ మోదీ.. ఫాంహౌస్ కేడీ ఇద్దరూ తోడుదొంగలు

పదేళ్లపాటు అధికారం కాంగ్రెస్ ప్రజాపాలనదే

పంద్రాగస్టులోపు ముదిరాజ్ బిడ్డను మంత్రిని చేస్తాం

రూ.2 లక్షల రుణమాఫీ, వరికి 500 బోనస్ ఇస్తాం

భద్రాద్రి రాముడి సాక్షిగా చెబుతున్నా: రేవంత్

మహబూబ్‌నగర్, మహబూబాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్ దాఖలుకు హాజరైన సీఎం



మహబూబ్‌నగర్‌లో రోడ్డు షోలో సీఎం రేవంత్, ఎంపీ అభ్యర్థి వంశీచంద్

మహబూబ్‌నగర్/మహబూబాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 20 మంది తమతో టచ్‌లో ఉన్నారని, చిటికేస్తే వస్తారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెళ్లడం కాదని, ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎంత మంది ఆ పార్టీలో ఉంటారో కేసీఆర్ చూసుకోవాలని అన్నారు. తమ ఎమ్మెల్యేలకు తాను హైటెన్షన్ వైరులా కాపలా ఉంటానని, కేసీఆర్ ముట్టుకుంటే మసై పోతారని హెచ్చరించారు. శుక్రవారం మహబూబ్‌నగర్, మహబూబాబాద్‌లలో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థులు వంశీచంద్‌రెడ్డి, బలరాంనాయక్‌ల నామినేషన్ల దాఖలు కార్యక్రమాలకు సీఎం రేవంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో మాట్లాడారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో

మిగతా 13వ పేజీలో...



కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్! 2

సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ.. చేరికపై చర్చలు

త్వరలో మరో ఇద్దరు గ్రేటర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు!

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీ రవీంద్రనాయక్

కేటీఆర్ బావమరిది ఎడ్ల రాహుల్‌రావు కూడా..

ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతిదాడి! 12

అణుకేంద్రాలు, వైమానిక స్థావరాలుండే ఇస్ఫాహాన్ పట్టణంపై డ్రోన్లతో దాడి

తిప్పికొట్టిన ఇరాన్.. స్వల్పంగా నష్టం

దాడిపై పెదవి విప్పని ఇరాన్, ఇజ్రాయెల్

ఏపీ మంత్రి సిబ్బంది బెదిరింపులకు ఓ మహిళ బలి!

ఫిలింనగర్‌లో మంత్రి జోగి రమేశ్ కాన్వాయ్ కారుకు ప్రమాదవశాత్తు స్కూటీని తగిలించిన బాలుడు 3

కారుకు చిన్నగా గీతలు.. డ్రైవర్ ఫైర్

రూ.20వేలు ఇవ్వాలంటూ బెదిరింపు

లేదంటే కేసు పెడతామని హెచ్చరిక

ఆందోళనకు గురైన బాలుడి తల్లి..

ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య

అది బుగ్గన కారేనని అనుమానాలు

పొద్దంతా ఎండ.. సాయంత్రానికి గాలి వాన!

వనపర్తి జిల్లా చిన్నంబావిలో 45.1 డిగ్రీలు

హైదరాబాద్ శివారులో భారీ వర్షం

శ్రీశైలం హైవేపై 4 కి.మీ. ట్రాఫిక్ జామ్

రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బతో ఆరుగురు..

పిడుగుపడి ఒకరి మృతి 2



లక్షద్వీప్‌లో ఎన్నికల విధులకు బోటులో వెళ్తున్న సిబ్బంది

తొలిదశ పోలింగ్ 62.37 శాతం

త్రిపురలో అత్యధికంగా 80.1%.. బిహార్‌లో కేవలం 48.5%

21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 102 చోట్ల ఎన్నికలు

అండమాన్‌లో తొలిసారి ఓటు వేసిన షోంపెన్ ఆదివాసులు 12

తమిళనాడులో పోలింగ్ కేంద్రాల్లో.. ముగ్గురు వృద్ధుల మృతి

ఈఎన్‌పీవో బంద్.. నాగాలాండ్‌లోని 6 జిల్లాల్లో ఓటింగ్ జీరో

ఆ పరిధిలోని 20 మంది ఎమ్మెల్యేలూ ఓటుహక్కుకు దూరమే!

వంద కేంద్రంగా ప్రచారం



100 రోజుల పాలనపైనే రాష్ట్రంలో మూడు పార్టీల వ్యూహ ప్రతివ్యూహాలు

ఎన్నికలు తమ పాలనకు రెఫరెండం అంటున్న కాంగ్రెస్

బూటకపు హామీలను చూసి జనం మోసపోయారని బీఆర్ఎస్ విమర్శ

అవినీతి బీఆర్ఎస్ పోయి అవినీతి కాంగ్రెస్ వచ్చిందంటున్న బీజేపీ

(హైదరాబాద్-ఆంధ్రజ్యోతి)

'రాష్ట్రంలో జరిగే లోక్‌సభ ఎన్నికలు మా 100 రోజుల పరిపాలనపై రెఫరెండం'.. ఇది సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన. 'అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 420 హామీలిచ్చింది. ఈ 100 రోజుల్లో వాటిని నెరవేర్చనే లేదు'- ఇది బీఆర్ఎస్ పార్టీ విమర్శ. 'అవినీతి బీఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. అయినా 100 రోజుల్లో హామీలు అమలు కాలేదు. అవినీతి దూరం కాలేదు'- ఇదీ బీజేపీ ఆరోపణ. మొత్తమ్మీద రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీల ప్రచారం వంద రోజుల చుట్టే తిరుగుతోంది. జరిగేవి లోక్‌సభ ఎన్నికలైనా.. రాష్ట్రంలో పరిస్థితులే ఎన్నికల ఎజెండా కావడం

మిగతా 14వ పేజీలో...

‘చిలుకూరు’కు పోటెత్తిన భక్తజనం

సంతానఫల(గరుడ) ప్రసాదం స్వీకరణకు బాలాజీ ఆలయానికి భారీగా వచ్చిన మహిళలు

- ప్రచారంతో పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు
- ఉదయం 7గంటల నుంచే ట్రాఫిక్ జామ్



సంతానఫల ప్రసాదం కోసం తరలివచ్చిన మహిళలు



మొయినాబాద్/మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేలాది మంది సంతానఫల (గరుడ) ప్రసాదం కోసం తరలివచ్చారు. భక్తుల రద్దీతో హైదరాబాద్ నుంచి చిలుకూరు వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో భక్తులు వాహనాలను రోడ్డు పక్క పార్కుచేసి దాదాపు 12 కిలోమీటర్లు నడుచుకుంటూ ఆలయానికి చేరుకున్నారు. వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి శేషవాహన సేవ నిర్వహించారు. ధ్వజారోహణం నిర్వహించి స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన గరుడ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేస్తారు. సంతానం లేనివారు ఈ ప్రసాదం తీసుకుంటే సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ విషయాన్ని ముందుగా ఆలయ అర్చకులు సామాజిక మాధ్యమాల ద్వారా పెద్దఎత్తున ప్రచారం చేశారు. దాంతో భక్తులు ఆలయానికి పెద్దసంఖ్యలో పోటెత్తారు. శుక్రవారం తెల్లవారుజాము 3గంటలకే చాలా మంది సంతానంలేని మహిళలు ఆలయానికి చేరారు. ఉదయం 7 గంటల వరకే చిలుకూరు నుంచి అప్పా జంక్షన్ సన్‌సిటీ లంగర్ హౌస్ వరకు రోడ్డంతా ట్రాఫిక్ జామ్ అయ్యింది. దాంతో భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. గతంలో కంటే ఈసారి రెండింతలు ఎక్కువగా భక్తులు వస్తారని నిర్వాహకులు అంచనా వేసి ఏర్పాట్లు చేశారు. ఊహించని రీతిలో భక్తులు రావడంతో ఆలయ అర్చకులు, నిర్వాహకులకు ఏం చేయాలో అర్థం కాలేదు. ఆలయానికి వచ్చిన వారిలో 25శాతం మందికే ప్రసాదం అందించారు. కొందరు మహిళలు ఎండకు సొమ్మసిల్లి పడిపోగా వారిని అంబులెన్సులో ఆస్పత్రులకు తరలించారు. ట్రాఫిక్ నియంత్రణపై ఓ దశలో పోలీసులు సైతం చేతులెత్తేశారు. కాలేజీ, స్కూల్ విద్యార్థులు, ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలు, ఇంజనీరింగ్ కాలేజీల్లో శుక్రవారం జరగాల్సిన ఇంటర్నల్ పరీక్షలు వాయిదావేశారు. సాయంత్రం దాకా అప్పా జంక్షన్ వరకు వాహనాల రద్దీ కొనసాగింది. తాము అనుకున్న దానికంటే ఎక్కువ మంది భక్తులు వచ్చారని, అందుకే అందరికీ ప్రసాదం ఇవ్వలేకపోయామని ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ తెలిపారు. శుక్రవారం మాత్రమే ప్రసాదం పంపిణీ జరిగిందని, మళ్లీ ప్రసాదం పంపిణీ ఉండదని తెలిపారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	44.5	28.0
ఆదిలాబాద్	43.0	29.7
నల్లగొండ	42.5	25.2
నిజామాబాద్	42.4	29.5
రామగుండం	41.1	27.6
హైదరాబాద్	39.0	28.0
సంగారెడ్డి	39.0	27.0

వచ్చే వారంలోనే ఇంటర్ ఫలితాలు!

- సోమ లేదా మంగళవారం ప్రకటించే చాన్స్

హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాలను వెల్లడించడానికి బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వచ్చే వారంలో ఫలితాల విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించగానే, సోమ లేదా మంగళవారాల్లో ఫలితాలను ప్రకటించాలని భావిస్తున్నారు. సాధారణంగా ఇంటర్ ఫలితాలను విద్యాశాఖ మంత్రి విడుదల చేస్తారు. కానీ, రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇంటర్మీడియట్ బోర్డు అధికారులే ఫలితాలను వెల్లడించే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలను ఫిబ్రవరి 28 నుంచి మార్చి 18వ తేదీ వరకు నిర్వహించిన విషయం తెలిసిందే.

గురుకుల విద్యార్థి మృతిపై కేంద్రం దృష్టి

- రాష్ట్రానికి రానున్న ఎస్సీ జాతీయ కమిషన్ బృందం

హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి ఎస్సీ గురుకులంలో ఇటీవల కలుషిత ఆహారం తిని ఓ విద్యార్థి మృతి చెందిన ఘటనపై కేంద్రం దృష్టి సారించింది. ఈ మేరకు రెండు మూడు రోజుల్లో జాతీయ ఎస్సీ కమిషన్ బృందం రాష్ట్రానికి రానుంది. ఇటీవల భువనగిరి ఎస్సీ గురుకులంలో పలువురు విద్యార్థులు అనారోగ్యం పాలవ్వగా వారిలో ప్రశాంత్ అనే విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదులు అందాయి. దాంతో పలువురు అధికారులతో కూడిన కమిషన్ బృందం భువనగిరి ఎస్సీ గురుకులానికి వెళ్లి వివరాలు సేకరించనున్నట్లు తెలిసింది.

సీబీఐ కేసులో శరత్ వాంగ్మూలానికి కోర్టు ఓకే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి అరబిందో కంపెనీ డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి వాంగ్మూలాన్ని సీబీఐ నమోదు చేయనుంది. సౌత్ గ్రూపులో కీలక పాత్ర పోషించిన శరత్ వాంగ్మూలాన్ని తీసుకోవడానికి సీబీఐకి రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది. సీఆర్పీసీ సెక్షన్ 164 కింద శరత్ చంద్రారెడ్డి వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ శుక్రవారం సీబీఐ పిటిషన్ వేసింది. వాంగ్మూలం నమోదుకు శరత్ చంద్రారెడ్డి సమ్మతిస్తారా? అని న్యాయమూర్తి కావేరి భవేజా ప్రశ్నించారు. వాంగ్మూలం ఇచ్చేందుకు శరత్ చంద్రారెడ్డి అంగీకరించారని సీబీఐ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో ఆయన వాంగ్మూలం నమోదుకు న్యాయమూర్తి అనుమతి ఇచ్చారు. సీసీ టీవీ కెమెరా ముందు సీఆర్పీసీ 164 కింద కేవలం సాక్షిగా మాత్రమే శరత్ చంద్రారెడ్డి వాంగ్మూలం రికార్డు చేయనున్నట్లు తెలిసింది.

ఆదిలాబాద్, మంచిర్యాల ఎమ్మెల్యేలపై కేసులు

ఆదిలాబాద్, ఏసీసీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావులపై ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి. శ్రీరామ నవమిని పురస్కరించుకుని రాముడి చిత్రాలతో పాటు ఎమ్మెల్యే శంకర్ చిత్రం ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారని, వీటికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకోలేదని ఫ్లయింగ్ స్క్వాడ్ వారు ఫిర్యాదు చేసినట్లు ఆదిలాబాద్ వన్ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఈ నెల 17న శ్రీరామ నవమిని పురస్కరించుకుని పాత మంచిర్యాలలోని రామాలయాన్ని సందర్శించి సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం ఆ ఆలయానికి లక్ష రూపాయల నగదు విరాళంగా అందించారు. ఈ విషయం అన్ని పత్రికల్లో రావడంతో ఎన్నికల కమిషన్ సుమోటోగా తీసుకొంది. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా విరాళం ఇచ్చినందుకు కోడ్ ఉల్లంఘన కింద కేసు నమోదైనట్లు ఆర్డీవో వడాల రాములు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్!

సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ.. చేరికపై చర్చలు.. రాజేంద్రనగర్ ముఖ్యనేతలతో సమావేశం

- బీఆర్‌ఎస్‌కు మాజీ ఎమ్మెల్యే రాములునాయక్ గుడ్‌బై



సీఎం రేవంత్‌ను కలిసిన రాహుల్‌రావు, రవీంద్ర నాయక్

హైదరాబాద్/నార్సింగ్/రాజేంద్రనగర్/వైరా, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇరవై మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ కేసీఆర్ ప్రకటించి 24 గంటల గడవక ముందే బీఆర్‌ఎస్‌కు మరో ఎమ్మెల్యే షాకిచ్చారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుసుకున్నారు. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మైనారిటీ గురుకుల విద్యాసంస్థల వైస్‌చైర్మన్, రాజేంద్రనగర్ కు చెందిన మహ్మద్ ఫహీం ఖురేషీతో కలిసి సీఎం రేవంత్‌తో ప్రకాశ్‌గౌడ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరికకు సంబంధించే చర్చలు జరిగినట్లు తెలిసింది. ముఖ్యమంత్రితో సమావేశం అనంతరం తన నివాసంలో గండిపేట, రాజేంద్రనగర్ మండల బీఆర్‌ఎస్ నాయకులతో ప్రకాశ్‌గౌడ్ కీలక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్‌లో చేరాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారని, అందుకే వెళ్లి కలిశానని వారికి చెప్పారు. ని యోజకవర్గంలో మరింత అభివృద్ధి జరగాలంటే పార్టీ మారక తప్పడంలేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నట్లు సమాచారం. దీంతో ‘మేమంతా మీతోనే ఉంటాం.. కాంగ్రెస్‌లోకి వెళదాం’ అని 90% మంది నాయకులు చెప్పినట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లోనే ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకొంటారని ప్రచారం జరుగుతోంది. సీఎం రేవంత్‌తో బహిరంగ సభ నిర్వహించి, ఆ సభలో కాంగ్రెస్‌లో చేరడానికి ప్రకాశ్‌గౌడ్ ఏర్పాట్లు చేసుకుంటున్నారని సమాచారం. ఇదిలా ఉండగా.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మరో ఇద్దరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ఘట్టం పూర్తయ్యాక వారితో మరోసారి చర్చలు జరిపి కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు రేవంత్ తేదీ ఖరారు చేయనున్నట్టు ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్‌లో చేరిన రవీంద్రనాయక్

మాజీ మంత్రి, ప్రముఖ బంజారా నాయకుడు రవీంద్రనాయక్ కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మరోవైపు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వరుసకు బావమరిది అయిన ఎడ్ల రాహుల్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రె స్‌లో చేరారు. ఇదిలా ఉండగా.. ఖమ్మం జిల్లాలోని వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ బీఆర్‌ఎస్ కు రాజీనామా చేశారు. 2018 ఎన్నికల్లో రాములునాయక్ వైరా నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది.. బీఆర్‌ఎస్‌లో చేరారు. అయితే ఇటీవలి ఎన్నికల్లో ఆయనకు పార్టీ టికెట్ ఇవ్వలేదు.

త్వరలోనే 25 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి: ఉత్తమ్

సూర్యాపేటటౌన్/హుజూర్‌నగర్, ఏప్రిల్ 19: బీఆర్‌ఎస్‌కు చెందిన 25 మంది ఎమ్మెల్యేలు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లోకి వచ్చేందుకు 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ పనైపోయిందని, రాష్ట్రంలోని ఏ ఒక్క పార్లమెంట్ స్థానంలో కూడా ఆ పార్టీ డిపాజిట్ కూడా వచ్చే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.

చేనేత కార్మికులకు రూ. 50 కోట్లు విడుదల

- మిగతా బకాయిలను త్వరలో చెల్లిస్తామన్న సీఎం

హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు చెల్లించాల్సిన బకాయిల్లో రూ. 50 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న మిగతా బకాయిలను కూడా వీలైనంత త్వరలోనే విడుదల చేయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. గత ఏడాది బతుకమ్మ చీరలకు సంబంధించి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.351 కోట్ల బిల్లులు చెల్లించకుండా బకాయి పడింది. దీంతో వేలాది కార్మిక కుటుంబాలు ఆందోళనకు గురయ్యాయి. తమకు రావాల్సిన బకాయిలను చెల్లించి ఆదుకోవాలని ప్రస్తుత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పలుమార్లు కార్మికులు, ఆసాములతో చర్చలు జరిపి కార్మికుల ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సీఎం వెంటనే బకాయిలను విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. నేతన్నలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, ఎప్పటికప్పుడు బిల్లులుచెల్లించేలా ఏర్పాట్లు చేస్తుందని భరోసా ఇచ్చారు. కాగా, ప్రభుత్వం మూడు నెలల్లో సమగ్ర శిక్షా అభియాన్ యూనిఫాంల తయారీకి సుమారు రూ. 47 కోట్లు ముందస్తుగా చెల్లించింది. నూలు కొనుగోలుకు రూ. 14 కోట్లు విడుదల చేసింది.

రాహుల్‌ది దేశభక్తుల కుటుంబం

- ఆయన ముత్తాతల తరం నుంచే దేశభక్తులు
- బీజేపీ నేతలు డూప్లికేట్ దేశభక్తులు.. గ్రాఫిక్ లీడర్లు
- కాంగ్రెస్‌లోకి ఎంత మంది ఎమ్మెల్యేలు వస్తారనేది ఎన్నికల తర్వాత తెలుస్తుంది: జగ్గారెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీది దేశభక్తుల కుటుంబం అని, ఆయన ముత్తాత మోతీలాల్ నెహ్రూ తరం నుంచే వారి కుటుంబ సభ్యుల్లో దేశభక్తులు ఉన్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి తెలిపారు. బీజేపీ నేతలు డూప్లికేట్ దేశ భక్తులని, గ్రాఫిక్ లీడర్లని ఆరోపించారు. శుక్రవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలో ఎన్డీయే హవా తగ్గుతోందని, ఇండియా కూటమి బలం పెరుగుతోందని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లయిందని, అప్పటి నుంచే దేశంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయన్నారు. బీజేపీకి కేవలం 40 ఏళ్ల చరిత్ర మాత్రమే ఉందని, ఆ పార్టీ నేతలు తామే దేశభక్తులమని డబ్బా కొట్టుకుంటున్నారని విమర్శించారు. లేనిది ఉన్నట్టు చెప్పుకుని లబ్ధి పొందే పనిలో బీజేపీ ఉందని, ఈ విషయాన్ని ప్రజలు ఆలోచించాలన్నారు. అసలైన దేశభక్తుల కుటుంబం రాహుల్ గాంధీ కుటుంబమేనని పేర్కొన్నారు. దేశం కోసం త్యాగాలు చేసిన చరిత్ర రాహుల్ కుటుంబానికి ఉందని తెలిపారు. నిజమైన దేశభక్తులం తామే అంటూ చెప్పుకోవాల్సిన అవసరం ఆ కుటుంబానికి లేదన్నారు. రాహుల్ గాంధీ ముత్తాత నెహ్రూ 1919,1928లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా సేవలందించారని గుర్తు చేశారు. వారిది ధనిక కుటుంబమని, సంపద అంతా స్వాతంత్ర్య ఉద్యమం కోసం ఖర్చు చేసిన చరిత్ర మోతీలాల్ నెహ్రూ కుటుంబానికి ఉందని వివరించారు. బీజేపీ వాళ్లేమో తామే దేశభక్తులమని చెప్పుకుంటున్నారని, అసలైన దేశభక్తుల కుటుంబం వారిలా డబ్బా కొట్టుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌లోకి ఇతర పార్టీల నుంచి ఎంత మంది ఎమ్మెల్యేలు వస్తారనేది పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలుస్తుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఏ ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం కూలిపోతుందని అన్నారో తెలియదు కాని.. ఆయన కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టే ఆలోచన తమ దగ్గర ఉందని చెప్పారు. అధికారం ఇచ్చిన ప్రజలను ఐదేళ్లు ఎలా మెప్పించాలనే ఆలోచనలో ఉన్నామని పేర్కొన్నారు. అధికారంలో లేని కేసీఆర్ గేమ్ ఆడితే.. సీఎం రేవంత్ గేమ్ ఆడకుండా ఉంటారా? అని ప్రశ్నించారు. వంద మంది ఉన్న కౌరవులను ఐదుగురు పాండవులు కూల్చేశారని మహాభారత కథను గుర్తు చేస్తూ.. తాము ఇక్కడ పాండవులమని పేర్కొన్నారు.

రాష్ట్రాన్ని దోచేశారు

- బీఆర్‌ఎస్ అవినీతి పార్టీ
- అది చూడలేకే ఈటల బీజేపీలో చేరారు
- కాంగ్రెస్‌కు ఓట్లడిగే హక్కు లేదు: రాజ్‌నాథ్
- కాంగ్రెస్‌తోనే మా ప్రధాన పోటీ: కిషన్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



సికిందరాబాద్ మహబూబ్ కాలేజ్‌లో నిర్వహించిన విజయ సంకల్ప సభలో అభివాదం చేస్తున్న రాజ్‌నాథ్‌సింగ్, చిత్రంలో కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, ఈటల

బలిదానాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ దోచుకుందని, రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన వారి ఆత్మలు నేటికీ శాంతించలేదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన సందర్భంగా సికింద్రాబాద్ మహబూబ్ కాలేజ్ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో రాజ్‌నాథ్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన ఈటల.. బీఆర్‌ఎస్ అవినీతిని చూసి బయటకు వచ్చారని తెలిపారు. పదేళ్లలో బీజేపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని చెప్పారు. ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉందని, 2047 లోపు మూడో ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని చెప్పారు. దేశం ఇప్పుడు అత్యంత శక్తిమంతంగా అవతరించిందని, రక్షణ వ్యవస్థలో మరింత పటిష్ఠంగా తయారు చేస్తామని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలుపొందడం ఖాయమని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్‌కు ఎక్కడా డిపాజిట్ వచ్చే పరిస్థితి లేదని, కాంగ్రెస్‌తోనే తమకు ప్రధాన పోటీ అని పేర్కొన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదని చెప్పారు. బీఆర్‌ఎస్ ఒక సీటు గెలిచినా, ఓడినా నష్టం లేదని.. ఆ పార్టీ శకం ముగిసిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ నిలబడుతుందని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, గ్యారెంటీలను అమలు చేసేలా ఒత్తిడితెస్తూ ప్రజల తరఫున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేస్తానని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

ఈ సర్కారును ప్రజలే కూలుస్తారు: లక్ష్మణ్

సికిందరాబాద్‌లో బీజేపీ గెలుపు ఇప్పటికే ఖాయమైందని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయ పథంలో దూసుకెళుతున్నారని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోయాలనే ఆలోచన తమకు లేదన్నారు. ఇచ్చిన గ్యారెంటీలు, హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలే కూలగొడతారని చెప్పారు. అసెంబ్లీలో బీజేపీ శాసనసభా పక్ష నాయకుడిగా పని చేసిన కిషన్‌రెడ్డి.. ప్రజా సమస్యల ప్రస్తావనే ఎజెండాగా శాసన సభలో కనిపించేవారని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. వ్యక్తిగత ఎజెండా లేదని.. పార్టీ, ప్రజల శ్రేయస్సే ముఖ్యమని ఆయన చెబుతుంటారని అన్నారు.

ఎంపీ అభ్యర్థిగా కిషన్‌రెడ్డి నామినేషన్..

సికిందరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా కిషన్ రెడ్డి నామినేషన్ వేశారు. శుక్రవారం సికిందరాబాద్ జోనల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయన వెంట ఎంపీ లక్ష్మణ్ ఉన్నారు. అంతకుముందు కిషన్‌రెడ్డి కుటుంబ సమేతంగా సికిందరాబాద్ మహాకాళి అమ్మవారి వద్ద నామినేషన్ పత్రాలు ఉంచి పూజలు చేశారు. అనంతరం ప్యాట్నీ సెంటర్‌లోని మహబూబ్ కాలేజ్ గ్రౌండ్‌లో జరిగిన విజయ సంకల్ప సభకు ర్యాలీగా వెళ్లారు. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎంపీ లక్ష్మణ్, మాజీ మంత్రులు మర్రి శశిధర్ రెడ్డి, ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అవినీతి పార్టీలు: రాజ్‌నాథ్

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను ఓడించి అవినీతి ప్రభుత్వాన్ని తరిమికొట్టారని, ఈ లోక్‌సభ ఎన్నికల్లో మరో అవినీతి పార్టీ కాంగ్రెస్‌ను కూడా ఓడించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూ అవినీతి పార్టీలేనన్నారు. ఖమ్మం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు తరఫున ప్రచారం చేసేందుకు శుక్రవారం రాజ్‌నాథ్ సింగ్ ఖమ్మం వచ్చారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, గిరిజన నృత్యాలతో సర్దార్ పటేల్ స్టేడియం నుంచి జడ్పీ సెంటర్ వరకు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటులో బీజేపీ ఎంతో కీలకపాత్ర పోషించిందని తెలిపారు. 25 కోట్ల మందిని పేదరికం నుంచి విముక్తి చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదని చెప్పారు. కాగా, ఖమ్మంలో రాజ్‌నాథ్‌సింగ్ హెలీకాప్టర్‌ను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేసింది.

అవినీతి బీఆర్‌ఎస్ నుంచి పారిపోతున్న అభ్యర్థులు

- ఆగస్టులో రుణమాఫీ, వానాకాలం ధాన్యానికి 500 బోనస్: పొన్నం



హుస్నాబాద్‌రూరల్/సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 19: లోక్‌సభ ఎన్నికల్లో అవినీతి బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేయలేమంటూ ఆ పార్టీ అభ్యర్థులే పారిపోతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. శుక్రవారం సిరిసిల్ల, హుస్నాబాద్‌లలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే జీర్ణించుకోలేకపోతున్నారని, ఏడాదిలోనే ప్రభుత్వం కూలిపోతుందంటూ పిల్లి శాపనార్థాలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. దమ్ముంటే ఒక్కసారి కాంగ్రెస్‌ను టచ్ చేసి చూడాలని సవాల్ విసిరారు. తాను భయపడి కరీంనగర్ నుంచి పారిపోయానని ఓ బీజేపీ నాయకుడు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. తాను మొగాడిని కాబట్టే హుస్నాబాద్‌లో గెలిచానని స్పష్టంచేశారు. మోదీ గుజరాత్‌ను వీడి, వారాణసీలో పోటీ చేసి గెలవడం లేదా? అని ప్రశ్నించారు. సిరిసిల్లకు రావాల్సిన టెక్స్‌టైల్ పార్క్ వరంగల్‌కు వెళ్తుంటే ఆపలేని దద్దమ్మ ఇప్పుడు కేంద్రానికి లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. 60 సంవత్సరాలు కాంగ్రెస్ అధికారంలో ఉండి, రూ.60 కోట్ల అప్పు చేస్తే, పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసిందని దుయ్యబట్టారు. ఆగస్టు 15లోగా రూ.2 లక్షలు రైతు రుణమాఫీ చేస్తామని, వచ్చే వర్షాకాలం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇష్టారీతిన లక్షల కోట్లు ప్రొసీడింగ్స్ ఇచ్చిందని ఆరోపించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు చెందిన బతుకమ్మ చీరల బకాయిలు రూ.270 కోట్లు పెండింగ్ పెట్టిపోయిందన్నారు. తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలను కించపరిచే విధంగా మాట్లాడిన మోదీని ఈ ఎన్నికల్లో గట్టి దెబ్బ కొట్టాలని పిలుపునిచ్చారు.

పొద్దంతా ఎండ.. సాయంత్రానికి గాలి వాన!

- వనపర్తి జిల్లాలో 45.1 డిగ్రీలు..
- హైదరాబాద్ శివారులో భారీ వర్షం
- శ్రీశైలం హైవేపై 4 కి.మీ. మేర ట్రాఫిక్ జామ్
- జిల్లాల్లో తడిసిన ధాన్యం నేలకొరిగిన వరి, రాలిన మామిడి
- వడదెబ్బతో ఆరుగురు.. పిడుగుపడి ఒకరి మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



సిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు

రాష్ట్రంలో భిన్న వాతావరణం నెలకొంది. పొద్దంతా ఎండలు, వడగాలులతో జనం ఉక్కిరిబిక్కిరి కాగా.. సాయంత్రానికి ఈదురు గాలులతో కూడిన వానలతో ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం అన్ని జిల్లాల్లోనూ పగటి ఉష్ణోగ్రతలు 42-45 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. వనపర్తి జిల్లా చిన్నంబావిలో 45.1, నల్లగొండ జిల్లా బుగ్గబావిగూడలో 44.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఇక సాయంత్రానికి ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, నల్లగొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌తో పాటు వికారాబాద్ జిల్లాలో పలుచోట్ల గాలివానలు బీభత్సం సృష్టించాయి. దీంతో మార్కెట్ యార్డుల్లోని రైతుల ధాన్యం తడిసిపోగా.. వరి, మామిడి, జొన్న పంటలకు నష్టం వాటిల్లింది. హైదరాబా ద్ నగర శివారులో భారీ వర్షం కురిసింది. శ్రీశైలం జాతీయ రహదారిపై పలు చోట్ల చెట్లు కూలాయి. మహేశ్వరం-తుమ్మలూరు కందుకూరు రహదారిపై 4 కి.మీ. మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు పడిపోయిన చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. వికారాబాద్, కందుకూరు మండలాల్లో ఈదురుగాలులతో భారీ వర్షాలు పడడంతో వరి, జొన్న పంటలకు నష్టం వాటిల్లింది. చేవెళ్ల మండల పరిధిలోని ధర్మసాగర్‌లో గుర్రాల బల్వంత్‌రెడ్డికి చెందిన ఏడెకరాల బొప్పాయి పంట నేలకొరిగింది. మహేశ్వరం మండలం తుమ్మలూరులో పిడుగు పడి మారమోని జంగయ్య (45) మృతి చెందాడు. కులకచర్ల, యాచారం మండలాల్లోనూ వర్షంతో పంటలకు నష్టం వాటిల్లింది. మేడ్చల్ పట్టణంలో దాదాపు గంట పాటు కురిసిన వర్షంతో జనం ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో 4 గంటల పాటు విద్యుత్తు సరఫరా నిలిపేశారు. సిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లిలో వడగళ్ల వర్షానికి పది వేల క్వింటాళ్ల వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిపోయింది. మెదక్ జిల్లా అల్లాదుర్గం, నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలాల్లో వరి పంట నేలకొరిగింది. ఇక వడదెబ్బతో శుక్రవారం మరో ఆరుగురు మృతిచెందారు. ములుగు మండలం మదనపల్లిలో చిలపాక సాల్మన్ (50), సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో కె.మహేశ్ (45), సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మెలుగూరి సురేశ్ (36), నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌కు చెందిన రామగిరి లక్ష్మీనర్సయ్య (48), భద్రాద్రి జిల్లా మణుగూరులో వేల్పుల వెంకటేశ్వర్లు (47), మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటలో ముత్తయ్య (105) ఎండలకు అస్వస్థతకు గురై మరణించారు.

అరూరి రమేశ్‌కు భద్రత కల్పించండి: హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌కు భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. తనకు గతంలో కల్పించిన భద్రతను ఉపసంహరించడాన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనకు గతంలో ఉన్న 3+3 భద్రతను పోలీసులు ఉపసంహరించారని తెలిపారు. దానిని పునరుద్ధరించాలని కోరారు. వాదనలు విన్న హైకోర్టు.. అరూరి రమేశ్‌కు భద్రత కల్పించాలని డీజీపీ, వరంగల్ కమిషనర్‌లకు ఆదేశాలు జారీచేసింది.

కన్నీళ్లు పెట్టిన చల్లగరిగ

» ముగిసిన మావోయిస్టు దంపతుల అంత్యక్రియలు

చిట్యాల, ఏప్రిల్ 19: ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు దంపతులు సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్, దాసరివాడ సుమన అలియాస్ రజితల అంత్యక్రియలు శుక్రవారం ముగిశాయి. సుధాకర్ స్వగ్రామమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని చల్లగరిగలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థుల అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు పూర్తయ్యాయి. 24 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిన సుధాకర్... అతని భార్య విగతజీవులుగా ఇంటికి రావడంతో ఆత్మీయులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆదిలాబాద్ జిల్లా బజార్ అత్నూర్ మండలం డేడ్రాకు చెందిన సుమన తల్లి, సోదరులు కడసారి చూపుకోసం చల్లగరిగకు చేరుకున్నారు. కాగా, ఎన్‌కౌంటర్ జరిగిన రెండు రోజుల వరకు స్థానిక పోలీసుల నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో గురువారం కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కాంకేర్ వెళ్లి ఇద్దరి మృతదేహాలను చల్లగరిగకు తీసుకొచ్చారు.

ఏపీ మంత్రి సిబ్బంది బెదిరింపులకు ఓ మహిళ నిండు ప్రాణం బలి!

ఫిలింనగర్‌లో సదరు మంత్రి బీఎండబ్ల్యూ కారుకు.. ప్రమాదవశాత్తు స్కూటీని తగిలించిన బాలుడు

» కారు డ్రైవర్ల బెదిరింపులతో ఆందోళనకు గురైన బాలుడి తల్లి.. ఉరేసుకుని ఆత్మహత్య

» అది మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కారే?

» ఘటనపై గోప్యత పాటిస్తున్న పోలీసులు



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వంలోని ఓ మంత్రి సిబ్బంది తీవ్ర బెదిరింపులు ఫిలింనగర్‌కు చెందిన ఓ నిరుపేద మహిళ నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. ఆ మహిళ మైనర్ కుమారుడు స్కూటీ ప్రమాదవశాత్తు మంత్రి కుటుంబసభ్యులు ప్రయాణిస్తున్న ఖరీదైన కారుకు తగిలి.. ఆ వాహనానికి చిన్నగా గీతలు పడటంతో మంత్రి సిబ్బంది ఆగ్రహంతో ఊగిపోయారు. బాలుడి నుంచి స్కూటీని స్వాధీనం చేసుకోవడమే కాకుండా.. రిపేరు ఖర్చుల కోసం రూ.20వేలు ఇవ్వాలని అతడి తండ్రికి ఫోన్ చేశారు. తమది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం అని అంతడబ్బు ఇచ్చుకోలేమని బతిమాలుకున్నా ఆ సిబ్బంది కనికరించలేదు. దీంతో తన కుమారుడికి ఏదైనా ఆపద తలపెడతారేమోనని ఆందోళనకు గురైన బాలుడి తల్లి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఫిలింనగర్‌లో ఆలస్యంగా వెలుగుచూసిందీ ఘటన. కాగా ఆ కారు ఏపీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ది అని అధికార వర్గాల ద్వారా తెలిసింది. రిపేరు ఖర్చు తాలూకు డబ్బు వసూలు కోసం తమ సారు సాయంత్రం నాలుగు గంటల దాకా టైం ఇచ్చారని, డబ్బులివ్వకపోతే అబ్బాయిని జైల్లో వేయిస్తామని సదరు సిబ్బంది బాలుడి తండ్రిని తీవ్రంగా హెచ్చరించడం గమనార్హం. ఏపీలోని కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన సత్యాల వెంకటరమణ (38)కు భార్య సూర్యకుమారి (35), కుమారుడు (14), కుమార్తె ఉన్నారు. ఈ కుటుంబం ఫిలింనగర్ దీన్‌దయాళ్ కాలనీలో ఉంటోంది. వెంకటరమణ అడ్డా కూలీ. సూర్యకుమారి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తోంది. ఈనెల 17న ఉదయం ఎప్పటిలాగే వెంకటరమణ, సూర్యకుమారి పనులకు వెళ్లారు. వీరి కుమారుడు సమీపంలోని గుడికి వెళ్లేందుకు ఇంట్లో ఉన్న స్కూటీని తీసుకొని రోడ్డు మీదకొచ్చాడు. ఫిలింనగర్ హకీం బాబా దర్గా సమీపంలో మంత్రికి చెందిన బీఎండబ్ల్యూ కారు వెళుతోంది. ఆ కారు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో బాలుడు బైక్‌ను అదుపు చేయలేక కారుకు తగిలించాడు. ఈ ఘటనలో కారుకు చిన్నగా గీతలు పడ్డాయి. ఆ సమయంలో కారులో మంత్రి కుటుంబసభ్యులు ఉన్నారు. వెంటనే కారు డ్రైవర్ చంద్రశేఖర్ బాలుడి నుంచి స్కూటీ తాళాలు లాక్కున్నాడు. ఫోన్ చేసి మహేశ్ అనే మరో డ్రైవర్‌ను అక్కడికి పిలిపించుకున్నాడు. ఇద్దరు కలిసి బాలుడిని బెదిరించారు. కారు రిపేరుకు అయ్యే డబ్బు ఇస్తేనే బైక్ ఇస్తామని, లేదంటే కేసు పెడతామని హెచ్చరించారు. తర్వాత స్కూటీతో పాటు బాలుడిని మంత్రి ఇంటి వద్దకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి బాలుడి తండ్రి వెంకటరమణకు ఫోన్ చేశారు. ఆయన ఫోన్ తీయకపోవడంతో, ఓ కాగితంపై డ్రైవర్ మహేశ్ ఓ ఫోన్ నంబర్ రాసి, బాలుడి చేతిలో పెట్టి.. 'ఇంటికి వెళ్లి మీ నాన్నతో ఫోన్ చేయించు' అని గద్దించాడు. బాలుడు తండ్రి వద్దకు వెళ్లి డ్రైవర్ మహేశ్‌కు ఫోన్ చేయించాడు. వెంకటరమణతో ఫోన్‌లో మాట్లాడిన మహేశ్.. 'మీ అబ్బాయి బైక్‌తో కారును గుద్దాడు. రిపేరుకు రూ.20వేలు అవుతాయి. సాయంత్రం 4గంటల్లోగా ఇవ్వాలి. లేదంటే కేసు పెడతాం' అని హెచ్చరించారు. ఇదే విషయాన్ని వెంకటరమణ తన భార్య సూర్యకుమారికి ఫోన్ చేసి చెప్పాడు. తర్వాత.. వెంకటరమణ, వాయిదాల్లో చెల్లిస్తామని బైక్ ఇవ్వాలంటూ కోరినా మంత్రి సిబ్బంది అంగీకరించలేదు. పైగా.. 'టైమ్‌లోపు డబ్బులివ్వండి.. లేదంటే నీ కొడుకు సంగతి చూస్తాం. డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేని నీ మైనర్ కొడుకు జైలుకు పోతే బయటకు రాడు' అని డ్రైవర్లు బెదిరింపులకు దిగారు. దీంతో కంగారు పడిపోయిన బాలుడి తల్లిదండ్రులు.. రూ.20వేలు ఎలా సర్దాలి? అనే విషయంలో తీవ్రంగా మథనపడ్డారు. కొద్దిసేపటికి వెంకటరమణకు ఓ ఇంటి సామన్లు మార్చే పని రావడంతో సాయంగా ఉండేందుకు వెంట కుమారుడిని తీసుకెళ్లాడు. డ్యూటీ నుంచి ఇంటికొచ్చిన సూర్యకుమారి భర్తకు ఫోన్ చేసి, కొడుక్కి స్కూటీ ఎందుకిచ్చావు? రూ.20వేలు ఇప్పటికిప్పుడు ఎక్కడి నుంచొస్తాయి? అని రోదిస్తూ ప్రశ్నించింది. గడువులోపు డబ్బులు చెల్లించకపోతే ఒక్కగానొక్క కుమారుడికి ఎలాంటి ఆపద వస్తుందోనని మనస్తాపానికి గురైంది. అదే రోజు ఇంట్లోనే చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

కారు వివరాలు గోప్యం

ఈ ఘటనకు సంబంధించి ఫిల్మ్‌నగర్ పోలీసులు ఏపీ మంత్రి డ్రైవర్లు చంద్రశేఖర్, మహేశ్‌ను అదుపులోకి తీసుకొని ఐపీసీ 306 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. బాలుడు నడిపిన స్కూటీని స్టేషన్‌లో ఉంచారు. అయితే ఈ ఘటనకు సంబంధించి పోలీసులు గోప్యత పాటిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కారును స్కూటీ ఢీకొన్న ఘటనకు సంబంధించి నిబంధనల ప్రకారం రెండు వాహనాలకు సంబంధించి వివరాలను ఎఫ్ఐఆర్‌లో పొందుపరాల్సి. అయితే పోలీసులు కేవలం స్కూటీ నంబరునే ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. కారు నంబరు, ఆ వాహనం ఎవరి పేరు మీద ఉంది? అనే వివరాలను పేర్కొనలేదు. ఆ కారు.. ఏపీలోని కీలక మంత్రిది కావడం తోనే పోలీసులు గోప్యత పాటిస్తున్నారే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆరేళ్లు నిండితేనే ఒకటో తరగతిలో ప్రవేశంపై సవాలు

» ఆ ఉత్తర్వులు చెల్లవంటూ హైకోర్టులో పిటిషన్



హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లు నిండిన తర్వాతే ఒకటో తరగతిలో ప్రవేశం కల్పించాలన్న ఉత్తర్వులపై వివరణ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. పిల్లలకు ఆరేళ్లు పూర్తయితేనే ఒకటో తరగతిలో ప్రవేశం కల్పించాలంటూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. రంగారెడ్డి జిల్లా ఇంజాపూర్‌కు చెందిన పీ పరీక్షిత్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఎలాంటి శాస్త్రీయ అధ్యయనం, పరిశోధన లేకుండానే కేంద్ర ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీచేసిందని తెలిపారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ నాలుగువారాలకు వాయిదాపడింది.



సిద్ధిపేట జిల్లా సెర్ప్ ఉద్యోగులకు ఊరట

» సస్పెన్షన్ ఉత్తర్వులపై హైకోర్టు స్టే

» విధుల్లోకి తీసుకోవాలని ఉత్తర్వులు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించారన్న ఆరోపణలపై సస్పెన్షన్ వేటుకు గురైన సిద్ధిపేట జిల్లా డీఆర్‌డీఏ, సెర్ప్ ఉద్యోగులకు హైకోర్టులో ఊరట లభించింది. వారి సస్పెన్షన్ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి సిద్ధిపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ప్రచార సభలో పాల్గొన్నారనే అభియోగంపై 106 మంది డీఆర్‌డీఏ, ఐకేపీ, సెర్ప్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఈనెల 8న జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పుల్లూరు గ్రామానికి చెందిన కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్ తదితరులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్‌ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 129, 134లకు వ్యతిరేకంగా కలెక్టర్ చర్యలు తీసుకోవడం చెల్లదని తెలిపారు. పిటిషనర్‌లకు ఎలాంటి ఎన్నికల బాధ్యతలు లేవని చెప్పారు. ఎన్నికల విధుల్లో సైతం లేరని తెలిపారు. పిటిషనర్‌లు ప్రభుత్వ ఉద్యోగులు కాదని, కేవలం రూ. 5 వేల గౌరవవేతనంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాండక్ట్ రూల్స్ ఆఫ్ సివిల్ సర్వెంట్స్ వర్తించవని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారికం కలెక్టర్ అపాయింటింగ్ అథారిటీ లేదా డిసిప్లినరీ అథారిటీ కానందున సస్పెన్షన్ వేటు వేసే అధికారం లేదని వాదించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని జిల్లా కలెక్టర్, గ్రామీణాభివృద్ధి జిల్లా అధికారి తదితరులకు నోటీసులు జారీచేసింది. పిటిషనర్‌లపై విధించిన సస్పెన్షన్ ఉత్తర్వులపై స్టే విధిస్తూ వారిని విధుల్లోకి తీసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

చెంపపెట్టు లాంటి తీర్పు: వెంకట్రామిరెడ్డి

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 19: సిద్దిపేట జిల్లాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారనే 106 మంది ఐకేపీ ఉద్యోగులపై ఎన్నికల సంఘం విధించిన సస్పెన్షన్‌పై హైకోర్టు స్టే విధించడం, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించడం శుభ పరిణామమని మెదక్ లోక్‌సభ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ వంటి రాజకీయ కుట్రదారులకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదన్నారు. స్వార్థబుద్ధితో 106 కుటుంబాలను మనోవేదనకు గురిచేసినప్పటికీ ధర్మమే గెలిచిందన్నారు. వాస్తవాలు ఎప్పటికైనా వెలుగులోకి వస్తాయన్నారు. బాధింపబడిన ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తుది తీర్పు కూడా ఉద్యోగులకు అనుకూలంగానే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేని బీజేపీ అభ్యర్థి రఘునందన్.. కొందరు ఉద్యోగులను అడ్డం పెట్టుకొని తన మీద బురద జల్లే ప్రయత్నం చేశారని, ఇలాంటి కుట్రలను ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం తనకుందన్నారు.

బాలుర గురుకులంలో విద్యార్థులకు అస్వస్థత

» వాంతులు, విరేచనాలతో 25 మంది ఆస్పత్రి పాలు

» పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఘటన


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు


సుల్తానాబాద్, ఏప్రిల్ 19: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణ శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల వసతి గృహంలో 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. గురువారం రాత్రి 20 మందికి వాంతులు, విరేచనాలు కావడంతో, హాస్టల్‌లోని సిబ్బంది వారిని సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. శుక్రవారం మరో ఐదుగురు విద్యార్థులు కూడా అస్వస్థతకు గురవ్వడంతో వారిని ఆస్పత్రికి తరలించారు. గురువారం సాయంత్రం బొండాలు పెట్టారని, వాటిని తినలేక పోయామని, ఈ విషయం హాస్టల్ ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, తిన్న తమకు వాంతులు, విరేచనాలు, విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. చికిత్స అనంతరం పలువురు విద్యార్థులు కోలుకోగా, ప్రస్తుతం ఆసుపత్రిలో నలుగురు విద్యార్థులు చికిత్స పొందుతున్నారు.

రీజినల్ డైరెక్టర్ పరిశీలన

విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురికావడానికి గల కారణాలను తెలుసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సోషల్ వెల్ఫేర్ శాఖ రీజినల్ డైరెక్టర్ మేరీ ఏసుపాదం తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లికి చెందిన నెత్తెట్ల చిన్నమల్లయ్య(48) అనే రైతు అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నమల్లయ్య తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిని ఏడాది కిందట రూ.3 లక్షల అప్పు చేసి చదును చేశాడు. ఈ యాసంగి సీజన్‌లో మరో రూ.1.50 లక్షల అప్పు తీసుకొచ్చి వరి వేశాడు. పంటకు తెగుళ్లు సోకి దిగుబడి తగ్గుతుందని ఆందోళన చెందాడు. పంట దిగుబడి రాక బాకీలు తీర్చే మార్గం లేకపోవడంతో గురువారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామ శివారులో ఓ చెట్టుకు ఉరేసుకొని మృతి చెందిన చిన్నమల్లయ్యను గొర్రెల కాపరులు గమనించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పారదర్శకత ప్రధానం

కేరళలోని కాసర్‌గోడ్‌లో నిర్వహించిన మాక్‌పోలింగ్‌లో, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం) బీజేపీ అభ్యర్థికి కొన్ని అదనపు ఓట్లను నమోదు చేసిందన్న వార్తలపై దృష్టిసారించాల్సిందిగా ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు గురువారం కోరింది. అందులో నిజం లేదని ఆ తరువాత ఎన్నికల సంఘం కోర్టుకు స్పష్టంచేసింది. ఎన్నికల సంసిద్ధతలో భాగంగా ఈవీఎంలు, వీవీప్యాట్ మెషీన్ల పనితీరును పరీక్షిస్తున్నప్పుడు, కొన్ని అదనపు స్లిప్పులు ప్రచురితమై, ఈవీఎంలో బీజేపీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు పడ్డాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ యంత్రాలను తనిఖీచేస్తున్న క్రమంలో ఇంజనీర్లు చేసిన ఓ పొరపాటువల్ల ఇది జరిగింది తప్ప, అవి అదనపు ఓట్లు కావని ఈసీ తేల్చింది. సుప్రీంకోర్టులో వీవీప్యాట్లపై వాదనలు జరుగుతున్నప్పుడే ఇది జరగడం విచిత్రం. ఈవీఎంలో వేసిన ఓట్లతో పాటు, వీవీప్యాట్ ద్వారా ముద్రితమవుతున్న పేపర్‌స్లిప్పులను కూడా పూర్తిగా లెక్కించి, సరిపోల్చిన తరువాతే విజేతలను నిర్ణయించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరుపుతున్న సందర్భంలో, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఈ కేరళ ఘటనను న్యాయమూర్తుల దృష్టికి తీసుకువచ్చారు. దానిని ఎన్నికల సంఘం ఖండించడాన్ని అటుంచితే, ఈ దేశంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌లమీద ఇంకా అనుమానాలు రేగుతూనే ఉన్నాయి, వివాదం సాగుతూనే ఉంది.

సార్వత్రిక ఎన్నికల తొలిదశ పోలింగ్ ఆరంభానికి ఒకరోజు ముందు సుప్రీంకోర్టు ఈ అంశంపై తీర్పు రిజర్వుచేసింది. వీవీప్యాట్ స్లిప్పులన్నింటినీ లెక్కించడంలో ఎన్నికల సంఘానికి వచ్చే ఇబ్బంది ఏమిటన్నది సుప్రీంకోర్టు ప్రధాన ప్రశ్న. ఎన్నికల ప్రక్రియలో పవిత్రత నిలవాలి, ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా జరగాలి కనుక ఎన్నికల సంఘం అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాల్సిందేనని కోర్టు వ్యాఖ్యానించింది. ఎక్కడా లోపం లేదు, ఎవరికీ అన్యాయం జరగడం లేదు అని ఎన్నికల సంఘం అంటూనే ఉంటుంది. కానీ, న్యాయమూర్తులు వ్యాఖ్యానించినట్టుగా, ఓటర్లకు ఏ మాత్రం అన్యాయం జరగకూడదు, అనుమానాలకు ఆస్కారం కల్పించకూడదు. తాను కోరుకున్నవారికే ఓటువేశానని, ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని ఓటరుకు విశ్వాసం కలగడం అత్యంత ప్రధానం. ఈ కారణంగానే, వీవీప్యాట్‌లో ప్రింట్ అయిన స్లిప్పులను ఓటరుకే ఇచ్చేస్తే మరీ మంచిది కదా అని ఎన్నికల సంఘాన్ని న్యాయమూర్తులు సరిగానే ప్రశ్నించారు. కానీ, అది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తుందని ఈసీ వాదన. ఏ పార్టీకి ఓటు వేసిందీ మిగతావారికి తెలియడం నిజానికి అతడికి కొత్త సమస్యలు తేవచ్చును కూడా. వీవీప్యాట్ స్లిప్పును ఓటరు పరీక్షగా చూసుకొని సంతృప్తిచెందిన తరువాత బాక్సులో వేయడమన్న ప్రతిపాదన మంచిదే కానీ, ఇది ఎన్నికల ప్రక్రియను మళ్ళీ పాతవిధానానికి తీసుకెళ్ళడమేనని ఈసీ వాదన. ఓటరు గోప్యతను కాపాడుతూ, తాను వేసిన ఓటు ఎవరికి పడిందన్న విషయంలో ఏ విధమైన అనుమానాలకు తావులేకుండా ఉండాలంటే, వీవీప్యాట్ మెషిన్‌లోని లైట్ ఎప్పుడూ వెలుగుతూనే ఉండాలన్నది మరో సూచన. ఈవీఎంలో ఓటువేసిన తరువాత, పేపర్‌స్లిప్ ప్రింట్ అవుతుంది, అది సీల్డ్ బాక్సులో పడేముందు లైట్ వెలుగుతుంది, ఏడుసెకన్లు మాత్రమే ఓటరుకు ఆ స్లిప్ కనిపిస్తుంది. ఓటరు చూసి సంతృప్తిచెందడానికి ఈ సమయం సరిపోతుందని, నిర్ధారణకు కాగితాన్ని విడిగా చేతికి ఇవ్వడం లేదా బాక్సులో వేయడం, లైట్ వెలిగే కాలం పెంచడం ఇత్యాదివి అక్కరలేదని ఈసీ అంటోంది.

ఓటరు హక్కులను ఎత్తిపడుతూ వీవీప్యాట్ల అంశంపై విచారణ అత్యవశ్యకమని ప్రకటించి, సుప్రీంకోర్టు ఈ వాదనలన్నీ విన్నది. ఓటింగ్ ప్రక్రియ, మెషీన్ల పనితీరువరకూ మొత్తం తెలుసుకుంది, అనుమానాలు నివృత్తి చేసుకుంది. సార్వత్రిక ఎన్నికల్లోగా సర్వోన్నత న్యాయస్థానం తమ కేసువినాలన్న అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ఆశ నెరవేరింది కానీ, తీర్పు రిజర్వులో ఉండిపోయింది. ఈవీఎంలో నమోదైన ఓట్లతో పాటు, వీవీప్యాట్లన్నింటినీ లెక్కించిన తరువాతే, విజేతను ప్రకటించాలన్న అభ్యర్థన అర్థం లేనిదేమీ కాదు. నూరుశాతం వీవీప్యాట్ల లెక్కింపు డిమాండ్‌ను సాంకేతికంగా సాధ్యం కాదనో, సమయం వృథా అవుతుందనో, తిరోగామి చర్య అనో తిరస్కరించడం కంటే, అందుకు సిద్ధపడటం ద్వారా ఈవీఎంలమీద ఉన్న అన్ని అనుమానాలను, అపనమ్మకాలను వమ్ముచేయడం మంచిది. ఎన్నికల వ్యవస్థను ఇది మరింత పారదర్శకంగా మారుస్తుంది, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది.

'శ్రమ దోపిడీ' మాటే ఎత్తని, 'లోతైన పరిశీలన'!

'సుప్రీం తీర్పు సంస్కరణేనా?' పేరుతో వచ్చిన జయప్రకాష్ నారాయణ గారి వ్యాసంలో (ఆంధ్రజ్యోతి, మార్చి 31) ప్రశ్నించవలిసిన విషయాలున్నాయి.

(1) సుప్రీం తీర్పు ఏమిటి? కార్పొరేట్లు (పెద్ద పెద్ద కంపెనీలు), రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల గురించి, ఏయే పార్టీలకు ఎంతెంత ఇస్తున్నారో వివరాలన్నీ చెప్పాలి – అనేదే. దీన్ని, 'సంస్కరణేనా' అనడంలో అర్థం ఏమిటో స్పష్టత లేదు.

(2) 'భారత రాజకీయాల్లో డబ్బు ప్రాబల్యాన్నీ, పర్యవసానాల్నీ అర్థం చేసుకోవాలంటే మనకు మరింత లోతైన పరిశీలన అవసరం' అన్నారు. కానీ, ఆయన లోతైన పరిశీలనంతా, రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు ఇచ్చే విరాళాలలో పారదర్శకత ఉండాలంటే, ఆ కంపెనీల 3 సంవత్సరాల లాభాల సగటులో 5 శాతం పన్ను మినహాయింపు వుండాలని చెప్పడంగా ఉంది. పన్నుల్లో మినహాయింపు అనేది కంపెనీలకు సంతోషం కలిగించే సంస్కరణ!

(3) 'ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం' అనీ, 'లోపభూయిష్ట ప్రజాస్వామ్యం' అనీ, 'పరిణతి చెందిన ప్రజాస్వామ్యం' అనీ, వ్యాసకర్త, ప్రజాస్వామ్యానికి వేరు వేరు లక్షణాలు చెప్పారు. సమాజం పేదా–ధనికా వర్గ భేదాలతో వున్నప్పుడు 'ప్రజాస్వామ్యం' అనేది ధనిక వర్గానికే అనుకూలంగా వుండడం జరుగుతుంది. ఏ దేశంలో అయినా, ఉన్నది ఇదే! పేద జనాభా వర్గాన్ని, ధనిక జనాభా వర్గం, 'కౌలూ–వడ్డీ–లాభం' పేర్లతో, శ్రమ దోపిడీ చెయ్యడానికి అనుకూలంగా వున్న చట్టాలతో వున్నదే నేటి ప్రజాస్వామ్యం! ఈ నాటి ప్రజాస్వామిక చట్టాలన్నీ 'దోపిడీ పద్ధతుల్లో పరిణతి' చెందినవే!

(4) జయప్రకాష్ గారు అనుకుంటున్నట్టు, డబ్బు ప్రాబల్యం భారత రాజకీయాల్లో మాత్రమే కాదు, ఆయన చెప్పే 'పరిణతి చెందిన ప్రజాస్వామ్యాలలో' (ఉదాహరణకి, అమెరికాలో) కూడా డబ్బు ప్రాబల్యం ఎంతో వుంది. ఆధారాల కోసం, 'మైకేల్ పెరెంటీ' అనే రాజకీయశాస్త్ర ప్రొఫెసరు రాసిన 'కొద్దిమందికే ప్రజాస్వామ్యం' ('డెమోక్రసీ ఫర్ ది ఫ్యూ') అనే పుస్తకం చూడవచ్చును. 'డబ్బు అనేది ఎన్నికల రాజకీయాలకు జీవనాధారం' అనే విషయాన్ని, అనేక ఉదాహరణలతో ఆయన వివరిస్తాడు. అమెరికాలో, ఎన్నికలకు నిధులిచ్చే పెద్ద పెద్ద పరిశ్రమల వాళ్ళు ఎలా ప్రవర్తిస్తారంటే, ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులు 'అక్షరాలా తమ ఆత్మల్ని అమ్ముకోవలిసి వస్తుంది' అని కొన్ని రుజువులు చూపిస్తాడు.

(5) రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలపై పన్ను మినహాయింపు ఇవ్వాలనేది జయప్రకాష్ గారు సూచించిన ఒక సంస్కరణ కదా? అలా ఇస్తే, అది 'పార్టీలకు విరాళాలు చట్టబద్ధంగా ఇచ్చే పద్ధతి' అవుతుందని ఆయన వాదన! ఈ వాదన 'ఎంత లోతైన పరిశీలనో' శ్రామిక ప్రజల పక్షాన నిలబడి ఆలోచిస్తేనే తెలుస్తుంది. 'అసలు లాభం అంటే ఏమిటి? వాటిని పెద్ద పెద్ద కంపెనీల అధిపతులూ, వేలాది వాటాదార్లూ ఎలా, ఎక్కడి నించీ పొందుతారు?' అనే ప్రశ్నలు వేసుకుని, సమాధానాన్ని రాబడితే, అదీ 'లోతైన పరిశీలన'!

నిత్యం తూర్పున సూర్యోదయం జరగడం అనేది ప్రకృతి సత్యం అయినట్టుగా, 'లాభం రావడం' అనేది కూడా అంత సహజమైనదని సంస్కర్తలు భావిస్తారు. ఒక మందుల కంపెనీ ఉందనుకుందాం. అది, కొన్ని మందుల ఉత్పత్తికి కావలిసిన సాధనాల కోసం 80కోట్లు పెట్టింది అనుకుందాం. సాధనాల్ని ఉపయోగిస్తూ పని చేయడానికి శ్రామికులు కావాలి. వారిలో వేరు వేరు స్థాయిల వారు వుంటారు. వారి జీతాల కోసం 20 కోట్లు అనుకుందాం. అలా సాధనాల 80 + శ్రామికుల 20 = 100 కోట్ల ఖర్చుతో తయారైన మందుల్ని 120 కోట్లకి ఆ కంపెనీ అమ్మిందనుకుందాం. అదనంగా వచ్చిన ఆ 20 కోట్ల విలువ ఎవరి వల్ల వచ్చింది? సాధనాల వల్ల అయితే కాదు. ఆ అదనపు కోట్ల విలువా, శ్రమలన్నీ చేసిన శ్రామికుల వల్ల వచ్చిందే! అది శ్రామికుల అదనపు శ్రమ విలువ. అదే అదనపు విలువ. కానీ, కంపెనీ యజమానులు ఏమంటారంటే, 'అది మా పెట్టుబడి తెచ్చే లాభం' అంటారు. ఎందుకంటే, శ్రమ దోపిడీ అనేది, పరిణతి చెందిన ప్రజాస్వామ్యాల రాజ్యాంగాలలో చట్టబద్ధమే కాబట్టి! ఇంకో విచిత్రం ఏమిటంటే, కంపెనీలు ప్రభుత్వానికి పన్నులు కడితే, అవి ఎక్కడివి? శ్రామికులనించీ దొంగిలించిన అదనపు విలువ లోవే!



రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలపై పన్ను మినహాయింపు ఇవ్వాలనేది జయప్రకాష్ గారు సూచించిన ఒక సంస్కరణ కదా? అలా ఇస్తే, అది 'పార్టీలకు విరాళాలు చట్టబద్ధంగా ఇచ్చే పద్ధతి' అవుతుందని ఆయన వాదన! ఈ వాదన 'ఎంత లోతైన పరిశీలనో' శ్రామిక ప్రజల పక్షాన నిలబడి ఆలోచిస్తేనే తెలుస్తుంది. 'అసలు లాభం అంటే ఏమిటి? వాటిని పెద్ద పెద్ద కంపెనీల అధిపతులూ, వేలాది వాటాదార్లూ ఎలా, ఎక్కడి నించీ పొందుతారు?' అనే ప్రశ్నలు వేసుకుని, సమాధానాన్ని రాబడితే, అదీ 'లోతైన పరిశీలన'!

(6) కార్పొరేట్లు బహిరంగంగా విరాళాలు ఇవ్వాలంటే, ఆర్థిక కలాపాలలో పక్షపాతాలూ, అనూహ్య నిర్ణయాలూ ఉండరాదని, జయప్రకాష్ గారి మరో సంస్కరణ. అధికారంలో వున్న పార్టీకి, ఏ కంపెనీ అయితే ఎక్కువ డబ్బు ఇస్తుందో, ఆ కంపెనీకి అనుకూలంగా ప్రభుత్వం అనూహ్య నిర్ణయాలన్నీ చేస్తుంది. వీటిని భారత ప్రభుత్వం ద్వారా కూడా చూడగలం. విదేశాలతో ఒప్పందాలు చేసుకునే సమయంలో, ప్రధానమంత్రే, తమ పార్టీకి ఎక్కువ విరాళాలు ఇచ్చిన పెట్టుబడిదారుణ్ణి తన వెంటబెట్టుకు పోగలడు. లేదా, ఫోన్ చేసి, 'మా మిత్రుడికి ఆ విద్యుత్తు ప్రాజక్టు కాంట్రాక్టు ఇవ్వండి' అని పొరుగునున్న ఏదో ఒక బడుగు దేశాన్ని ఒత్తిడి చెయ్యగలడు. పరిణతి చెందిన అమెరికా ప్రజాస్వామ్యంలో, రక్షణ శాఖనించీ, వందల కోట్ల (బిలియన్ల) విలువగలిగిన కాంట్రాక్టులను మిలిటరీ అధికారులు కొన్ని కంపెనీలకు మాత్రమే ఇప్పించడం, వాటినించీ అపారమైన ప్రతిఫలం రకరకాల రూపాల్లో పొందడం ఎప్పటినించో జరుగుతున్నట్టు మైకెల్ పెరంటీ ఆధారాలు చూపాడు.

(7) 'పరిణతి చెందిన ప్రజాస్వామ్యాలలో తమ రాజకీయ ప్రాధాన్యతలను కార్పొరేట్లు బాహాటంగా చెబుతారు' అని, అదేదో గొప్ప విషయం అన్నట్టు చెపుతున్నారు జయప్రకాష్ గారు. భారత ప్రజాస్వామ్యంలో మాత్రం, కార్మిక వర్గ వ్యతిరేక 'ఆర్థిక సంస్కరణల'ను వేగవంతం చెయ్యమని భారత పారిశ్రామికవేత్తల సంఘాలు బాహాటంగా చెప్పడం లేదూ? కార్మిక వర్గం నిద్రావస్థలో వున్నప్పుడు పెట్టుబడిదారులు ఎన్నయినా చెపుతారు మరి!

(8) 'ప్రతీకార చర్యలుంటాయనే భయం లేకుండా, పార్టీలకూ, అభ్యర్థులకూ కార్పొరేట్లు విరాళాలిచ్చే చట్టబద్ధపాలన వాతావరణం భారతదేశానికి అవసరం' – అని ఇంకో సంస్కరణ సూచించారు జయప్రకాష్ గారు. అంటే, భారతదేశం పరిణతి చెందని లోపభూయిష్ట ప్రజాస్వామ్యం అనీ, అందుకే విరాళాలు ఇవ్వని కంపెనీల మీద, అధికారంలో వున్న పార్టీలు ప్రతీకారంతో ఇబ్బంది పెడుతున్నాయి అనీ, అర్థం.

ఇంతకీ, జయప్రకాష్ గారి ఆవేదన అంతా, కార్పొరేట్లు శ్రామిక ప్రజల్ని దోచి లాభాలు సంపాదిస్తున్నారే – అని కాదన్న మాట! దోపిడీ ఆదాయాల్ని సంపాదించుకునే వీలునిచ్చేచట్టాలే కాకుండా, నచ్చిన పార్టీలకే ఇష్టం వచ్చినన్ని విరాళాలు ఇచ్చుకునే చట్టబద్ధ పాలన వుండాలని కూడా!

'శ్రమ దోపిడీ' మాట ఎత్తకుండా, ఎంత లోతైన పరిశీలన ఇది?

• రంగనాయకమ్మ


'77 ఎన్నికలు, నిలబడిన ప్రజాస్వామ్యం

ఇంతవరకూ జరిగిన 17 సార్వత్రిక ఎన్నికలలో రెండు ప్రత్యేకంగా ముఖ్యమైనవి. మొదటిది 1952లో జరిగిన ప్రప్రథమ సార్వత్రిక ఎన్నికలు. ఆ ఎన్నికలు అపూర్వమైనవి. అయితే భారత్‌లో ప్రజాస్వామ్యపాలన సాధ్యతను సంశయిస్తున్నవారు వాటిని పరిహసించారు. భారతీయులు నిరుపేదలని, కులమతాలు, భాషా ప్రాంతాల వారీగా చీలిపోయి ఉన్నారని, పైగా అత్యధికులు నిరక్షరాస్యులనీ వారి ఆక్షేపణ. తత్కారణంగా తమ నాయకులను ఎన్నుకునే హక్కు భారతీయులకు ఇవ్వడం వివేకవంతమైన నిర్ణయం కాదని సంశయవాదులు విశ్వసించారు.

తన సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసేందుకు తొలుత విముఖత చూపిన ఒక మహారాజా నాడు దేశంలో పర్యటిస్తున్న ప్రముఖ అమెరికన్లతో "ప్రజలందరూ దాదాపుగా నిరక్షరాస్యులే అయిన దేశంలో సార్వత్రిక ఓటు హక్కును కల్పించడం 'పిచ్చితనం' మినహా మరేమీ కాదని" వ్యాఖ్యానించాడు. 'అత్యధిక ప్రజలు మొట్టమొదటిసారి ఓటు వేయనున్నారు. వారిలో చాలామందికి ఓటు అంటే ఏమిటో, తాము ఓటు ఎందుకు వేయాలో, ఎవరికి వేయాలో తెలియని వారే. మరి ఈ ప్రజాస్వామిక సాహసాన్ని చరిత్రలో అతి పెద్ద జూదంగా పరిగణింపబడడం ఆశ్చర్యమేమీ కాదు' అని మద్రాసు (నేడు చెన్నై)లో ఒక ఎడిటర్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. సరే, ఆరెస్సెస్ అధికారిక పత్రిక 'ఆర్గనైజర్' ఇలా వ్యాఖ్యానించింది: 'భారత్‌లో సార్వత్రిక వయోజన వోటింగ్ హక్కు విఫలమయిందని అంగీకరించేందుకు పండిట్ నెహ్రూ జీవించే ఉంటారు'. అయితే ఆ జూదంలో భారత్ గెలిచింది. భిన్న భావజాలాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలు, వ్యక్తులు ఆ సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేశారు. వయోజన స్త్రీ పురుషులు స్వేచ్ఛగా తమకు స్ఫూర్తినిచ్చిన వారిని ఎన్నుకున్నారు. ప్రథమ సార్వత్రిక ఎన్నికలను జయప్రదంగా నిర్వహించడం భారత దేశ చరిత్రలో ఒక ప్రధాన మైలురాయి. 1957, 1962, 1967, 1971లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు 1952లో సమకూరిన ప్రజాస్వామిక లబ్ధిని దృఢీకరించాయి.

మన దేశ చరిత్రలో ఎంతో చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకున్న రెండవ సార్వత్రిక ఎన్నికలు 1977 మార్చిలో జరిగాయి. జూన్ 1975లో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితిని విధించినప్పుడు అది స్వేచ్ఛాయుత, పోటీదాయక రాజకీయాలకు చరమగీతమని చాలా మంది విశ్వసించారు. వలసపాలన నుంచి విముక్తి పొందిన అనంతరం నియంతృత్వ పాలనలోకి జారిపోయిన పలు ఆసియన్, ఆఫ్రికా దేశాల సరసన భారత్ కూడా చేరినట్టేనని ఎంతో మంది నిస్పృహ పాలయ్యారు. 1976 ద్వితీయార్థంలో దేశవ్యాప్తంగా సమస్త వీధులూ శాంతియుతంగా ఉన్నాయి. నా వ్యక్తిగత అనుభవం నుంచి నేను ఇది చెప్పుతున్నాను. ఇందిర పాలనకు ఎలాంటి ముప్పు ఏర్పడలేదు. ఆమెను సవాల్ చేసే వారే లేరు. అత్యవసర పరిస్థితిని ఎత్తివేసి ఎన్నికలు నిర్వహించవలసిన అవసరం ఆమెకు లేనేలేదు. అయినా ఆశ్చర్యకరంగా ఆమె ఎన్నికలకు వెళ్లేందుకు నిర్ణయం తీసుకున్నారు.

1977 సార్వత్రిక ఎన్నికలకు చరిత్రాత్మక ప్రాధాన్యాన్ని సమకూర్చినవిగా మూడు అంశాలను చరిత్రకారులు ప్రముఖంగా ప్రస్తావిస్తారు. వాటిలో మొదటిది అసలు ఆ ఎన్నికలను నిర్వహించడం. రెండవది ఆ ఎన్నికల ఫలితాలు పోల్‌స్టర్స్ (ఓటర్ల అభిప్రాయాల విశ్లేషకులు) అంచనాలకు భిన్నంగా ఉండడం (ఇందిర అజేయురాలు అన్న విశ్వాసమే ఆ తప్పుడు అంచనాలకు ప్రధాన కారణం). ఆ సేతు హిమాచలం సకల సామాజిక వర్గాలకూ ఆమె ఒక తిరుగులేని అభిమాన నాయకురాలుగా ఉన్నారు. దీనికి తోడు 1971లో పాకిస్థాన్‌పై సాధించిన సైనిక విజయం ఆమె కీర్తి ప్రతిష్ఠలను ఇతోధికంగా పెంచింది. ఆరు సంవత్సరాల అనంతరం కూడా ఆ కీర్తి వెలుగులు అంతే దేదీప్యమానంగా ఉన్నాయి. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే ఆమె పార్టీకి విశేష ప్రజాదరణ ఉన్నది. పార్టీలో ఆమె నాయకత్వానికి తిరుగులేదు. పార్టీకి ఆర్థిక వనరులు పుష్కలంగా ఉన్నాయి. ప్రతిపక్షం పరిస్థితి కాంగ్రెస్‌కు పూర్తిగా భిన్నమైనది. ఐక్యత కొరవడడంతో పాటు ఆర్థిక వనరులూ కనీసమాత్రంగానైనా లేని దుస్థితిలో అవి ఉన్నాయి. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు అందరూ అత్యవసర పరిస్థితి కాలంలో జైలు వాసం చేసిన వారే. అయితే పోల్‌స్టర్స్ అంచనాలకు భిన్నంగా కాంగ్రెస్ మెజారిటీ పొందలేకపోయింది. అసలు ఇందిరే స్వయంగా ఓడిపోయారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా కాంగ్రేసేతర పార్టీ ఒకటి న్యూ ఢిల్లీలో ప్రప్రథమంగా అధికార పీఠాన్ని అధిష్ఠించింది.



అత్యవసర పరిస్థితిని ఎత్తివేసి ఎన్నికలు నిర్వహించవలసిన అవసరం ఇందిరాగాంధీకి లేనేలేదు. అయినా ఆశ్చర్యకరంగా ఆమె ఆ నిర్ణయం తీసుకున్నారు. అయితే, అంచనాలకు భిన్నంగా కాంగ్రెస్ మెజారిటీ పొందలేకపోయింది. ఇందిరే స్వయంగా ఓడిపోయారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా కాంగ్రేసేతర పార్టీ ఒకటి న్యూ ఢిల్లీలో అధికార పీఠాన్ని అధిష్ఠించింది. అసలు ఆ సార్వత్రిక ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ ఓడిపోవడం, భారత్ ఏకపార్టీ పాలనలో ఉండాల్సిన పరిస్థితి తొలగిపోవడం అనే మూడు ప్రధాన లక్షణాలతో పాటు 1977కి నాలుగో లక్షణాన్ని చేర్చవలసి ఉన్నది. సర్వశక్తిమంతమైన కాంగ్రెస్‌ను ఒక ఛత్రం కింద సమైక్యమైన వివిధ పార్టీలు ఓడించడం. కాంగ్రెస్‌ను ఓడించిన జనతాపార్టీ భిన్న భావజాలాలు, రాజకీయ కార్యక్రమాలు ఉన్న నాలుగు పార్టీల సంకీర్ణం.

అసలు ఆ సార్వత్రిక ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ ఓడిపోవడం, భారత్ ఏకపార్టీ పాలనలో ఉండాల్సిన పరిస్థితి తొలగిపోవడం అనే మూడు ప్రధాన లక్షణాలతో పాటు 1977కి నాలుగో లక్షణాన్ని చేర్చవలసి ఉన్నది. సర్వశక్తిమంతమైన కాంగ్రెస్‌ను ఒక ఛత్రం కింద సమైక్యమైన వివిధ పార్టీలు ఓడించడం. కాంగ్రెస్‌ను ఓడించిన జనతాపార్టీ భిన్న భావజాలాలు, రాజకీయ కార్యక్రమాలు ఉన్న నాలుగు పార్టీల సంకీర్ణం. నియంతృత్వాన్ని ఓడించి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలనే ఏకైక లక్ష్యంతో ఆ నాలుగు పార్టీలూ జనతా పార్టీగా ఏర్పడ్డాయి.

1977–2014 మధ్య కేంద్రంలో ఏ ఒక్క పార్టీ గానీ, కూటమి గానీ వరుసగా రెండుసార్లు కంటే ఎక్కువగా అధికారంలో లేదు. వరుసగా ప్రత్యామ్నాయపార్టీలు అధికారంలోకి రావడం భారత ప్రజాస్వామ్యానికి పెద్ద మేలు చేసింది. ఒకే ఒక్క పార్టీ సుదీర్ఘ కాలం అధికారంలో ఉండగలదన్న భయం తొలగిపోవడంతో ఆ మూడున్నర దశాబ్దాల కాలంలో మీడియా మరింత నిర్భీతితో స్వేచ్ఛగా తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించింది; సివిల్ సర్వీసులు స్వతంత్రంగా వ్యవహరించాయి; న్యాయవ్యవస్థ దృఢ వైఖరితో, నిర్భయంగా నిర్ణయాలు తీసుకుంది. ఏ పార్టీ కూడా సుదీర్ఘకాలం అధికారంలో లేకపోవడమన్నది భారత సమాఖ్య పాలనా విధానానికి కూడా మేలు చేసింది. రాష్ట్రాలు మరింత స్వతంత్రంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాయి. స్వేచ్ఛగా తమ సొంత రాజకీయ, సామాజిక ఎజెండాలను అనుసరించి ప్రజా శ్రేయస్సుకు తోడ్పడ్డాయి. ప్రస్తుత ఎన్నికలు ఆ ధోరణులను వెనక్కి మరలిస్తాయా? రాజకీయ పరిశీలకులు పలువురు అవుననే అంటున్నారు. భారతీయ జనతా పార్టీ వరుసగా మూడోసారి విజయం సాధిస్తుందని, నరేంద్రమోదీ వరుసగా మూడోసారి ప్రధాన మంత్రి కావడం ఖాయమని వారు గట్టిగా విశ్వసిస్తున్నారు. ఆ తరువాత ఏమి జరగనున్నది? మోదీ, బీజేపీ మూడోసారి గెలిస్తే 'దేశంలో ఇంకెంత మాత్రం ఎన్నికలు జరగబోవు' అని ప్రముఖ వ్యాఖ్యాత పరకాల ప్రభాకర్ చెప్పినమాటలను పలువురు ఉటంకిస్తున్నారు. ఇందిరాగాంధీ వలే మోదీలో కూడా పెత్తందారీ సహజాతాలు ఉన్నాయి. దేశ పాలనపై సంపూర్ణ ఆధిపత్యం వహించాలనే ఆకాంక్ష ప్రగాఢంగా ఉన్నది. అయితే ఇందిర నాటి రాజకీయ పరిస్థితులకు మోదీ కాలీన రాజకీయ పరిస్థితులకు మధ్య ఒక ముఖ్య వ్యత్యాసం ఉన్నది. 1977లో కాంగ్రెస్ ఒక్క రాష్ట్రం (తమిళనాడు–ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా న్యూఢిల్లీకి విధేయ పూర్వకంగా ఉండేవారు)లో మినహా దేశవ్యాప్తంగా అధికారంలో ఉన్నది. మరి 2014లో బీజేపీ దక్షిణాది రాష్ట్రాలలో ఎక్కడా అధికారంలో లేదు. తూర్పు, ఉత్తర భారత రాష్ట్రాలు చాలా వాటిలో కూడా అధికారంలో లేదు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

1975–77 సంవత్సరాల మధ్య ప్రజాస్వామిక ప్రతిపక్షాల గొంతును పూర్తిగా నొక్కివేయడంలో ఇందిర, కాంగ్రెస్ సఫలమయ్యాయి. ఇప్పుడు, మోదీ ఆశిస్తున్నట్టు లోక్‌సభలో 370 సీట్లను బీజేపీ గెలుచుకున్నప్పటికీ ప్రతిపక్షాల గొంతు నొక్కి వేయడం నరేంద్ర మోదీ, బీజేపీకి సాధ్యమయ్యే పని కాదు. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, తెలంగాణ మొదలైన రాష్ట్రాలలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు ఉంటాయి. మోదీ, షాలు వాటిని ఏమి చేస్తారు? ఆ రాష్ట్రాలలో అధికరణ 356ని విధిస్తారా? శాసన సభ్యులను కొనుగోలు చేస్తారా? ఆ మార్గాన్నో, ఈ మార్గాన్నో అనుసరించవచ్చు. అనైతిక రాజకీయాలకు వెనుకాడని మోదీ–షా ద్వయం ఏమైనా చేయవచ్చు. అయితే మోదీ మాయలో పడని, బీజేపీకి ఓటు వేయని లక్షలాది పౌరులు మోదీని ఆయన పార్టీని గట్టిగా వ్యతిరేకించటం ఖాయం. దేశంలోని చాలా ప్రాంతాలు బీజేపీ ప్రాబల్యాన్ని తిరస్కరించడం ఖాయం కనుక భారత్, అత్యవసర పరిస్థితి కాలం నాటి నియంతృత్వ పాలనా విధానాలకు పూర్తిగా మళ్లేందుకు ఆస్కారం లేదు. కలవరపడాల్సిన పరిస్థితి లేనప్పటికీ, ఎవరూ సంతృప్తికర భావంతో ఉండడానికి వీలు లేదు. ఎందుకని? బీజేపీ విద్వేష పూరిత, విభజనలను రెచ్చగొట్టే కరడుగట్టిన మితవాద హిందూత్వ భావజాలాన్ని ప్రజలలోకి ప్రభావశీలంగా తీసుకువెళుతోంది.

2007లో ప్రచురితమైన ఒక పుస్తకంలో భారత్‌ను '50–50' ప్రజాస్వామ్యంగా అభివర్ణించాను. దశాబ్దంన్నర అనంతరం ఆ పుస్తకాన్ని అప్‌డేట్ చేస్తూ ఆ వ్యాఖ్యను '30–70' ప్రజాస్వామ్యంగా మార్చాను. బీజేపీకి మూడోసారి మెజారిటీ లభిస్తే ఆ పతనం మరింత వేగవంతమవుతుంది. 1970ల్లో ఇందిరాగాంధీ తన నిరంకుశపాలనా విధానాలను కుటుంబ పాలనతో మిళితం చేయగా ఇప్పుడు నరేంద్ర మోదీ తన పెత్తందారీ పాలనను హిందూ మెజారిటేరియనిజంతో కలగలుపుతున్నారు. పరివార్ వాద్ చెడ్డది. బహు సంఖ్యావాదం అంత కంటే హానికరమైనది. ఇస్లామిక్, బౌద్ధ మతవాదుల మెజారిటేరియనిజం ప్రభావ పరిధిలోకి వెళ్లిన మన ఇరుగు పొరుగు దేశాల పరిస్థితులే ఇందుకు నిదర్శనం. హిందూ మెజారిటేరియన్ పాలన భిన్నంగా ఉండగలదని భావించేందుకు సహేతుకమైన కారణాలు కన్పించడం లేదు.

నియంతృత్వ పాలన మానవ స్ఫూర్తిని అణచివేస్తుంది. అధిక సంఖ్యాకవాదం హృదయాలను విషతుల్యం చేస్తుంది. అది ప్రోత్సహించే విద్వేషం, మత సంకుచితత్వం సమాజమంతటా కేన్సర్‌లా వ్యాపిస్తాయి. వ్యక్తుల, సమాజ సభ్యత, మర్యాద, దయాశీలత, మానవతను బలప్రయోగంతో హరించివేస్తాయి. అందుకే మెజారిటీ వాదం ఉత్థానాన్ని నియంత్రించాలి, ప్రతిఘటించాలి. అందుకు అవసరమైన ప్రజాస్వామ్య మార్గాలు మనకు ఇంకా అందుబాటులో ఉన్నాయి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ప్రజలు ఓడించినా పాఠం నేర్వరా...!?

ప్రజల్ని లెక్క చేయనివాళ్ళు, ప్రజల్ని గొర్రెలుగా భావించేవాళ్లు ఎంతటివారైనా, ఎన్ని వేల పుస్తకాలు చదివిన పాలకులైనా కాలగర్భంలో కలిసిపోతారు. విలన్‌గా మాత్రమే చరిత్రలో ఒక పేజీ వాళ్ళ కోసం ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆవిర్భవించిన టీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై ఇప్పటికీ సరిగ్గా ఆత్మ విమర్శ చేసుకున్న దాఖలాలు కానరావడం లేదు. పైగా 'పాలిచ్చే ఆవును వదిలిపెట్టి దున్నపోతును తెచ్చుకున్నారు' అనో, కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు మోసపోయి ఓట్లు వేశారనో ఆ పార్టీ నాయకులు కుంటి సాకులతో కాలం వెళ్ళదీస్తున్నారు. 2001లో టీఆర్ఎస్ చెప్పింది ఏమిటి? 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగింది ఏమిటి? అభివృద్ధా, విధ్వంసమా? అభివృద్ధి పేరిట భారీ విధ్వంసం జరిగిన మాట నిజం. అది ఒప్పుకోవడానికి బీఆర్ఎస్ నాయకత్వం సిద్ధంగా లేదు.

'కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశారు' అనే భాషలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం ముమ్మాటికీ తెలంగాణ ప్రజల్ని కించపరచడమే, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టినా పార్టీని సరిదిద్దుకోవాలన్న ఆలోచన లేదు. ఇంకా తామే అధికారంలో ఉన్నట్టుగా కేసీఆర్, కేటీఆర్ బాడీలాంగ్వేజ్ కనిపిస్తున్నది.

రెండేళ్ల ముఖ్యమంత్రి పదవి కోసం ఒక పెద్ద ప్రాంతీయ ఆత్మాభిమాన ఉద్యమానికి నాయకుడు కాగలిగిన అవకాశాన్ని మర్రి చెన్నారెడ్డి చేజార్చుకోగా, కేసీఆర్ దాన్ని అందిపుచ్చుకున్నారు. అయితే ఆయన చేసిందేమిటి? తెలంగాణ ప్రజల ఆత్మాభిమానాన్ని చావుదెబ్బ కొట్టారు. నీళ్లు – నిధులు – నియామకాల కంటే 'ఆత్మగౌరవం' అత్యంత ముఖ్యమైన అంశమనే సంగతి మరచిపోయి 'రాచరికపు' పోకడలకు పోయారు. తన ఫార్మ్ హౌజ్‌లో మొక్కలు, చెట్లతో మాట్లాడ దానికే ఎక్కువ సమయం కేటాయించి, ప్రజలతో, పార్టీ కార్యకర్తలతో, నాయకులతో మాట్లాడడానికి నిరాకరించారు. ప్రజలు, విలేకరులు, మేధావులు... అందరినీ బానిసలుగానే ట్రీట్ చేశారు. కేసీఆర్‌లోని ఆ 'కులం' పునాదుల్లో ఉన్న ఫ్యూడల్ భావజాలం 2014 తర్వాత నిర్లజ్జగా బయటపడింది. పోనీ అమెరికాలో ఉద్యోగం చేసి వచ్చిన కేటీఆర్ ఆధునిక యువ నేతగా అవతరిస్తారని వేసిన అంచనా తప్పింది. ఆయన ఒక రాజకీయ నాయకునిగా గుర్తింపు పొందడం కన్నా ఒక 'సెలెబ్రిటీ'గా తనను తాను ఆవిష్కరించుకునే ప్రయత్నం మీదే ఎక్కువ దృష్టి పెట్టారు. కేటీఆర్ 'దొరతనం' ప్రదర్శన ఎట్లా ఉంటుందో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కడియం శ్రీహరి వంటి నేతలు చవి చూశారు.

ప్రపంచాన్ని శాసించగలవారు సైతం దొంగిలించలేని సంపద ప్రజల జ్ఞానం. కానీ తానే సర్వజ్ఞానినని, తనకు తెలియని విషయమే లేదన్న కేసీఆర్ అహంకార ధోరణి ఆ పార్టీని పతనం అంచుకు తీసుకువెళ్లింది. మావోయిస్టుల ఉద్యమాల ఫలితంగా తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థ బలహీనపడింది. దాన్ని మరో రూపంలో పునరుద్ధరించి, బలోపేతం చేసిన అపఖ్యాతిని కేసీఆర్ మూటగట్టుకున్నారు. మావోయిస్టులంటే ఆయనకు చలిజ్వరం. అందువల్లనే ఆయన 1999లో చింతమడకలో తన ఓటు హక్కును వినియోగించుకోలేదన్న సంగతి ఎంతమందికి తెలుసు?

తెలంగాణ ఏర్పాటుకు ముందున్న పరిస్థితికీ, పదేండ్ల కేసీఆర్ పాలనకీ మధ్య మౌలిక మార్పు ఏమిటి? వలసీకరణ, నగరాన్ని నమిలి మింగిన రియల్ ఎస్టేట్ కంపెనీలు, పాలిచ్చే తల్లి రొమ్ము గుద్దే సినిమా రంగం... ఇంకా ఇతరత్రా అరాచకాలలో తేడా ఏమి వచ్చింది? పదేళ్ళల్లో జరిగిన బాగోతాలు



ఒక్కొక్కటిగా బయటపడుతుంటే తెలంగాణ ప్రజలు దిగ్భ్రాంతికి గురవుతున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కేసీఆర్ కూతురు కవిత పాత్ర; ఎక్కడ భూమి కనిపించినా 'యువరాజు' ఆదేశాల మేరకు ఆయన వంది మాగధులు గద్దల్లా వాలిపోవడం; ఫోన్ ట్యాపింగు నేరాలు; పెద్ద ప్రాజెక్టుల పేరిట దోపిడీ; ఇసుక, గనులు, మద్యం వ్యాపారాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎట్లా ఇమిడిపోయారో, అభివృద్ధి ముసుగులో చేసిన దుర్మార్గాలేమిటో తెలంగాణ ప్రజలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రియలెస్టేట్ రంగం కుప్పకూలిపోయిందంటూ కేసీఆర్, కేటీఆర్ ఒకే భాష మాట్లాడుతున్నారు. ఆ రంగం గురించి వాళ్లకు ఎందుకు బెంగ పట్టుకుందో అర్థం చేసుకోవడం కష్టం కాదు.

టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా పేరు మార్చిన వేళ నేల విడిచి సాము చేస్తున్నట్టుగా కేసీఆర్‌కు ఎవరూ చెప్పలేదు. చెప్పినా ఆయన వినే రకం కాదు కనుక ఎవరూ ఆ ధైర్యం చేయలేదు. అదే టీఆర్ఎస్ పతనానికి బీజం వేసిందని ఇప్పటికీ ఆ పార్టీలో సాహసించి బహిరంగంగా చెప్పలేకపోతున్నారంటే ఇంకా ఆ పార్టీలో 'ఏక పాత్రాభినయం' ఎంత కర్కశంగా ఉందో అర్థమవుతోంది. తమ పార్టీ క్యాడర్ కింది స్థాయిలో బలంగా ఉందంటూ కేటీఆర్ నమ్మబలుకుతున్నారు. కానీ నమ్మడానికి క్షేత్రస్థాయిలో ఎవరూ సిద్ధంగా లేరు. ఆ పార్టీ 2001లో నిర్మాణపరంగా ఎంత బలహీనంగా ఉందో ఇప్పుడూ అలాగే ఉందని కేసీఆర్, ఆయన కొడుకు ఒప్పుకోరు.

వాళ్ళకు ఇంకా కొన్ని భ్రమలున్నవి. రేవంత్ రెడ్డి ఐదేళ్లు కొనసాగరని బీఆర్ఎస్ నేతలు బలంగా నమ్ముతున్నారు. కేసీఆర్, కేటీఆర్ అదే ప్రచారం సాగిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత రేవంత్ రెడ్డి బీజేపీలోకి చేరిపోతారని కూడా కేటీఆర్ జోస్యం చెప్పేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిల ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి ట్యాప్ చేస్తున్నారంటూ కేటీఆర్ తాజా ఆరోపణ. ఇందులో ఎంత నిజముందో ఆయనే ఆధారాలు ఇవ్వాలి. రేవంత్ మంత్రి మండలిని డిస్టర్బ్ చేయడమనే మానసిక యుద్ధానికి చెందిన ట్రిక్కు కావచ్చు.

కాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కన్నా, రేవంత్ సీఎం కావడం బీజేపీ, కేసీఆర్ కుటుంబానికి బొత్తిగా ఇష్టం లేదు. కేసీఆర్, కేటీఆర్‌లు బహిరంగంగా చెప్పకపోవచ్చు గానీ వాళ్ళ మనసులో 'కెప్టెన్ ఉత్తమ్, భట్టి వంటి వారు సీఎం అయితే బాగుండేది' అని ఉండవచ్చు. రేవంత్ రెడ్డి పొటెన్షియల్ నాయకుడని, మడమ తిప్పని నేత అని, పైగా ఓటుకు నోటు కేసులో జైలుకు వెళ్లి వచ్చిన కారణంగా పగతో రగిలిపోతున్నందున తమకు కష్టాలు తప్పవని కేసీఆర్, కేటీఆర్ అనుకుంటున్నారు.

కేసీఆర్ అంటే టీఆర్ఎస్ – టీఆర్ఎస్ అంటే కేసీఆర్. ఇదే 23 సంవత్సరాలుగా చూస్తున్నాం. పార్టీ నిర్మాణం ఎక్కడున్నది? ఉద్యమకారులను ఖాతరు చెయ్యలేదు. శ్రేయోభిలాషుల హితవులు చెవికెక్కలేదు. దానం నాగేందర్, కడియం శ్రీహరి, ఎర్రబెల్లి దయాకరరావు, తలసాని, గుత్తా సుఖేందర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి... వంటి ఎందరో కాంగ్రెస్, టీడీపీ నేతల వలసలను ప్రోత్సహించవలసిన అవసరం ఏమిటి? కేసీఆర్ ఒకరి మాట వినరు. ఒకరిని ఆయన సలహా అడగరు. ఆయన మాటే శాసనం. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన కోదండరాం, ఈటల రాజేందర్ లాంటి వారి పరిస్థితి కళ్ళ ముందున్నది.

ఇక 'కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశారు' అనే భాషలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం ముమ్మాటికీ తెలంగాణ ప్రజల్ని కించపరచడమే. వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టినా పార్టీని సరిదిద్దుకోవాలన్న ఆలోచన లేదు. ఇంకా తామే అధికారంలో ఉన్నట్టుగా కేసీఆర్, కేటీఆర్ బాడీలాంగ్వేజ్ కనిపిస్తున్నది.

సరే, ప్రజలు కేసీఆర్‌ను తిరస్కరించి రేవంత్ రెడ్డికి అధికారం ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారనో, తమను సమన్వయం చేసుకోకుండా వెళ్తున్నారనో 'గొణుగుడు' నెమ్మదిగా వినిపిస్తోంది. ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని కేసీఆర్ వలె తప్పిదం చేయరని కాంగ్రెస్ నాయకులు ఆశిస్తున్నారు.

■ ఎస్.కె. జకీర్
జర్నలిస్ట్

హక్కుల సాధనకు 'ఇంద్రవెల్లి' స్ఫూర్తి

అటవీ, పోడు భూములపై ఆదివాసీలకే హక్కులు కల్పించాలనీ, అటవీ వనరుల దోపిడీని అరికట్టాలనీ, వర్తక–వ్యాపారుల తూనికలు, తూకాలు, కొలతలు–మోసాలను నిర్మూలించాలనీ ఆదివాసీలు నినదించారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర ఏర్పాటు, అటవీ ఉత్పత్తుల కొనుగోలులో వస్తుమార్పిడి విధానం రూపుమాపడం. భూమి పుత్రులపై ప్రాంతేతరుల దాడులను తిప్పికొట్టాలని గిరిజన గూడేలలో తుడుం మోగించారు. అమాయకపు ఆదివాసులను సోయికి తెచ్చేందుకు 'గిరిజన రైతుకూలీ సంఘం' 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో ప్రథమ మహాసభ నిర్వహించడానికి సన్నాహం చేసింది. ఆర్డీవో, పోలీసుల నుంచి అనుమతిని పొంది, గిరిజన గూడాల్లో తుడుం మోగించింది. కరపత్రాలు, గోడ పత్రికలతో, కళా జాతాలతో విస్తృతంగా ప్రచారం చేసింది. నానాటికీ సభా నిర్వహణకు సానుభూతి, సానుకూలత పెరుగుతుంటే, దోపిడీదారులు ఎలాగైనా సమావేశాన్ని విచ్ఛిన్నం చేయాలని కుట్ర పన్నారు. తర్వాత రైతుకూలీల సభకు అనుమతి రద్దు చేసి, 144 సెక్షన్ విధించారు. విషయం తెలియని ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. అధిక సంఖ్యలో ఆదివాసీలు అమరులయ్యారు. ఈ మానవ హననం జలియన్ వాలాబాగ్ దుర్ఘటన తలపించే ఊచకోతగా చరిత్రలోనే రక్తాక్షరాలతో నమోదైంది. అడవి తల్లికి మానని గాయంగా మిగిలిపోయింది.

ఇంద్రవెల్లి అమరుల పోరాట స్ఫూర్తితో ఆదివాసులు, ఆదివాసేతరులు, కవులు, కళాకారులు, మేధావులు, ప్రజాసంఘాలు ఐక్యమవుతూ అడవి నుంచి ఆదివాసుల గెంటివేతకు వ్యతిరేకంగా, పోడు భూముల పట్టాలకై పోరాడాలి. ప్రభుత్వం 1/70 చట్టం, పెసా చట్టం, 5వ షెడ్యూల్, జీవో నెం.3ని, 2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలి. ఆదివాసీ గూడాలలో ఎత్తివేసిన పాఠశాలలను పునరుద్ధరించాలి. గిరిజన యూనివర్సిటీలను నిర్మాణం చేయాలి. ఆదివాసులనే ఉపాధ్యాయులుగా నియమించాలి ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీతో ఆదివాసీ ప్రాంతాల్లో ఆదివాసీ యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించాలి. 29 శాఖల్లో ఉన్న జీవోలను చట్టం చేసి ఆ శాఖల్లో ఉన్న ఉద్యోగాల్లో ఆదివాసీలను నియమించాలని, ఆదివాసీ గ్రామాలలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదివాసీలు డిమాండ్ చేస్తున్నారు. జల్, జంగల్, జమీన్, ఖూత్ అధికారం దక్కే వరకు ఇంద్రవెల్లి అమరుల స్ఫూర్తితో పోరాడుతూ దోపిడీ పాలకవర్గాల ప్రభుత్వాలను కూల్చివేసి ఏజెన్సీలో ఆదివాసీ స్వయంపాలన కోసం పోరాడాలి. అప్పుడే ఇంద్రవెల్లి అమరుల ఆశయం నెరవేరుతుంది.

– వూకె రామకృష్ణ దొర

(నేడు ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ)

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



BIG DEBATE
Coming Soon

బిగ్ డిబేట్ పాత వీడియోలకోసం క్లిక్ చేయండి
Click here

ఎన్నికలు - 2024



లోక్‌సభ ఎన్నికలు

లోక్‌సభ ఎన్నికల కవరేజీ కోసం క్లిక్ చేయండి
Click here

ఎన్నికలు - 2024



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కవరేజ్ కోసం క్లిక్ చేయండి
Click here



సీఎం ప్రసంగ సమయంలో కేరింతలు కొడుతున్న కార్యకర్తలు

శ్రేణుల్లో జోష్

- మానుకోటలో ముఖ్యమంత్రి తొలిసభ సక్సెస్
- మండుటెండలో వచ్చి.. గంటన్నర వేచి ఉన్న సీఎం
- వేడిమిలోనూ 23 నిమిషాలు ప్రసంగం
- జనం చప్పట్లు, కేరింతలతో మార్మోగిన ప్రాంగణం

మహబూబాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మానుకోట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం సాయంత్రం నిర్వహించిన 'జనజాతర సభ' సక్సెస్‌తో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక రేవంత్‌రెడ్డి తొలిసారి మహబూబాబాద్ పట్టణంలో జరిగిన సభకు హాజరవడంతో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. రేవంత్‌రెడ్డి ఉత్తేజపూరిత ప్రసంగం హస్తం పార్టీ నేతల్లో జోష్ నింపింది. స్వరాష్ట్రంలో పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణలో అత్యధిక స్థానాల్లో ఎంపీలను గెలుచుకునేలా ప్రణాళికలు రచిస్తూ.. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో మూడుసభలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్న కాంగ్రెస్.. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత అటు మహబూబ్‌నగర్‌లో రోడ్‌షో చేపట్టగా, మొదటగా మహబూబాబాద్‌లో తొలి జనజాతర సభను నిర్వహించడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండడంతో సభ విజయవంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా

మిగతా 7వ పేజీలో..



మహబూబాబాద్ జనజాతర సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



సభకు హాజరైన జనం

మానుకోట 'జన జాతర'లో ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మానుకోట ఎప్పటికీ.. కాంగ్రెస్ కంచుకోటే

- దశాబ్దం పాటు దగా చేసిన బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓట్లు అడగడానికి సిగ్గుండాలి
- ఉక్కు, కోచ్ ఫ్యాక్టరీలను అడ్డుకున్న బీజేపీ
- కమ్యూనిస్టులతో రేపో, మాపో 'కూటమి' చర్చలు పూర్తి
- మహబూబాబాద్ కాంగ్రెస్ జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మానుకోట ఎప్పటికీ కాంగ్రెస్ కంచుకోట గానే ఉంటుందని, ఈ ప్రాంతానికి దశాబ్దకాలం పాటు అన్యాయం చేసిన ద్రోహులు బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓట్లు అడగడానికి సిగ్గుండాలి అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ జనజాతర సభలో ఆయన మాట్లాడుతూ... గతంలో పార్లమెంట్‌లో తెలంగాణ వద్దన్న మోదీ.. ఇప్పుడు తెలంగాణ అభివృద్ధి అడ్డుకుంటున్నారని విమర్శించారు. అలాంటి బీజేపీకి ఓట్లు వేయాలంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఓట్లు ఏం మొఖం పెట్టుకుని అడుగుతున్నారని, ఆయనకు సిగ్గుండాలని ధ్వజమెత్తారు. ఇక ఇండియా కూటమితో కలిసి రావడానికి కమ్యూనిస్టులు, తెలంగాణ జనసమితి, ప్రజాసంఘాలతో చర్చించే బాధ్యతను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అప్పగించామని, రేపో, ఎల్లుండో ఆ చర్చలు పూర్తవుతాయన్నారు. తద్వారా కలిసొచ్చే ప్రజాస్వామ్య శక్తులతో ఇండియా కూటమి గెలుపు ఖాయమని, రాహుల్‌గాంధీ ప్రధానిగా ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం తథ్యమన్నారు. తెలంగాణలో సర్పంచ్‌ల స్థాయి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల వరకు పదేళ్ల పాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా... మహబూబాబాద్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. అలాంటి అభివృద్ధి చేయని బీఆర్ఎస్‌ను గత అసెంబ్లీ ఎన్నికల్లో బండకేసి కొట్టారని గుర్తు చేశారు. తిరిగి లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు.



సీఎంకు నాగలి, భద్రాద్రి సీతారామచంద్రస్వామి జ్ఞాపికలను బహూకరిస్తున్న నాయకులు

బీజేపీ, బీఆర్ఎస్ తోడుదొంగలు..

ఢిల్లీలో మోదీ... తెలంగాణలో ఫాంహౌజ్ కేడీ ఇద్దరు తోడు దొంగలేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం కుదిరిందని, అందుకే రాష్ట్రంలో ఐదు సీట్లలో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. రైతు వ్యతిరేక నల్లచట్టాలు, 370 ఆర్టికల్, తదితర అమలుకు మోదీకి అండగా నిలబడి గెలిపించాయన్నారు. ఆ కవిత ఐనా.. ఈ కవిత ఐనా ఒక్కటేనంటూ కల్వకుంట్ల కవితను, మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవితను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసిన ఆయన బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, వరంగల్‌కు

మిగతా 7వ పేజీలో..



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మానుకోట ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్



అదాలత్ జంక్షన్‌లో గాలిలోకి బెలూన్లను వదులుతున్న కలెక్టర్, ఇతర అధికారులు

జవాబుదారీతనం కలిగిన నాయకుడిని ఎన్నుకోవాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- అదాలత్ జంక్షన్‌లో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 19: సమర్థత, పారదర్శకత, జవాబుదారీతనం కలిగిన నాయకుడిని రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఓటర్లకు సూచించారు. హనుమకొండలోని అదాలత్ జంక్షన్‌లో శుక్రవారం ఓటు ప్రాముఖ్యతపై కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ఓటు నమోదు శాతాన్ని పెంచాలన్నారు. ఓటర్లు కానుకలు, డబ్బులకు లొంగి తల్లిలాంటి ఓటును అమ్ముకుని మోసపోవద్దన్నారు. తాత్కాలిక అవసరాలకు లొంగిపోయి ఓటు వేస్తే ప్రశ్నించే అవకావం కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వం సక్రమంగా నడవాలంటే ఓటర్లే కీలకమని, ఆలోచించి ఆత్మశోధన చేసుకుని ఓటు వేయాలన్నారు.

ఈ ఎన్నికల నేపథ్యంలో దివ్యాంగులు, చూపులేని, బధిరులకు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీల్ చైర్, ర్యాంపు సంకేత భాష, బ్రెయిలీ లిపి బ్యాలెట్ పేపర్ లాంటి సౌకర్యాలు, వయోవృద్ధులకు వలంటీర్లు సహాయం అందజేస్తారన్నారు. ఈ సందర్భంగా జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు పాడిన ఓటమ్మ ఓటు.. ఓటమ్మ ఓటు.. చందా మామయ్యలో, ప్రజాస్వామ్య మనుగడకు ఓటు ఆయుధం అనే పాటలు ఆకట్టుకున్నాయి. ఓటు ఫర్ ష్యూర్.. నేను తప్పకుండా ఓటు వేస్తాను.. లాంటి నినాదాలతో అదాలత్ ప్రాంతం మారుమోగింది. అనంతరం జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు గాలిలోకి బెలూన్లను వదిలేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, రాధికా గుప్తా, అసిస్టెంట్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో పాటు ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

శుక్రవారం ఉష్ణోగ్రతలు	
గరిష్ఠం : 38.0° C	కనిష్ఠం : 22.0° C

నీ జాతకం బయటపెడతా..

- వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించను
- పార్టీలకు వెన్నుపోటు పొడవడం నీకు అలవాటే..
- ఏ వ్యాపారం చేశావని ఇక్కడ ఇల్లు, హైదరాబాద్‌లో ఫ్లాట్లున్నాయి?
- ఎమ్మెల్యే కడియంపై బీజేపీ అభ్యర్థి అరూరి ఆగ్రహం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

హనుమకొండ టౌన్, ఏప్రిల్19: తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ఖబర్దార్.. నీ జాతకమంతా బయటపెడుతా.. అని వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ కడియం శ్రీహరిని హెచ్చరించారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని వరంగల్ బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ.. పూటకో రకంగా మాట్లాడుతున్న కడియం మాటలకు ఊసరవెల్లే తలదించుకునేలా ఉందని ఎద్దేవా చేశారు. మాదిగలకు ఏమి చేశావని ఆ జాతి బిడ్డలు ప్రశ్నిస్తుంటే ఆ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్‌కి వెన్నుపోటు పొడిచి చంద్రబాబు వంచన చేరాడని, అక్కడ అదే వైఖరితో వ్యవహరించి కేసీఆర్ చెంతన చేరి డిప్యూటీ సీఎం, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేగా పదవులు అనుభవించాడన్నారు. తాజాగా బిడ్డకు ఎంపీ టికెట్ చేజిక్కించుకొని చివరికి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరాడని ఆరోపించారు. వర్ధన్నపేటలో అభివృద్ధి జరగలేదని అసత్య వ్యాఖ్యలు చేస్తున్న కడియం.. మంత్రిగా ఉన్న సమయంలో వర్ధన్నపేట పర్యటనకు వచ్చి 'అరూరి రమేశ్ హుషారు.. నిధులన్నీ వర్ధన్నపేటకు తెచ్చుకొని అభివృద్ధి చేశాడు' అని ఆనాడు వివరించిన విషయాన్ని మరిచిపోయావని గుర్తుచేశారు. భూ బకాసురుడు అంటే.. తాను ఎవరి భూములను గుంజుకోలేదన్నారు. మొదటి నుంచి వ్యాపారాలు చేసుకొని కష్టపడి ఎదిగానన్నారు. కానీ ఏ వ్యాపారం లేని కడియం.. ఇన్నేళ్ల రాజకీయంలో ఎలా రాణిస్తున్నాడని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మై హోమ్ గెటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్స్ ఎలా వచ్చాయన్నారు. హనుమకొండలో ఇంద్రభవనం లాంటి ఇల్లు ఎలా నిర్మించావో ప్రజలకు తెలపాలన్నారు.

రూ.60వేలకు వర్ధన్నపేటలో ఔట్‌సోర్సింగ్ వైద్యురాలిగా పనిచేసిన కావ్య.. ఇన్నోవా వెహికల్, డ్రైవర్, పీఏను ఎలా కేటాయించుకుందో బహిరంగంగా చెప్పాలని అరూరి పేర్కొన్నారు. తన ఆస్తులను 2009 ఎన్నికల అఫిడవిట్‌లోనే పొందపర్చానని, తనకు అవి ఎలా వచ్చాయో విచారణ చేసుకోవచ్చన్నారు. తన రాజకీయ ఎదుగుదలలో కడియం ఉండంటం కాదు.. కడియం మొదటి సారిగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా గెలవడంలో తనపాత్ర ఉందన్నారు. ఆ ఎన్నికల్లో మద్దతు కావాలని బజాజ్ చేతక్ స్కూటర్‌పై తన దగ్గరికి వచ్చి ప్రాధేయపడ్డ విషయం మరవొద్దన్నారు. ఎన్నికల్లో లబ్ధికోసం బద్‌నామ్ చేసేందుకు తనపై కుట్రలు చేస్తున్నాడని, ప్రజలు గమనించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే తరహాలో వెన్నుపోటు పొడిచాడని అరూరి ఆరోపించారు. లోకల్, నాన్‌లోకల్ గురించి తాను మాట్లాడితే.. దానిని కప్పిపుచ్చుకోవడానికి రాజకీయాల గురించి మాట్లాడకుండా వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాదిగ జాతిలో ఎవరైనా ఎదిగితే కడియం ఓర్వలేడని ఆరోపించారు. ఆయనకు ఆయన మచ్చలేని వ్యక్తినని సర్టిఫికెట్ ఇచ్చుకుంటే సరిపోదన్నారు. అన్నదమ్ములు గెట్లు జరుపుకుంటేనే గొడవలు పెట్టుకుంటున్న తరుణంలో.. వేరే వాళ్ల భూములను కబ్జాచేసే ఖర్మ తనకు లేదన్నారు.

పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సరిహద్దులో పంచాయితీలు, కశ్మీర్ కష్టాలను తీర్చిందన్నారు. అవినీతి ఆరోపణలు లేకుండా సుస్థిర పాలన అందించిందన్నారు. బీజేపీ వస్తే రాజ్యాంగం మారుస్తారని అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా రాజ్యాంగం ఉందని, దాన్ని మార్చే ఆలోచనలేదని మోదీనే స్వయంగా చెప్పిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు పద్మ, రవికుమార్, మురళీధర్, ప్రదీప్‌రావు, సంతోష్‌రెడ్డి, మహిళా మోర్చా నాయకులు సుగుణారెడ్డి, కవిత, పద్మ, శైలజా తదితరులు పాల్గొన్నారు.



క్యూసీ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న కమిషనర్

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- క్వాలిటీ కంట్రోల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 19: కాంట్రాక్టర్లు చేసే పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, అప్పుడే చేసిన పనులు ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని క్వాలిటీ కంట్రోల్(క్యూసీ) కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. అక్కడి పనులకు సంబంధించిన రిజిస్ట్రర్లు పరిశీ లించారు. ఇంకా నాణ్యతా నిర్ధారణ విధానాన్ని అక్కడి ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమి షనర్ మాట్లాడుతూ.. ఇండియన్ స్టాండర్డ్ (ఐఎస్) ప్రమాణాల ఆధారంగా నాణ్యత నిర్ధారణ జరగాలని, ఎప్పటికప్పుడు నూతన విధినాలను అధ్యయనం చేస్తూ నాణ్యతను నిర్ధారించాలన్నారు. అనంతరం అక్కడి అధికా రులు కమిషనర్ ఎదుట కోర్ కటింగ్ విధానాన్ని పరిశోధనాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో ఈఈ సంజయ్‌కుమార్, ఏఈ కార్తీక్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీఏలో పనికో రేటు..

- లైసెన్సుల జారీలో వంతుల వారీగా వసూళ్లు
- చేయి తడిపితే క్షణాల్లో పనులు
- ముడుపులిస్తే వాహనం లేకుండానే ఫిట్‌నెస్
- హోదాల వారీగా అధికారులకు పంపకాలు
- అధికారుల కనుసన్నల్లో బాగోతం



వరంగల్ క్రైం, ఏప్రిల్ 19: జిల్లా రవాణాధికారి కార్యాలయం వసూళ్లకు నిలయంగా మారింది. వాహనాల రిజిస్ట్రేషన్‌లు, లైసెన్స్‌లు, వాహనాల ఫిట్‌నెస్‌లు తదితర అవసరాల కోసం వచ్చే వారి జేబులు గుల్ల చేస్తున్నారు. పనిని బట్టి రేటు ముడుపులు తీసుకుంటున్నారు. లేదంటే నిబంధనల పేరిట పనులు జాప్యం చేస్తారనే విమర్శలు ఉన్నాయి. తొలుత లైసెన్స్‌లు తీసుకునే వాహనదారులు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. స్లాట్‌లో పేర్కొన్న తేదీన కార్యాలయం వెళ్లి పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది. పర్మినెంట్ లైసెన్స్‌కు కూడా ఇదే నిబంధనలు ఉంటాయి. కానీ ఈ నిబంధనలకు విరుద్ధంగా కార్యాలయంలో జరుగుతోందనే విమర్శలున్నాయి. వాహనాల రిజిస్ట్రేషన్‌లు, ఓవర్ లోడ్ దందా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ, టాక్స్ పేమెంట్లు.. ఇలా ప్రతీదానికి ఓ రేటు చొప్పున కార్యాలయ సిబ్బంది వసూళ్లు చేస్తారనే విమర్శలున్నాయి. కార్యాలయంలో జరిగే దందా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలున్నాయి.

చేయి తడిపితేనే లైసెన్స్

చేయి తడిపిన వారికి నిబంధనలు, పరీక్షలులాంటి ఏమీ లేకుండానే లైసెన్స్‌లు జారీ అవుతాయని సమాచారం. లెర్నింగ్ లైసెన్స్ తీసుకునే ద్విచక్రవాహనదారులు రూ.450 చెల్లించి ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. లర్నింగ్ లైసెన్స్ జారీ అయిన నెలరోజుల తర్వాత పర్మినెంట్ లైసెన్స్ కోసం రూ.1450 చెల్లించి డ్రైవింగ్ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. అయితే దీని కోసం ఏజెంట్లను ఆశ్రయించే వారు అదనంగా రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తంలో ఏజెంట్‌కు రూ.500, కార్యాలయం సిబ్బంది రూ.500 తీసుకుంటారని సమాచారం. ఏజెంట్ల ద్వారా వెళ్లిన వారికి పరీక్ష లేకుండానే లర్నింగ్ లైసెన్స్ జారీ చేస్తున్నట్లు సమాచారం. ఇక పర్మినెంట్ లైసెన్స్ కోసం అధికారికఫీజుతో పాటు అదనంగా ఏజెంట్‌కు రూ.1500 చెల్లిస్తే ఎలాంటి టెస్టులు లేకుండా చేతిలో లైసెన్స్ ఉంటుందని సమాచారం. ఫోర్‌వీలర్ కోసం దరఖాస్తు చేసుకునే వారి నుంచి రూ.2500కు పైగానే వసూలు చేస్తారని

మిగతా 8వ పేజీలో..

మీసం తిప్పి.. తొడగొట్టి..

- కడియంపై రాజయ్య ఆగ్రహం
- ప్రసంగంతో కార్యకర్తల్లో జోష్..



రాంనగర్, ఏప్రిల్ 19: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పార్టీని వీడి ఇటీవలే తిరిగి బీఆర్ఎస్‌లో చేరిన రాజయ్య కార్యకర్తల్లో ఉత్సాహం నింపాడు. నాలుగు రోజుల కిందట స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కడియం శ్రీహరిపై మీసం మెలేశాడు.. పశ్చిమ నియోజకవర్గ సమావేశంలో తనదైన శైలిలో ప్రసంగించారు. 'కడియం నీ అంతు చూస్తా.. నిన్ను రాజకీయంగా భూస్థాపితం చేయడమే నా పని..' అంటూ మీసం మెలేసి, తొడగొట్టి మరీ రాజయ్య సవాల్ విసిరారు. 'సిగ్గుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెసి మళ్లీ పోటీ చెయ్.. అప్పుడు చూపిస్తాం.. మా తడాఖా' అన్నారు. కడియం దళిత ద్రోహి, కుట్రదారుడని ఆరోపించారు. టీడీపీ హయాంలో లంచాలు దండుకున్న కడియం.. నీతిమంతుడేమీ కాదని ఆరోపించారు. కడియంను స్టేషన్‌ఘనపూర్ రిజర్వాయర్‌లో తొక్కుతామని ధ్వజమెత్తారు. అలాగే తెలంగాణ పాటలకు ఈలలు వేస్తూ డాన్స్‌లు చేశారు. మొత్తంగా రాజయ్య ప్రసంగిస్తున్నంత సేపు హాల్ దద్దరిల్లడం విశేషం.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, ఏప్రిల్19: నిబంధనలు ఉల్లఘించిన 20మంది వాహ నదా రులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ షూకూర్ తెలిపారు. 20 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రమేశ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 10 మందికి 7,000 డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 10 మందికి రూ. 7,000 జరిమానాను విధించారన్నారు.

స్వార్థంతోనే ఆర్జేడీ కార్యాలయం తరలింపు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19: ఇంటర్మీడియె ట్ విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయం(ఆర్జేడీ) హైదరా బాద్‌కు వెళ్లి సంవత్సర కాలం పట్టకుండానే తిరిగి వరంగల్‌లో ఏర్పాటు చేయాలని వచ్చిన ఉత్తర్వుల వెనుక చర్చనీయాంశ అంశాలున్నాయి. కడప, రాజమండ్రి, గుంటూరు, వరంగల్ ప్రాం తాల్లో ఇంటర్మీడియెట్ విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయా లను ఏర్పాటు చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1991లో అప్పటి ప్రభుత్వం జీవో నెం.139 ఉత్తర్వులను జారీ చేసింది. అందుకు అనుగుణంగా వరంగల్‌లో 1999లో ఆర్జేడీ కార్యాలయం ప్రారంభం అయ్యింది. అప్పటి నుంచి వరంగల్ కేంద్రంగా అప్పటి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ఇంటర్మీడియెట్ ఉద్యోగులకు వివిధ సేవలు అందిస్తూ వచ్చింది. గత ఏడాది ఆర్జేడీ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి తన సౌలభ్యం కోసం వరంగల్ ఆర్జేడీ కార్యా లయాన్ని హైదరాబాద్‌కు తరలించే ందుకు అప్పటి కమిషనర్ నవీన్ మిట్టల్‌తో ఉత్తర్వులు జారీ చేయించినట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చా యి. కమిషనర్ తన విచక్షణా ధికారాలతో కార్యా లయాన్ని తరలించాలని ఉత్తర్వులు జారీ చేశా రు. అయితే అప్పటి నుంచి నేటి వరకు ఆర్జేడీ, ఏవోలు వేతనాలు మాత్రం వరంగల్ నుంచే తీసుకుంటుండటం గమనార్హం. ఆర్జేడీ కార్యాల యాన్ని వరంగల్ నుంచి ఎత్తివేయాలంటే జీవో నెం. 139ని ప్రభుత్వం రద్దు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేయక పోవడం, సదరు ముఖ్యఅధికారి స్వలాభం కోసం కార్యాల యాన్ని తరలించడాన్ని సవాల్ చేస్తూ అధ్యాపక సంఘాల నాయకులు ఇద్దరు మంత్రు లను ఆశ్రయించి వారికి అసలు విషయం చెప్పా రు. దీంతో ప్రభుత్వం ఇంటర్ ఆర్జేడీ కార్యాల యాన్ని తిరిగి వరంగల్‌లోనే పునఃప్రారం భించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో అధ్యాపకులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఔట్ సోర్సింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 19 : నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు 12 పోస్టులకు ఈ నెల 24వ తేదీ లోపు దర ఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కిషన్ శుక్రవారం తెలిపారు. పోస్టుల వివరాలిలా వున్నాయి. డిసెక్షన్ హాల్ అటెండర్ల పోస్టులు-4 ఉన్నాయని, వీటికి దరఖాస్తు చేసుకునేవారు 10వ తరగతి లేదా సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని, అనాటమీ డిసెషన్ లేదా ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో కనీసం సంవత్సరం అనుభవం ఉండాలన్నారు. ల్యాబ్ అటెండర్ పోస్టులు-4. ఇందుకు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ ఎంఎల్‌టీ లేదా డీఎంఎల్ టీలో డిగ్రీ లేదా డిప్లొమా కలిగి ఉండడంతో పాటు తెలంగాణ పారామెడికల్ బోర్డుతో గుర్తింపు పొందాలన్నారు.

అలాగే థియేటర్ అనస్థీషియా అసిస్టెంట్ -4 పోస్టులకు దరఖాస్తు చేసు కునే వారు అనస్థీషియా అసిస్టెంట్ కోర్సులో బీఎస్సీ ఎంఎల్‌టీ లేదా ఎంఎల్‌టీ ఉత్తీర్ణులై ఉండాలని, అలాగే తెలంగాణ పారామెడికల్ బోర్డుతో గుర్తింపు పొందాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను పూరించి నర్సం పేట ఏరియా ఆస్పత్రిలో ఈ నెల 24వ తేదీన సాయంత్రం 5గంటల లోపు ఒక సెట్ జిరాక్స్ ప్రతులను సమర్పించాలని ప్రిన్సిపాల్ వివరించారు.

ఆఫీసర్స్ క్లబ్ వర్కర్ ఆత్మహత్య

తన చావుకు క్లబ్ సభ్యులు కారణమంటూ ఆడియో రికార్డు



శ్రీనివాస్ మృతదేహం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 19: హనుమకొండ ఆఫీసర్స్ క్లబ్ లో పనిచేస్తున్న జి.శ్రీని వాస్ (42) మనస్థాపంతో ఉరేసు కుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. తాను ఆత్మ హత్య చేసుకోవడానికి క్లబ్ సభ్యులైన చెరుకు రాజిరెడ్డి, గోలి గోపాల్‌రెడ్డి, పొడిశెట్టి రవి ముగ్గురు కారణమని ఆడియో రికార్డులో మృతుడు ఆరోపించాడు. ఆత్మహత్య చేసుకునేముందు ముగ్గురిపై ఆరోప ణలు చేస్తూ సెల్‌లో రికార్డు చేసి తన కుమారుడి సెల్‌కు పంపించాడు. వి వరాలు ఇలా ఉన్నాయి.ఆఫీసర్ క్లబ్‌లో సభ్యత్వం పేరిట రాజిరెడ్డి, గోపాల్ రెడ్డి, రవిలు దాదాపు రూ.1కోటి వరకు సభ్యత్వ రుసుము వసూల్ చేశారు. ఈ మొత్తంలో శ్రీనివాస్‌కు రూ.10లక్షలు ఇస్తామని ఒప్పుకున్నారు. ఒప్పు కున్న డబ్బులు ఇవ్వాలని శ్రీనివాస్ ముగ్గురు సభ్యులపై ఒత్తిడి తెచ్చినా స్పందన లేకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొన్నాడు. ఎంతకూ వారి నుంచి స్పందన లేకపోవడంతో సెల్‌లో రికార్డు చేసి కుమా రుడికి పంపించి క్లబ్ పైఅంతస్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్ సతీమణి కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచా రణ చేస్తున్నట్లు సుబేదారి పోలీసులు తెలిపారు. కేసు విషయాన్ని సీఐ సత్యనారాయణరెడ్డి ధ్రువీకరించారు.

ఓటింగ్ శాతం పెంపునకు ప్రత్యేక చర్యలు

వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య



సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగిన కలెక్టర్, అదనపు కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 19: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యల్లో భాగంగా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో సెల్ఫీ పాయింట్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓలతో కలిసి సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటోలు దిగారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో వరంగల్ నగరంలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైందని, పట్టణంలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు వినూత్న కార్యక్రమాల ద్వారా కళాజాత, 5కే రన్, ముగ్గుల పోటీలు, క్యాంపస్ అంబాసిడర్లను కళాశాలల్లో నియమించి విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించడమే కాకుండా కలెక్టరేట్, పబ్లిక్ గార్డెన్, వరంగల్ రైల్వే, బస్‌స్టేషన్ల వద్ద సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేసి యువతను ఓటు శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమం లో జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీసీఓ సంజీవరెడ్డి, ఏఓ శ్రీకాంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు విశ్వనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రికార్డులను పటిష్ఠంగా నిర్వహించాలి

▸▸ ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.దిలీబన్


రికార్డులను పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.దిలీబన్

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 19: ఎన్నికలకు సంబంధించిన ఖర్చుల రికార్డులను పటిష్ఠంగా నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.దిలీబన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండలోని కుడా కాంప్లెక్స్‌లోని జిల్లా సహకార కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ వరంగల్ లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రతి ఖర్చు వివరాలను సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ టీమ్‌లు సెగ్మెంట్ల వారిగా నమోదు చేయాలని తెలిపారు. లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో సహాయ వ్యయ పరిశీలన అధికారులతో సమన్వయం చేసుకొని ఆర్‌ఓ స్థాయిలో ప్రతిరోజు వ్యయ నివేదికలను క్రోడీకరించుకోవాలని సూచించారు. ర్యాలీలు, సమావేశాల ద్వారా నిర్వహించిన పార్టీ, ప్రచార ఖర్చులు నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేయాలన్నారు. పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచార వ్యయ ఖర్చులు, వ్యయ అకౌంట్, రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్ వేసిన తర్వాత ఎన్నికల సందర్భంగా, ఎన్నికల అనంతరం పరిశీలన చేయనున్నారని, పరిశీలనకు మధ్య మూడు రోజుల వ్యవధి ఉండాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఎ.దిలీబన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యయ నోడల్ అధికారి రామిరెడ్డి, సహాయ నోడల్ అధికారి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

మానుకోట ఎప్పటికీ.. కాంగ్రెస్ కంచుకోటే


కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌తో కలిసి అభివాదం చేస్తున్న సీఎం రేవంత్

5వ పేజీ తరువాయి

కోచ్ ఫ్యాక్టరీ రాకుండా అడ్డుకుంది కేంద్రంలోని బీజేపీయేనని సీఎం రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. ఆయా ఫ్యాక్టరీలు రాకుండా ఆదివాసీలు, లంబాడీలు, ఇతరులు అభివృద్ధి చెందకుండా పాతరేసింది వారు కాదా అని ప్రశ్నించారు. గిరిజన యూనివర్సిటీ మంజూరయితే ఆదివాసీలు, లంబాడీలు, ఇతరులు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అవుతారనే ఉద్దేశంతో మంజూరు ఆలస్యం చేసింది బీజేపీయేనని మండిపడ్డారు. ఎంపీలందరూ కలిసి కన్న తల్లి, దేవతలాంటి సోనియమ్మను అడిగితే తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని ఐనా సోనియమ్మ ఏనాడూ అధికారం కోసం పాకులాడలేదన్నారు. ఆ అమ్మ బిడ్డ రాహుల్‌గాంధీని ప్రధాని చేసి రుణం తీర్చుకోవాలన్నారు.

నాడు బలరాం మంత్రి.. మళ్లీ గెలిస్తే ఇంకా పెద్ద పదవి

మహబూబాబాద్ తొలి ఎస్టీ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి గెలిచిన పోరిక బలరాంనాయక్‌ను సోనియమ్మ కేంద్ర మంత్రి చేశారని, ఈసారి కూడా ఆయన్ను గెలిపిస్తే అంతకన్న పెద్దస్థాయి పదవి ఆయనకు దక్కుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇరుగు, పొరుగున ఉన్న మహబూబాబాద్, ఖమ్మం ఎంపీ సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులకు అత్యధిక మెజార్టీ ఇవ్వడంలో గట్టి పోటీ నెలకొందని రేవంత్‌రెడ్డి అన్నారు. బలరాంనాయక్‌కు 3లక్షలకు తగ్గకుండా మెజారిటీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఇందుకు అందరు సిద్ధమేనా అంటూ పదే.. పదే ప్రశ్నిస్తూ సబికుల నుంచి ఔననే సమాధానం చెప్పించారు. రేవంత్ ప్రసంగం ఆసాంతం కార్యకర్తలు కేరింతలు కొట్టారు. ఈ సభలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్, ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, యశస్వినిరెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ రోహిత్‌చౌదరి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, రాములునాయక్, పొదెం వీరయ్య, బెల్లయ్యనాయక్, మాలోతు నెహ్రూనాయక్, రవీంద్రనాయక్, రియాజ్, భూక్య ఉమా, నూనావత్ రాధ, మోహన్‌లాల్, నూకల నరేష్‌రెడ్డి, చుక్కల ఉదయ్‌చందర్, కంకర అయ్యప్పరెడ్డి, ఘనపురపు అంజయ్య, ఘంట సంజీవరెడ్డి, మేకల వీరన్న, బండారు వెంకన్న, పోరిక సాయిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిప్పకూడు తినడం ఖాయం

▸▸ 20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారనడం అవివేకం ▸▸ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 19 : సీఎం రేవంత్‌రెడ్డిని లిల్లిపుట్ అంటున్న మాజీ సీఎం కేసీఆర్ చిప్పకూడు తినే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేని శ్రీనివాసరెడ్డి అన్నారు. మహబూబాబాద్ 'జన జాతర' సభలో ఆయన మాట్లాడుతూ 20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని, సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి పోతున్నారని, మంత్రి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లోకి వస్తున్నారని పోరంబోకు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పాలనలో ఫోన్‌ట్యాపింగ్ చేయడం దౌర్భాగ్యమని ప్రతిపక్ష నేతలు కుటుంబ సభ్యులతో మాట్లాడిన వాటిని కూడా ట్యాప్ చేయడం దారుణమన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌లో పాలుపంచుకున్న వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. రూ.10లక్షల కోట్ల నిధులు తెలంగాణకు ఇచ్చామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని, రాష్ట్రం నుంచి కేంద్రానికి రూ.లక్షల కోట్ల శిస్తుకట్టలేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీకి నాలుగు సీట్లు కూడా రావనిచ బీఆర్‌ఎస్, బీజేపీలను చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. మానుకోటలో పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని కోరారు.

రోల్ మోడల్ సీఎంగా రేవంత్‌రెడ్డి..

- వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రాష్ట్రంలో వందరోజుల పాలనలో ప్రజలకిచ్చిన ఎన్నికల హామీలను నెరవేరుస్తూ దేశంలో రోల్‌మోడల్ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి నిలిచారని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకడు మూడునెలలు, మరొకడు ఆరునెలలు ఉంటుందని మాట్లాడుతున్నారని ఇది సరైంది కాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంద రోజుల పాలనలోనే ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేశారని, ప్రజలకు సేవచేయాలనే పట్టుదలతో వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి మద్దతుగా నిలిచి రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. సోనియాగాంధీ ఆశీస్సులు, రాహుల్‌గాంధీ దీవెనలతో పోరిక బలరాం నాయక్ కేంద్రమంత్రిగా పని చేశారని, ఆయన్ను గెలిపించుకుంటే మళ్లీ ఈ ప్రాంత అభివృద్ధికి పాటు పడుతారని, ఆయనకు భారీ మెజార్టీ ఇవ్వాలని పిలుపునిచ్చారు.

రెండు సిద్ధాంతాల మధ్య పోటీ..

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క

రాష్ట్రంలో రెండువర్గాలు, రెండు సిద్ధాంతాల మధ్య పోటీ జరుగుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దేశసంపదను దోచుకున్న, గాంధీజీని చంపిన గాడ్సే సిద్ధాంతాన్ని అవలంబిస్తున్న బీజేపీకి, దేశం కోసం ప్రాణాలర్పించి, గాంధీ సిద్ధాంతాన్ని కొన సాగిస్తున్న కాంగ్రెస్‌కు మధ్య పోటీ జరుగుతోందన్నారు. ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో ఊరికో ఉద్యోగం ఇవ్వని బీజేపీ విద్వేషాలను రెచ్చగొట్టిందని విమర్శించారు. పేదల పక్షాన నిలిచేది కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దు చేస్తారని, తద్వారా ప్రజల హక్కులు కోల్పోతారన్నారు. ప్రజల పక్షాన నిలిచే రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలన్నారు. బలరాంనాయక్ బోళా శంకరుడని, గతంలో కేంద్ర మంత్రిగా ప్రజాభ్యున్నతే ధ్యేయంగా పని చేశారని, మళ్లీ ఎంపీగా ప్రజా ఆశీర్వాదం కోసం వస్తున్నారని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

శ్రేణుల్లో జోష్

5వ పేజీ తరువాయి

తీసుకున్నారు. ఉదయం ఎంపీ బలరాం నాయక్ నామినేషన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఇక్కడే ఉండి సభ విజయవంతానికి కృషి చేశారు. తమతమ నియోజకవర్గాల నుంచి ప్రజలను భారీగా తరలించడంతో సభ సక్సెస్ అయింది.

సీఎం, మంత్రుల ప్రసంగాలతో హోరెత్తిన సభ..

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిగా బాధ్యతలు చేపట్టాక మానుకోట జిల్లా కేంద్రంలో జరుగుతున్న తొలిసభ కావడంతో సీఎంను చూసేందుకు, ఆయన ప్రసంగం వినేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణం కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులతో నిండిపోయింది. సభ నిర్ణీత సమయం సాయంత్రం 4 గంటలకు ఎండవేడిమితో జనం రాక కాస్త ఆలస్యమైనప్పటికి 5గంటల కల్లా ఎన్టీఆర్ స్టేడియం నిండిపోయింది. మిగిలిన వారు రోడ్లవెంట ఉండిపోయారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లపై ఎక్కుపెడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనసాగించిన ప్రసంగం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది, ఆయన ప్రసంగించినంత సేపు జనజాతర సభ ప్రాంగణం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు కేరింతలు, చప్పట్లతో మార్మోగింది. పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీలో మానుకోట, ఖమ్మం మొదటి, రెండుస్థానాల్లో నిలవబోతున్నాయని ఏ స్థానంలో నిలుస్తారో అంటూ ముఖ్యమంత్రి తన ప్రసంగంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. దీనికి తోడు సభకు హాజరైన రాష్ట్రమంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క ప్రసంగాలు సైతం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహా న్ని నింపాయి. సీఎం, మంత్రుల ప్రసంగాల మధ్యమధ్యలో జనం చప్పట్లు, కేరింతలు కొడుతూ, వారికి ఉత్సాహాన్ని నింపే ప్రయత్నం చేశారు.

ఉర్రూతలు ఊగిస్తూ..

మహబూబాబాద్ కాంగ్రెస్ జనజాతర నిర్ణీత సమయం సాయంత్రం 4గంటలుగా ప్రకటించిన నేపథ్యంలో.. సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ పర్యటన అనంతరం నేరుగా హెలికాప్టర్ ద్వారా మహబూబాబాద్ సభాస్థలి సమీపాన ఉన్న హెలిప్యాడ్‌కు 3.45 గంటలకే చేరుకున్నారు. 45 డిగ్రీలు దాటినా మండుటెండలో సభకు జనం ఆలస్యంగా వస్తుండడంతో సభా ప్రాంగణం కిటకిటలాడే వరకు ప్రత్యేక బస్సులోనే వేచి ఉన్నారు. సాయంత్రం 5.15 గంటలకు ఎన్టీఆర్ స్టేడియంలో వేదికపైకి చేరుకున్న ఆయన మంత్రులు, ప్రజాప్రతినిధుల ప్రసంగాలు పూర్తయ్యే వరకు అంటే 5.52గంటల దాకా సుమారు 2గంటల 7నిమిషాలు వేచి ఉన్నారు. తర్వాత వేదిక ముందు భాగాన ఏర్పాటు చేసిన ర్యాంప్‌పైకి నడుచుకుంటూ వెళ్లి ప్రజలకు అభివాదం చేసి తిరిగి వేదికపైకి చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి 23 నిమిషాల పాటు ఉర్రూతలూగిస్తూ నిరాటంకం గా ప్రసంగించారు.

అభ్యర్థి ఎవరో తెలుసుకోవచ్చు...



నియోజకవర్గంలో ఎంత మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారో తెలుసుకునేందుకు నో యువర్ క్యాండిడేట్ (కేవైసీ) అనే యాప్ ఉంది. దీని ద్వారా పోటీ చేసే అభ్యర్థి పేరుతోపాటు పూర్తి వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది.

ఓటర్ హెల్ప్‌లైన్...



ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా అనేక విషయాలు తెలుసుకోవచ్చు. ఓటరు జాబితాలో పేరు చెక్ చేసుకోవడంతోపాటు నూతనంగా ఓటరుగా నమోదు, తప్పులను సరిచేసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఓటరు గుర్తింపు కార్డు డౌన్‌లోడ్, నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితా పొందవచ్చు.

దివ్యాంగులు, వృద్ధుల కోసం



దివ్యాంగులు, వృద్ధుల కోసం సాక్షం యాప్ అందుబాటులో ఉంది. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని వారు ఈ యాప్‌లో పేరు నమోదు చేసుకోవాలి. సంబంధిత అధికారులు పరిశీలించి పోలింగ్ కేంద్రానికి తరలించేందుకు రవాణా సదుపాయం కల్పిస్తారు. వారికి ప్రత్యేకంగా ఒక సహాయకుడిని సైతం అందుబాటులో ఉంచుతారు.

- వరంగల్ కలెక్టరేట్




వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ అభ్యర్థి ఏఆర్. నేనా ప్రేమ్ రెడ్డి రిపిక, స్వతంత్ర అభ్యర్థి పేరంబుదూరి కృష్ణసాగర్ , బీఎస్‌పీ అభ్యర్థి పంజా కల్పన

ప్రశాంతంగా నామినేషన్ల పర్వం

రెండోరోజు వరంగల్‌లో నాలుగు, మానుకోటలో ఐదు నామినేషన్లు

వరంగల్ కలెక్టరేట్ / మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 19: లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి రెండోరోజైన శుక్రవారం మొత్తం తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్‌లో ముగ్గురు అభ్యర్థుల ద్వారా నాలుగు నామినేషన్లు రాగా.. వరంగల్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ అభ్యర్థిగా ఏఆర్. నేనా ప్రేమ్‌రెడ్డి రిపిక ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా మరో సెట్, స్వతంత్ర అభ్యర్థి పేరంబుదూరి కృష్ణసాగర్ ఒక సెట్, బీఎస్‌పీ అభ్యర్థిగా పంజా కల్పన ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.


మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో మహబూబాబాద్ నామినేషన్ పత్రాలను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్

మహబూబాబాద్ నియోజకవర్గంలో నలుగురు అభ్యర్థుల ద్వారా ఐదు నామినేషన్లు దాఖలు అయ్యాయి. మహబూబాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ములుగు నియోజవకర్గం, మదనపల్లి గ్రామానికి చెందిన పోరిక బలరాంనాయక్ రెండు సెట్లు దాఖలు చేశారు. ఆయన్ను మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి బలపరిచారు. అలాగే భద్రాద్రి జిల్లా పినపాక నియోజకవర్గం మణుగూరుకు చెందిన పాల్వాంచ దుర్గ స్వతంత్ర అభ్యర్థిగా, ఆధార్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా నర్సంపేట నియోజకవర్గం నెక్కొండ మండలం ముదిగొండ గ్రామానికి చెందిన జాటోతు రఘునాయక్, నర్సంపేట నియోజకవర్గం ఇటుకాలపల్లి గ్రామం ఏనుగుల తండాకు చెందిన బోడ అనిల్‌నాయక్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

నామినేషన్ కౌంటర్

రెండో రోజు (19-4-2024)

దాఖలైన మొత్తం నామినేషన్లు	
వరంగల్	మహ-బాద్
07	06

వరంగల్ (ఎస్సీ)	పంజా కల్పన (బహుజన సమాజ్ పార్టీ), ఏఆర్.నేనా ప్రేమ్‌రెడ్డి రిపిక (మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ, స్వతంత్ర), పేరంబుదూరి కృష్ణసాగర్ (స్వతంత్ర).
మహబూబాబాద్(ఎస్టీ)	పోరిక బలరాం నాయక్ (కాంగ్రెస్-2 సెట్లు), పాల్వాంచ దుర్గ (స్వతంత్ర), జాటోతు రఘునాయక్ (ఆధార్‌పార్టీ), బోడ అనిల్‌నాయక్ (స్వతంత్ర).



విజయవాడ లోక్‌సభ స్థానానికి తరిగొప్పుల వాసి నామినేషన్


చెవిటి అర్జున్

తరిగొప్పుల, ఏప్రిల్ 19: ఏపీలోని విజయవాడ పార్లమెంట్ స్థానానికి జనగామ జిల్లా తరిగొప్పుల మండలం సోలిపూర్ గ్రామానికి చెందిన చెవిటి అర్జున్ నామినేషన్ వేశారు. గురువారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి ఢిల్లీరావుకు తన ప్రతినిధి ద్వారా రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. అర్జున్ గత అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నియోజవకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసి విత్‌డ్రా చేసుకున్నారు. కాగా, నామినేషన్ విషయమై ఆయన మాట్లాడుతూ తను గుంటూరు జిల్లా జగ్గయ్యపేటలో ఉన్న స్నేహితులకు వద్దకు వెళ్లానని, వారి ప్రోద్బలంతో సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా పార్టీ తరుపున రెండు సెట్ల నామినేషన్‌లను తన ప్రతినిధి గుజ్జల లలిత ద్వారా వేశానని అన్నారు.

ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయండి

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 19: ఎన్నికల అంశాలకు సంబంధించి సందేహాల నివృత్తి, ఫిర్యాదుల కోసం మొబైల్ నెంబర్స్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల వ్యయ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఫిర్యాదులను ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఏ.దిలీబన్ మొబైల్ నెంబర్ 83099 21306, అలాగే వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్‌సింగా మొబైల్ నెంబర్ 8309 952057కు ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై ఫిర్యాదు చేయవచ్చని అన్నారు.

ఏ పత్రం ఎందుకోసమంటే..

వరంగల్ సిటీ, ఏప్రిల్ 19: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఎన్నికల్లో ప్రక్రియలో ప్రాధాన భూమిక పోషించే ఫాం-ఏ, ఫాం-1, ఫాం-2ఏ, ఫాం-2సీ, ఫాం-26, ఫాం-బీ అంటే ఏమిటీ..? వాటి ప్రాధాన్యతను ఒక సారి పరిశీలిద్దాం.

నోటీసు జారీ

నామినేషన్ దాఖలుకు సంబంధించి రిటర్నింగ్ అధికారి నోటీస్ (ఫాం-1) జారీ చేస్తారు. అభ్యర్థులు ఎప్పుడు, ఎక్కడ ఏ సమయంలో ఎవరికి దాఖలు చేయాలో స్పష్టంగా ప్రస్తావిస్తారు. నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణకు సంబంధించిన వివరాలు తెలుపుతారు. వీటితో పాటు ఆయా స్థానాల్లో పోలింగ్ ఏ రోజు, ఏ సమయాల్లో జరుగుతుందో వివరిస్తారు. ఫాం-1 ఆదారంగా అభ్యర్థులు నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది.

లోక్‌సభ స్థానం నామినేషన్‌కు...

లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఫాం-2 ఏ ద్వారా నామినేషన్ దాఖలు చేయాలి. ఫాం-2ఏ ను లోక్‌సభ నామినేషన్ పత్రంగా పేర్కొంటారు. శాసనభసకు ఫాం -2బీ, రాజ్యసభకు, శాసనమండలికి ఫాం-2సీలో నామినేషన్ సమర్పిస్తారు. అభ్యర్థులకు నామినేషన్ పత్రాలను కేంద్ర ఎన్నికల సంఘమే ఉచితంగా అందిస్తుంది.

అభ్యర్థులకు కీలకమైనవి ఇవే....

ఎన్నికలు రాగానే రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేస్తాయి. అభ్యర్థుల జాబితాను ఒకసారి లేదా విడుతల వారిగా విడుదల చేస్తాయి. జాబితాలో పేరున్నంత మాత్రాన సదరు అభ్యర్థి ఆ పార్టీ తరపున ఎన్నికల్లో పోటీ చేస్తారనేది అనుమానమే. ఎందుకంటే ఏదైన ఒక రాజకీయ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థికి సదరు పార్టీ ఫాం-ఏ, ఫాం-బీ అందించాల్సి ఉంటుంది. ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షుడి సంతకాలతో కూడిన ఫాం లనుఅభ్యర్థులు ఎన్నికల అధికారులకు సమర్పించాలి. అప్పుడే అభ్యర్థులు ఆయా పార్టీలతరుపున పోటీలో నిలిచినట్లు పరిగనిస్తారు.



ఎన్నికల గుర్తును నిర్ణయించేదే బీ- ఫాం..

తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థి వీరే అని ఆ పార్టీ ప్రతినిధి ఇచ్చేదే బీ-ఫాం. దీనిని నామినేషన్ సమయంలో ఎన్నికల అధికారులకు అందజేయాలి. నామినేషన్ల చివరి రోజు మధ్యాహ్నం 3 గంటల లోపు సమర్పించవచ్చు.సదరు పత్రంలో అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు, నియోజకవర్గ వివరాలతో పాటు ఆపార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. నామినేషన్‌తో పాటు అభ్యర్థి బీ- ఫాంను జత చేస్తేనే రిటర్నింగ్ అధికారి ఆ పార్టీ గుర్తును కేటాయిస్తారు. అభ్యర్థి సమర్పించిన ఫా-ఏ, ఫాం-బీ.ఈ రెండింటిని పరిశీలించి అభ్యర్థి సదరు పార్టీ తరుపున పోటీ చేస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది.

ఫా -ఏ అంటే...

రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల పేర్లను ఫాం-ఏలో తెలియజేస్తాయి. వీటిపై ఆయ రాజకీయ పార్టీలు అధ్యక్షులు లేదా ప్రధాన కార్యదర్శి సంతకంతో పాటు ముద్ర ఉంటుంది. పార్టీ ఏ వ్యక్తిని తమ ప్రతినిధిగా ఎంపిక చేస్తుందో అతడు/ఆమెకు ఇచ్చేదే ఫాం-ఏ. సదరు అభ్యర్థులు ముందుగా ఫాం-ఏను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించాలి. ఇందులో పార్టీ పేరు, పార్టీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులందరి పేర్లు, ఎవరు ఎాడి నుంచి బరిలో నిలుస్తున్నారనే వివరాలు ఉంటాయి.

అఫిడవిట్‌కు అంతే ప్రాధాన్యం..

నామినేషన్ దాఖలుతో పాటు ఫాం-26(అఫిడవిట్) సైతం అభ్యర్థులు విడిగా సమర్పించాలి. ఫాం-26 అంటే.. అబ్యర్థులు తమతో పాటు తమ కుటుంబ సభ్యుల ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసులు, న్యాయ స్థానాల్లో విచారణలో ఉన్న కేసుల వివరాలు పొందుపరుచాల్సి ఉంటుంది.

పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద రూ1.53లక్షలు స్వాధీనం


కాజీపేట డీజిల్‌కాలనీ పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలు

కాజీపేట, ఏప్రిల్ 19: కాజీపేట డీజిల్ కాలనీ పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలో ఓ వ్యక్తి వద్ద నగదు లభ్యమైంది. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కాజీపేట డీజిల్‌కాలనీ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రానికి చెందిన మాడిశెట్టి శ్రీనివాస్ బైక్‌లో రూ.1.53 లక్షలు లభ్యమైనట్టు తెలిపారు. నగదుకు సంబంధించి సరైన దస్తావేజులు లేకపోవడంతో నగదు స్వాధీనం చేసుకుని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు.



జువైనల్ హోంకు 15మంది మైనర్ డ్రైవర్లు తరలింపు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 19: లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న 15మంది మైనర్ డ్రైవర్లను జువైనల్ హోమ్‌కు తరలించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో 38మందిని అదుపులోకి తీసుకుని శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టారు. వీరిలో 15మందిని ఒకరోజు జువైనల్ హోమ్‌కు తరలించాల్సిందిగా న్యాయమూర్తి తీర్పు ఇచ్చి మిగతా వారికి జరిమానా విధించారు. ఈ విషయాన్ని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ వెల్లడించారు. సంవత్సర కాలంలో 113మంది మైనర్ డ్రైవర్లను జువైనల్ హోంకు తరలించామని ఆయన తెలిపారు. వాహనదారులు తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వాహనాలు ఇవ్వద్దన్నారు. నిబంధనలు విస్మరిస్తే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని ఏసీపీ సత్యనారాయణ హెచ్చరించారు.

దాతలు రక్తదానం చేయండి

కాళోజీ జంక్షన్, ఏప్రిల్ 19: హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీలోని రక్త కేంద్రంలో రక్త నిలువలు పూర్తిగా తగ్గిపోయాయని, దాతలు రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, పాలక వర్గం విజ్ఞప్తి చేస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా, పక్క జిల్లాల నుంచి కూడా తలసేమియా రోగులు హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ సికిల్ సెల్ ట్రాన్స్‌ఫ్యూజన్ సెంటర్‌కు వచ్చి రక్తాన్ని ఎక్కించుకుంటారని వారు తెలిపారు. తలసేమియా బాధితులకు ప్రతీ పదిహేను రోజులకోసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందని, లేకుంటే వారి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. వేసవి దృష్ట్యా రక్త కేంద్రంలో రక్తం కొరత ఏర్పడి బాధితులకు రక్తం అందుబాటులో లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం కళాశాలల్లో పరీక్షల సమయం వల్ల రక్తదాన శిబిరాలు నిర్వహించడం కష్టతరమవుతుందని వివరించారు. ఉమ్మడి వరంగల్‌జిల్లా వ్యాప్తంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, ఉద్యోగ సంఘాలు, యువత ముందుకు వచ్చి రక్తదానం చేసి తలసేమియా బాధితులను ఆదుకోవాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

● వచ్చిన ధాన్యాన్ని వెంటనే తరలించాలి ● కొనుగోలు కేంద్రాల తనిఖీలో కలెక్టర్ సిక్తా పట్నాయక్

ధర్మసాగర్, ఏప్రిల్ 19: ధర్మసాగర్ మండల కేంద్రంలోని పీఏసీఎస్, ఐకేపీ కేంద్రాలను, వేలేరు, నారాయణగిరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. ఎంత మంది రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చారు? గోనె సంచులు ఎన్ని ఉన్నాయి? ఇప్పటివరకు ఎంత ధాన్యం తూకం వేశారు? ఎన్ని లోడ్లు మిల్లుకు చేరాయి? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోజు ధాన్యాన్ని ఎక్కువగా తరలించాలన్నారు. వచ్చిన ధాన్యం వచ్చినట్టు వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఏమైనా ఇబ్బందులుంటే అధికారుల దృష్టికి తీసుకుపోవాలన్నారు. ప్రతీ బస్తాకు 41 కేజీల ధాన్యాన్ని తూకం వేయాలని ఆదేశించారు. కాగా, ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఐకేపీ సెంటర్‌లో 41 కేజీలకు తూకానికి బదులుగా 42.5 కేజీల ధాన్యాన్ని తూకం వేశారని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రైతులు అంతటితో ఆగకుండా తూకం వేసిన ధాన్యాన్ని తిరిగి కలెక్టర్ ఎదుట తూకం వేయడంతో 41 కేజీలకు బదులుగా 42.5 కేజీలు ఉండడంతో ఐకేపీ, వ్యవసాయ శాఖ అధికారులు, వీవో సభ్యులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ శ్రద్ధశుక్ల, డీఆర్‌డీవో నాగపద్మ, ఎంపీడీవో అనిల్ కూమార్, ఆర్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధర్మసాగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

రేపు జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్19: జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న కాజీపేట ఫాతిమానగర్‌లోని సెయింట్ గ్యాబ్రియెల్స్ హైస్కూల్ క్రీడా మైదానంలో జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడా ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపెల్లి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-18 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో 1 జనవరి 2006 తరువాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు, జనన ధృవీకరణ పత్రాలను వెంట తీసుకొని కాజీపేటలోని సెయింట్‌గ్యాబ్రియెల్స్ హైస్కూల్‌లో ఈ నెల 21న ఉదయం 9గంటల లోపు అందజేయాలని రాజు సూచించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు.. ఈ నెల 25 నుంచి 27 వరకు హైదరాబాద్ వినయాపూర్‌లోని డీపీఎస్ స్కూల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-18 బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకై సెల్- 8328449263 నెంబర్‌లో సంప్రదించాలని రాజు వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, ఏప్రిల్19 విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్, ఎన్జీవోస్ కాలనీ, టీవీ టవర్, వాటర్ ట్యాంక్, వెంకటేశ్వరకాలనీ ఏరియాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, వెస్ట్ సిటీ, టేకులగూడెం, రాంపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా జరగదన్నారు. అదే విధంగా వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని రజకసంఘం డీటీఆర్, మైత్రినగర్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ఆరుగురు విద్యార్థుల డీబార్

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19: కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఆర్ట్స్ కళాశాలలో జరుగుతున్న పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఆరుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్ల రమేష్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో జరిగిన రసాయన శాస్త్రం పరీక్షలో మాస్ కాపీ యింగ్ చేస్తూ పట్టుబడిన ఆరుగురిని డిబార్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పొడ ద్దని ఆయన సూచించారు.

బీజేపీలో భారీగా చేరికలు



బీజేపీలో చేరినవారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న అరూరి రమేష్, రావు పద్మ

ఐనవోలు, ఏప్రిల్ 19 : కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రజలు ఎందుకు గెలిపించామా అని బాధపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ ఎద్దేవ చేశారు. ఐనవోలు నర్సింహులగూడెం, పెరుమాండ్లగూడెం, ఒంటిమామిడిపల్లి, నందనం, కక్కిరాలపల్లి గ్రామాల నుంచి ఇద్దరు మాజీ సర్పంచ్‌లు కట్కూరి సునితకుమార్, పిడుగు రజితలతోపాటు సుమారు 400 మంది గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఐనవోలులో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పాల్గొనగా అరూరి రమేష్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, వరంగల్ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, పాక్స్ చైర్మన్ వనంరెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ జయపాల్, గాడిపల్లి రాజేశ్వర్‌రావు, సుభాష్, మహేష్ పాల్గొన్నారు.

టెట్‌పై ఉపాధ్యాయులకు ప్రభుత్వం స్పష్టతనివ్వాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 19: ప్రభుత్వం నిర్వహిస్తున్న టెట్‌పై ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుడి ఉద్యోగ విరమణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. సర్వీస్ ఉపాధ్యాయుల పదోన్నతులకు టెట్ ఉండాలన్న కోర్టు మధ్యంత ఉత్తర్వులపై ప్రభుత్వం తన వైఖరిని ఇప్పటి వరకు చెప్పలేదన్నారు. సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్‌పై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయితే విద్యాశాఖ కార్యదర్శికి ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదన్నారు. బదిలీ అయిన ఉపాధ్యా యులను చివరి వర్కింగ్‌డే రోజు రిలీవ్ చేయాలన్నారు. వేసవి సెలవులు ముగిసేలోపు ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్న తుల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పర్యవేక్షణ పోస్టులన్నీ భర్తీ చేయాలని, పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించాలని, పుస్తకాలు, యూనిఫామ్స్‌ను పాఠశాల ప్రారంభం నాటికే అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. సోమశేఖర్, వరంగల్ ఎంఈవో విజయ్‌కుమార్, నాయకులు సీహెచ్. రవీందర్‌రాజు, తాటికాయల కుమార్, పెండెం రాజు, మల్లిక్, రేణుక, లింగమూర్తి, కుమారస్వామి, శ్రీనివాస్, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

రాజనీతిశాస్త్రంలో నరేందర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఏప్రిల్ 19: కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం పరిశోధకుడు ముద్దెపాక నరేందర్‌కు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు నరేందర్‌కు డాక్టరేట్‌ను ప్రకటిం చినట్లు మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొ ఫెసర్ శ్రీరామోజు నరసింహచారి తెలిపారు. 'పొలిటికల్ ఎంపవ ర్‌మెంట్ ఆఫ్ దళిత్ వుమెన్ ఇన్ పంచాయతీరాజ్ ఇనిస్టి ట్యూషన్స్: ఏ స్టడీ ఇన్ నల్గొండ డిస్ట్రిక్టు' అనే అంశంపై కేయూ రాజనీతిశాస్త్ర విభాగం ప్రొఫెసర్ చింతకాయల దినేశ్‌కు మార్ పర్యవేక్షణలో నరేందర్ డాక్టరేట్ పూర్తి చేశారు. డాక్టరేట్ పొందిన నరేందర్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం సాయిగూడెం గ్రామానికి చెందినవారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా పలువురు అభినందించారు.

ఘనంగా కాలేయ దినోత్సవం



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కూరపాటి రమేశ్

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 19: ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని హనుమకొండలోని కూ రపాటి హాస్పిటల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కూరపాటి రమేశ్ మాట్లాడుతూ.. కాలేయ సంబంధిత వ్యాధుల గురించి, ముఖ్యంగా మద్యపానం, ధూమపానం వల్ల కాలేయ సంబంధిత వ్యాధులు ఎక్కువగా వస్తాయని తెలిపారు. వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై వివరించారు. ఆల్కహాల్ అడిక్షన్ సర్వసాధారణం అయిందని, డి అడిక్షన్ సపోర్ట్ గ్రూప్ ఏర్పరచి సంబంధిత కుటుంబ సభ్యులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కాలేయ దినోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు.

మిషన్ భగీరథ ఏఈపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉప్పయ్య

హసన్‌పర్తి, ఏప్రిల్ 19: మిషన్ భగీరథ(ఖమ్మం జిల్లా) ఏఈ ప్రసాద్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని మిషన్ భగీరథ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉప్పయ్య కోరారు. మిషన్ భగీరథ ఉద్యోగస్తులను మానసిక క్షోభకు గురి చేస్తూ విధుల నుంచి సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ హసన్‌పర్తి ఎర్రగట్టు గుట్ట సమీపంలోని మిషన్ భగీరథ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఉద్యోగులు చేరి, నిరసన తెలిపారు. ఇందులో భాగంగా మిషన్ భగీరథ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ ఉప్పయ్య మాట్లాడుతూ.. ఎంతో అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తున్న ఏఈ ప్రసాద్‌ను సస్పెండ్ చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. అలాగే మహిళలని చూడకుండా ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నిరంతరాయంగా ఫోన్ సంభాషణల ద్వారా ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కాగా, ఏఈ ప్రసాద్‌పై సస్పెన్షన్ ఎత్తివేసి తిరిగి విధుల్లోకి తీసుకునేంత వరకు నిరసన కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, జె.శ్రీనివాస్, పి.జీవన్‌ప్రకాశ్, ఇ.సునీత, టి.శ్వేత, ఎం.చంద్రనాయక్, ఎన్.వెంకటసతీష్, నిర్మల, మాణిక్యరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మిషన్ భగీరథ ఉద్యోగులు

మంద కృష్ణ మాదిగను విమర్శించే స్థాయి లేదు

ధర్మసాగర్, ఏప్రిల్ 19: మాదిగ జాతి కోసం పోరాటం చేస్తున్న మంద కృష్ణ మాదిగను విమర్శించే స్థాయి ఎవ్వరికీ లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ మాదిగ అన్నారు. శుక్రవారం ధర్మసాగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే గొప్ప ఉద్యమ కారుడు, మచ్చలేని నాయకుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. మంద కృష్ణ మాదిగపై మాదిగ హక్కుల దండోరా వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మయ్య చేసిన ఆరోపణలను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మంద కృష్ణ మాదిగపై తప్పుడు విమర్శలకు పాల్పడడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాంతి కుమార్, ప్రణయ్ భాస్కర్, బాలస్వామి, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కాంగ్రెస్‌లో చేరికలు

మడికొండ, ఏప్రిల్ 19:మడికొండకు చెందిన మెట్టురామన్న వడ్డెర కమిటీ మాజీ అధ్యక్షుడు పల్లపు రాజేందర్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వడ్డెర సం ఘం డైరెక్టర్లు, వడ్డెర సం ఘం నాయకులు 50 మం దితో కలిసి శనివారం హనుమకొండలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేర గా ఎమ్మెల్యే వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 64వ డివిజన్ కాంగ్రె స్ అధ్యక్షుడు కుర్ల మోహన్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, నాయకులు బైరి లింగమూర్తి, పల్లపు అర్జున్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

మద్యం పట్టివేత

ఐనవోలు, ఏప్రిల్ 19 : కక్కిరాలపల్లి గ్రామంలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. పైండ్ల సంపత్ అనే వ్యక్తి ఇంట్లో తనిఖీ చేయగా రూ.2600 విలువచేసే బీర్లు లభించగా వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పరిశోధనపై జిజ్ఞాస పెంచుకోవాలి

రెండోరోజు కార్యశాలలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 19: యువ పరిశోధకులు సరైన పరిశోధన అంశం ఎంపిక చూసుకుని జిజ్ఞాసతో పనిచేయాలని సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.వరలక్ష్మి ఉద్బోధించారు. వర్సిటీ కామర్స్ కళాశాలలో పరిశోధనలపై నిర్వహించిన రెండో రోజు కార్యశాలలో వరలక్ష్మి పాల్గొని మాట్లాడారు. డిజిటల్ యుగం పరిశోధన అంశాన్ని ఎంపిక చేసుకోవడం కష్టతరమని చెప్పారు. దత్తాంశ సేకరణలో డిజిటల్ సాధనల వినియోగం అత్యంత అవసరమని చెప్పారు. దత్తాంశాలను మూల్యాంకనం చేయడంతో సంప్రదాయ, నవీన పద్ధతులను, ఫలితాలను వినియోగించి మంచి ఫలితాలను రాబట్టాలని అన్నారు. దత్తాంశ సేకరణలో అడ్డంకులను, సేకరణ పద్ధతులను, దశలు, పాఠ్య ప్రణాళిక, పరిశోధన అంతరాలను గుర్తించడం, పరిశోధన విశ్లేషణ, మెట్రిక్స్, పరిశోధన అన్వేషణలను గుర్తించేందుకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. ఈ సందర్భంగా స్కాలర్స్ అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కేయూ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.అమరవేణి మాట్లాడుతూ.. విషయ నిపుణుల బోధన అనంతరం పాల్గొన్న వారితో ప్రయోగపూర్వకంగా వారి నుంచి వివరాలు సేకరిస్తామని చెప్పారు. ఈ నెల 20. 21, 22, 23 తేదీల్లో పరిశోధన అతిముఖ్యమైన అంశాలపై సీనియర్ ప్రొఫెసర్లతో కార్యశాల, బోధన ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి

ఆర్టీఏలో పనికో రేటు..

(5వ పేజీ తరువాయి)

తెలిసింది. ఇలా రోజువారిగా దాదాపు వందకు పైగానే లైసెన్స్‌లు జారీ అవుతాయని సమాచారం.

ఓవర్‌లోడ్, ఫిట్‌నెస్ ముడుపులు

కేవలం లైసెన్స్‌ల జారీ నుంచి ఇంత మొత్తంలో వసూళ్లు ఉంటే.. ఇక ఓవర్‌లోడ్, ఫిట్‌నెస్, పెండింగ్ టాక్స్ పేమెంట్ల నుంచి ఎంత ఉంటుందో ఊహించుకోవచ్చు. ఓవర్‌లోడ్ (ఇసుక లారీలు, రైస్, ఇతర వస్తు రవాణా వాహనాలు), ఫిట్‌నెస్ (యేటా వాహనాల కండీషన్ బట్టి చెల్లించాల్సిన మొత్తం) పేరిట పెద్దఎత్తున వసూళ్ల దందా సాగుతుందనే విమర్శలున్నాయి. ఓవర్ లోడ్ విషయంలో ప్రధానంగా ఇసుక లారీలు ఎక్కువగా పట్టుబడతాయని సమాచారం. లారీ కెపాసిటీని మించి ఇసుక రవాణా చేస్తున్న లారీలను పట్టుకునే అధికారులు సీజ్ చేయకుండా అందినంత దండుకుంటారనే ఆరోపణలున్నాయి. కాళేశ్వరం, ఏటూరునాగారం నుంచి నగరానికి వచ్చే వాహనాలు కెపాసిటీని మించి ఇసుక రవాణా చేస్తుంటారు. వీటిని పట్టుకునే వాహనాలు సీజ్ చేయాలి. కానీ ఎక్కడ కూడా సీజ్ చేసినట్లు కనిపించదు. కాగా, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ల జారీలోనూ చేతులు తడపాల్సిందేననే ఆరోపణలున్నాయి. యేటా ప్రైవేటు బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. బస్సులను కార్యాలయానికి తీసుకువచ్చి అధికారులు పరిశీలించాక సర్టిఫికెట్ జారీ చేయాల్సి ఉంటుంది. దీనికి విరుద్ధంగా కార్యాలయంలో జరుగుతున్నట్లు సమాచారం. బస్సులు కార్యాలయం రాకుండానే, పరిశీలించకుండానే ముడుపులు దండుకుని (రూ.5వేలకు మించకుండా) ఫిట్‌నెస్ జారీ అవుతోందనే విమర్శలున్నాయి. ప్రతీ ఫిట్‌నెస్ పేరిట పెద్ద ఎత్తున వసూళ్లు ఉంటాయని సమాచారం.

అధికారుల కనుసన్నల్లోనే..

కార్యాలయంలో జరిగే దందా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలున్నాయి. ప్రతీ దానికి రేటుకట్టి వసూళ్లు చేస్తూ హోదాల వారిగా తీసుకుంటారనే విమర్శలున్నాయి. మూడు సెక్షన్‌లు ప్రధాన కేంద్రంగా వసూళ్లు జరుగుతాయనే విమర్శలున్నాయి. ఈ సెక్షన్‌ల ఇన్‌చార్జిలు ఏ అధికారికి ఎంతో ఇవ్వాలో ముందుగానే నిర్ణయించిన మేరకు చెల్లింపులు ఉంటాయనే ఆరోపణలున్నాయి. మొత్తంగా జిల్లా రవాణాధికారి కార్యాలయంలో పని జరగాలంటే చేతులు తడపాల్సిందే అనే ప్రచారం ఉంది. ఈ దందాపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

రచయితల మౌనం వాంఛనీయం కాదు..

లౌకిక విలువలు సాహిత్యంపై 28న నగరంలో రాష్ట్రస్థాయి సదస్సు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 19: మతం రాజకీయమవుతూ సమాజంలో వివక్షకు, అసహనానికి హింసకు కారణమవుతుంటే రచయితలు మౌనంగా ఉండటం ఏమాత్రం సహేతుకం కాదని ప్రముఖ కవి, రచయిత లోచన్ అన్నారు. ఉమ్మడి స్వరమై మాట్లాడటానికి సమూహ వేదిక ఎంతైనా అవసరమని ఆయన అన్నారు. లౌకిక భావనల గురించి రచయిత సరైన అవగాహన కల్పించుకోవడానికి సదస్సు అనివార్యమన్నారు. ఈ నెల 28వ తేదీన కేయూ సెనెట్‌హాలు వేదికగా 'లౌకిక విలువలు, సాహిత్యం' అనే అంశంపై ఒకరోజు రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సదస్సు విశేషాల కరపత్రంను నగరానికి చెందిన ప్రముఖ కవులు లోచన్, అంపశయ్య నవీన్, విఆర్.విద్యార్థి, ఘంటా రామిరెడ్డి తదితర ప్రముఖులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మరో కవి విఆర్.విద్యార్థి మాట్లాడుతూ.. సదస్సు ద్వారా ప్రజాస్వామిక విలువలు ప్రతీ ఓటరుకు చేరేలా నిర్భయంగా ఓటు వేసేలా సదస్సు ఉపకరిస్తుందన్నారు. ఘంటా రామిరెడ్డి మాట్లాడుతూ.. చైతన్యవంతమైన వరంగల్ చరిత్రకు ఇలాంటి ప్రత్యేక సదస్సు కొనసాగింపుగా కావాలన్నారు. కేయూ ఆచార్యులు కాత్యాయిని విద్మహే మాట్లాడుతూ.. ప్రజా జీవితంలోని లౌకిక విలువలను ఎలా ప్రతిఫలిస్తుందో వాటికి అవాంతరం కలిగినప్పుడు ప్రజా ప్రతిస్పందన ఏరూపంలో ఉందో తెలుసుకోవడం వర్తమానంలో, మనకు ఎరుక హెచ్చరిక అవుతుందని, ఈ సదస్సు ప్రయోజనం అదే కావాలని ఆమె ఆకాంక్షించారు. అనిశెట్టి రజిత, బాసిత్, సంపత్‌రెడ్డి, పొట్లపల్లి శ్రీనివాసరావు, బండారు సుజాత, శ్యామల, బిల్లా మహేందర్, శంకర్ నారాయణ, టి.సుదర్శన్, విలాసిని, కార్తీకరాజు, మేకిరి దామోదర్ తదితర అనేక మంది కవులు ఈ కార్యక్రమంలో పాల్గొని వరంగల్ సదస్సును విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.



రాష్ట్ర సదస్సు కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

శంఖానుకారీ తచ్ఛుభ్రంచంద్రవత్సరం దధి
దృష్టంతన్మకరాధారైః స్ఫోటితం పరివేషితమ్!

పెరుగంటే తెల్లని శంఖంలా ఉండాలి. దట్టంగా మీగడ కట్టి, చంద్రబింబంలా కనిపించాలి. చెంచాలాంటి పరికరంతో ముక్కలుగా కోయగలిగేంత గట్టిగా ఉండాలంటున్నాడు క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలోని ఈ పద్యంలో. అలాంటి పాలనిచ్చే ఆవునో, గేదెనో మేపటం, ప్రత్యేకమైన పొయ్యి మీదో పాలు కాయడం దగ్గరినుంచి... తోడు పెట్టేవరకూ అన్ని జాగ్రత్తలూ తీసుకుంటే ఒకటి రెండు చెంచాలు కలిపి, కొద్దిగా జీలకర్ర పొడి వేసుకుని తాగితే జీర్ణ శక్తి పదిలం అవుతుంది. కడుపులో చల్లగా ఉంటుంది. ఎసిడిటీ తగ్గుతుంది. అమీబియాసిస్ లాంటి వ్యాధులకు ఇదే మందు. అల్సర్లు త్వరగా తగ్గుతాయి.

- బాగా చిక్కపడేలా కాచిన పాలకు రెండు అదనపు ప్రయోజనాలు కలుగుతాయి. మొదటిది అంతటి అత్యధిక ఉష్ణోగ్రత దగ్గర కాయటం వలన పాలలో ఉండే చెడ్డ బాక్టీరియా పూర్తిగా నశిస్తుంది. కొద్దిగా పొంగు వస్తే చాలు కాయటం ఆపేసిన పాలలో చెడ్డ బాక్టీరియా పూర్తిగా చావదు. ఒక వంతు పాలు మరిగే దాకా కాచిన పాలే ఆరోగ్యదాయకమైనవి. ఈ పాలతో తోడుపెట్టిన పెరుగు మరింత ఆరోగ్యదాయకమైంది. బలమైన, ఉపయోగపడే బాక్టీరియాని కలిగి ఉండి పేగుల్ని సంరక్షిస్తుంది. చిక్కటి పాలతో చేసిన పెరుగు వాతాన్ని, పైత్యాన్ని తగ్గిస్తుందని క్షేమశర్మ చెప్పాడు. ధాతువుల్లో ఉండే అగ్నిని పెంపు చేస్తుంది. ధాత్వగ్ని పాకం జరిగిన రస రక్త మాంసాది ధాతువులు శరీరానికి బాగా అందుతాయి. శక్తి ఉత్పత్తి బాగా జరుగుతుంది. ఎనీమియా లాంటి ధాతుక్షీణ వ్యాధులు రాకుండా ఉంటాయి.

పెరుగు ఎలా ఉండాలంటే

పెరుగు ఇలా జున్ను ముక్కలా కోయగలిగేలా తోడుకుంటుంది కూడా!

ఇలా తోడుకున్న పెరుగుకు ఆయుర్వేద శాస్త్రంలో చెప్పిన గుణాలన్నీ ఉన్నాయి. ఒక్కో జంతువు పాలతో తోడుపెట్టిన పెరుగుకు ఒక్కో లక్షణాలు చెప్పింది శాస్త్రం. మనకు పాలు ప్యాకెట్లలో పట్టి, పాల కంపెనీలు పంపిస్తున్నాయి. వారు ఏది ప్యాకెట్లో ఇస్తే అదే మనకు శరణ్యం అవుతోంది. లేకపోతే బిందెల్లో ఇంటికి తెచ్చిపోసే పాల మీద ఆధారపడాల్సి వస్తోంది. ప్రభుత్వాలకు పాల మీద అదుపు లేదు. పాలు కుళ్ల వాసన వస్తుంటే ఇవ్వాళేదో రుచిలో తేడాగా ఉన్నదనుకుంటూనే సరిపెట్టుకుని వాడేసుకుంటున్నాం.

ఇన్ని ప్రతికూలతల మధ్య కూడా సామాన్యుడు పాలను... పెరుగునూ కొనుక్కుని వాడుకుంటున్నాడు. ఈ పరిస్థితుల్లో పాలు కొనుక్కొని తోడు పెట్టుకోవటమే ఉన్నంతలో నయం. పాలను రెండు మూడు పొంగు లొచ్చేదాకా మరగనిస్తే చిక్కదనం వస్తుంది. వాటిని తోడేసిన పెరుగు గట్టిగా ఉంటుంది. పలుచని పెరుగులో కన్నా గట్టి పెరుగులో ఉపయోగపడే బాక్టీరియా బలంగా ఎదుగుతుంది.



గట్టిగా తోడుకున్న పెరుగుని తీసుకుని దాంతో మనం చేసుకోగల పదార్థాల గురించి క్షేమశర్మ వివరించాడు. మండే ఈ ఎండాకాలంలో శరీరానికి చల్లదనాన్నిచ్చే పెరుగు మజ్జిగల గురించే కదా మనం ఆలోచించాల్సింది!

- ఒక గ్లాసు పెరుగులో 3 గ్లాసుల నీళ్ల కలిపి చిలికి, ఒక రాత్రంతా ఉంచి, మర్నాడు అందులో సైంధవ లవణం, అల్లం కలిపి నూరాలి. ఈ ముద్దను

'శాల్యోదనేన సంయుక్తం సతతం మాహిషం దధి' అంటూ గేదె పెరుగు కలిపిన అన్నం కృష్ణుడికి ఇష్టం అని గోపికలు తెచ్చి ప్రేమతో తినిపించేవారట. చద్దన్నం అంటే ఈ చల్లన్నమే! పాచిపోయిన అన్నం కాదు! పెరుగన్నం వాతాన్ని, వేడినీ తగ్గిస్తుంది. బలాన్ని శక్తినీ ఇస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. ఇందులో దానిమ్మ గింజలు, ద్రాక్ష పండ్లు వగైరా కలిపి, కొత్తిమీరతో అలంకరించి తాలింపు పెట్టిన దద్ధోజనం తిరుగులేని శక్తిదాయిని.

- గేదె పాలకన్నా ఆవు పాలు కొద్దిగా పలచగా ఉంటాయి. అందుకని ఆవు పాలను మరింతసేపు కాయాల్సి ఉంటుంది. చిక్కని ఆవుపాలతో చేసిన పెరుగు అన్ని దోషాలనూ హరిస్తుంది. పూర్తిగా జీర్ణం అయ్యాక తీపి పదార్థం ఏ గుణాలిస్తుందో పెరుగు కూడా అవే గుణాలిస్తుంది. ఒక కప్పు పెరుగు 200 గ్రాముల స్వీటుతో సమానమే. కానీ పెరుగు గుండెకు మంచిది. జీర్ణ శక్తిని పెంచుతుంది. కొద్దిగా వేడి చేస్తుంది.
- గేదె పాలతో చేసిన పెరుగు పైత్యాన్ని, కఫాన్ని తగ్గిస్తుంది. కానీ, కష్టంగా అరుగుతుంది. నాలుగైదు పొంగులు వచ్చేదాకా మరిగిస్తే తేలిగ్గా అరుగుతాయి. చలవనిస్తుంది. కాగీ కాగని పాలతో చేసిన పెరుగు వాతాన్ని, అజీర్తిని పెంచుతుంది. స్థూలకాయాన్ని తెస్తుంది. స్త్రీ, పురుష పరమైన శక్తి, ఆసక్తి పెరుగుతాయి.
- మేక పాలను కూడా ఇలానే కాచుకుని తోడు పెట్టుకుంటే మూడు దోషాలూ హరిస్తాయి. క్షయవ్యాధికి గొప్ప ఔషధంగా పని చేస్తాయి. క్షీణింపచేసే వ్యాధుల్లో మేలు చేస్తాయి. దగ్గు, జలుబు, ఆయాసం, ఉబ్బసం రోగులకు మంచిది.
- ప్యాకెట్టు పాలు, పెరుగు కచ్చితంగా ఏ పాలతో తయారయ్యాయో తెలియదు. విదేశాల నుంచి దిగుమతి అయిన పాల పొడితో తయారైన పాలకు మన దేశపు ఆవు పాల గుణాలున్నాయో లేదో చెప్పలేము. ఏ పాలతో తయరైన పెరుగైనా రాత్రిపూట తినటం మంచిది కాదు. బాగా చిలికి అందులో అల్లం, జీలకర్ర, సైంధవలవణం కలిపి తాగటమే శ్రేయస్కరం. ఉప్పు నిషేధం ఉన్నవారు అది లేకుండానే జీలకర్ర వగైరా కలిపి తాగవచ్చు. పెరుగుకు నిషేధాలున్నాయి గానీ మజ్జిగకు శీతాకాలం, వర్షాకాలం ఇలా ఏ కాల నియమాలూ లేవు.

- గంగరాజు అరుణాదేవి



చికెన్‌తో చేసే వంటలు ఏవైనా మినిమమ్ గ్యారెంటీ. ఎప్పుడూ వండే కూరలు కాకుండా కాస్త వెరైటీగా ఆఫ్ఘనీ చికెన్ కర్రీ, అపోలో చికెన్, చికెన్ లెగ్స్ ఫ్రై, చికెన్ పాప్‌కార్న్‌ను సులువుగా చేసుకోవచ్చు. ఈ వీకెండ్ మీరూ ఎంచక్కా చేసుకోండిలా..

కోడి మాంసం.. కాస్త వెరైటీగా!

చికెన్ లెగ్స్ ఫ్రై

కావాల్సిన పదార్థాలు: చికెన్ లెగ్ పీస్‌లు- 6, పెరుగు- 6 టేబుల్ స్పూన్లు, ఉప్పు- రుచికి తగినంత, కారం పొడి- రెండున్నర టీ స్పూన్లు, జింజర్ గార్లిక్ పేస్ట్- 2 టీస్పూన్లు, పసుపు- చిటికెడు, ధనియాల పొడి- టీస్పూన్, గరం మసాలా- టీస్పూన్, పెప్పర్ పౌడర్- అర టీస్పూన్, చాట్ మసాలా- అరటీస్పూన్, టమోటా కెచప్- 4 టేబుల్ స్పూన్లు, నిమ్మకాయ-1, పచ్చిమిర్చి- 3 (సన్నగా తరగాలి), తరిగిన కొత్తిమీర- రెండు టేబుల్ స్పూన్లు, కరివేపాకులు- 10, నూనె- 3 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం: చికెన్ లెగ్ పీస్‌లను మంచి నీటితో శుభ్రంగా కడగాలి. లెగ్ పీస్‌ల మీద కత్తితో మూడు గాట్లు పెట్టాలి. ఈ పీస్‌లను ఒక బాక్స్‌లో ఉంచాలి.

మరో బౌల్‌లో పెరుగు, ఉప్పు, ధనియాల పొడి, కారం పొడి, జింజర్ గార్లిక్ పేస్ట్, పసుపు, గరం మసాలా, పెప్పర్ పొడి, చాట్ మసాలా, టమోటా కెచప్ వేశాక నిమ్మకాయ రసాన్ని పిండాలి. ఆ తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర, కరివేపాకు వేసి స్పూన్‌తో రెండు నిముషాలు మిక్స్ చేశాక ఎగ్ మిక్సర్‌తో మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని లెగ్ పీస్‌ల మీద వేయాలి. మిశ్రమాన్ని బాగా కలిపితే ముక్కలకు పడుతుంది. బాక్స్‌ను క్లోజ్ చేసి రెండున్నర గంటల పాటు మారినేట్ చేసుకోవాలి.

ప్యాన్‌లో నూనె వేసి మారినేట్ చేసుకున్న లెగ్ పీస్‌లను వేసుకోవాలి. బాక్సులో మిగిలిన మిశ్రమాన్నంతా అందులోనే వేయాలి. ఆ తర్వాత మంటను మీడియమ్ ఫ్లేమ్‌లో ఉంచి కుక్ చేసుకోవాలి.



ప్యాన్‌కు అంటుకోకుండా.. ముక్క మాడిపోకుండా గరిటెతో కదుపుతూనే ఉండాలి. ఉడికిన తర్వాత చివరగా సిమ్‌లో ఉంచి వేయించాలి. ముక్కలు రెండువైపులా బాగా కాల్చుకున్న తర్వాత స్టవ్ కట్టేసి వడ్డించుకోవటమే. ఈ లెగ్‌పీస్‌లు జ్యూసీగా ఉంటాయి. అవసరం అనుకుంటే టమోటా కెచప్ లేదా కొత్తిమీర చట్నీతో తినాలి.

అపోలో చికెన్ ఫ్రై

కావాల్సిన పదార్థాలు: చికెన్ బ్రెస్ట్- 400 గ్రాములు, నూనె- రెండు టేబుల్ స్పూన్లు, జీలకర్ర పొడి- ముప్పావు టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, అల్లం, వెల్లుల్లి పేస్ట్- అర టీస్పూన్, వెల్లుల్లి రెబ్బలు- 4 (సన్నగా తరగాలి), కరివేపాకు- 10 ఆకులు, పచ్చిమిర్చి- 4 (సన్నగా నిలువుగా కోయాలి), కారం- అర టీస్పూన్, చిన్న ఉల్లిపాయ- 1 (సన్నగా తరగాలి), పసుపు- చిటికెడు, కోడిగుడ్డు- 1, మైదా- రెండున్నర టేబుల్ స్పూన్లు, కార్న్‌ఫ్లోర్- రెండున్నర టేబుల్ స్పూన్లు, నూనె- డీప్ ఫ్రైకి తగినంత, పండు మిరపకాయల పేస్ట్- కొద్దిగా, పసుపు- చిటికెడు, పెరుగు- 300 గ్రాములు, ధనియాల పొడి- అర టీస్పూన్, గరం మసాలా- అర టీస్పూన్,

తయారీ విధానం: చికెన్ శుభ్రంగా కడిగి.. చిటికెన వేలంత పొడవుగా, సన్నగా కట్ చేసుకోవాలి. దీన్ని బౌల్‌లో వేసుకోవాలి. ఇందులోకి అర టీస్పూన్ జీలకర్ర, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్,



కారం, పసుపు, కోడిగుడ్డు సొన, మైదాపిండి, కార్న్‌ఫ్లోర్ వేసి బాగా కలపాలి. ఈ చికెన్ ముక్కలను రెండు నిముషాల పాటు ఉంచి.. ఆ తర్వాత నూనె వేడి చేసి మీడియం ఫ్లేమ్‌లో ఈ చికెన్ ముక్కలను పకోడాల్లా డీప్ ఫ్రై చేసుకోవాలి. మరో బౌల్‌లో నూనె వేసి వెల్లుల్లి రెబ్బలు వేసి గరిటెతో కదిపాక కరివేపాకు, పచ్చిమిర్చి ముక్కలు, తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారేంత వరకూ వేయించాక అందులోకి కొద్దిగా అల్లం పేస్ట్ వేసి గరిటెతో కలపాలి. ఇందులోకి పండు మిరపకాయల పేస్ట్, పసుపు వేసి బాగా కలపాలి. ఇందులోకి పెరుగు వేసి మిక్స్ చేయాలి. ఇందులోకి తగినంత ఉప్పు వేశాక మిగిలిన జీలకర్ర పొడి, ధనియాల పొడి, గరం మసాలా వేసి నిముషం పాటు గరిటెతో కదిపాక.. ఇందులోకి వేయించిన చికెన్ ముక్కలను వేసి కలపాలి. గరిటెతో మూడు నిముషాల పాటు కదిపితే చికెన్ ముక్కలకు మసాలా బాగా పడుతుంది. చివరగా కొత్తిమీర వేసి నిముషం పాటు కదిపి ప్లేట్‌లో వేసి వడ్డించుకోవటమే తరువాయి.

చికెన్ పాప్‌కార్న్

కావాల్సిన పదార్థాలు: చికెన్ బ్రెస్ట్- పావు కేజీ (చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి), ఉప్పు- రుచికి తగినంత, కారం- 1 టీస్పూన్, వెల్లుల్లి పొడి- 1 టీస్పూన్, వెనిగర్- టేబుల్ స్పూన్, సోయాసాస్- అర టీస్పూన్, రెడ్ చిల్లీ సాస్- 2 టేబుల్ స్పూన్లు, పాలు- పావు కప్పు, కోడిగుడ్డు- 1, మైదా- 1 కప్పు, కార్న్ ఫ్లోర్- 1 కప్పు, కారం - టీస్పూన్, అల్లం పొడి- 1 టీస్పూన్, నూనె- డీప్ ఫ్రైకి తగినంత

తయారీ విధానం: బౌల్‌లో చికెన్ ముక్కలు వేసి అందులో తగినంత ఉప్పు, కారం, వెల్లుల్లి పొడి, వెనిగర్, సోయాసాస్, రెడ్ చిల్లీ సాస్, పాలు వేసి స్పూన్‌తో బాగా మిక్స్ చేయాలి. దీన్ని పాలిథీన్ కవర్‌తో కవర్ చేసి ఫ్రిజ్‌లో ఉంచి అర గంట పాటు మారినేట్ చేసుకోవాలి.

ఫ్రిజ్‌నుంచి తీశాక కోడిగుడ్డు సొన వేసి కలపాలి. మరో బౌల్‌లో మైదా, కార్న్‌ఫ్లోర్, కారంతో పాటు రుచికి తగినంత ఉప్పు, అల్లం పొడి వేసి ఎగ్ మిక్సర్‌తో మిశ్రమాన్ని బాగా కలపాలి. చిన్న బౌల్‌లో చల్లనీళ్ల తీసుకోవాలి. ఆ తర్వాత బౌల్‌లోని చికెన్ ముక్కలను స్పూన్‌తో ఒక్కోటి తీసుకుని మిక్స్ చేసి మైదా పిండిలో వేయాలి. పిండి బాగా పట్టేట్లు కదిపి.. ప్రతి ముక్కను చల్లనీళ్లలో వేసి మళ్లీ పిండిలో వేయాలి. ఇలా చేస్తే మైదా, కార్న్‌ఫ్లోర్‌ల మిశ్రమం ముక్కకు బాగా పడుతుంది. పిండి అద్దిన ఈ చికెన్ ముక్కలను ఒక బౌల్‌లో వేసుకుని ఒకేసారి డీప్ ఫ్రై చేసుకోవాలి. ఈ పాప్‌కార్న్ మంచి టెక్చర్‌తో పాటు రుచికరంగా ఉంటాయి. టమోటా కెచప్‌తో తినొచ్చు.

ఆఫ్ఘనీ చికెన్ కర్రీ

కావాల్సిన పదార్థాలు

చికెన్- కేజీ, పచ్చి మిరపకాయలు- 8 (సన్నగా తరగాలి), మీడియం సైజ్ ఉల్లిపాయలు- 2 (సన్నగా తరగాలి), వెల్లుల్లి రెబ్బలు- 9 (సన్నగా తరగాలి), అల్లం- చిన్న ముక్క, పెరుగు- కప్పు, కొత్తిమీర- కట్ట (సన్నగా తరగాలి), ఫ్రెష్ క్రీమ్- కప్పు, గరం మసాలా- ముప్పావు టేబుల్ స్పూన్, ఉప్పు- రుచికి తగినంత, కసూరీ మేథీ- టేబుల్ స్పూన్, చాట్ మసాలా- రెండు టీస్పూన్లు, యాలకులు-3, లవంగాలు-3, నూనె- 3 టేబుల్ స్పూన్లు, చిన్న నిమ్మకాయ- 1, దాల్చిన చెక్క- 1, మిరియాల పొడి - టేబుల్ స్పూన్.

తయారీ విధానం

జార్‌లో ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, వెల్లుల్లి, అల్లం, కొత్తిమీర వేసి మిక్సీ పట్టాలి. ఈ మెత్తని పేస్ట్‌ను బౌల్‌లో వేసుకోవాలి. ఇందులోకి పెరుగు, ఫ్రెష్ క్రీమ్, గరం మసాలా, ఉప్పు, చాట్ మసాలా, మిరియాల పొడి, కసూరీ మేథీ వేసి అందులో సగం నిమ్మకాయ రసం పిండాలి. గరిటెతో రెండు నిముషాలు కలిపిన తర్వాత ఎగ్ మిక్సర్‌తో వేగంగా మిక్స్ చేయాలి. దీనివల్ల అన్ని ఫ్లేవర్స్ బాగా కలసిపోతాయి. ఈ మిశ్రమాన్ని పక్కన ఉంచుకోవాలి.

చికెన్‌ను మంచి నీళ్లతో శుభ్రంగా కడిగి.. ప్రతీ ముక్క మీద కత్తితో రెండు లేదా మూడు గాట్లు పెట్టాలి. ఆ చికెన్‌ను బౌల్‌లో వేసుకోవాలి. ఇందులోకి మిక్సీ పట్టిన పేస్ట్ కొంచెం వేసి చికెన్ ముక్కలకు అంటేట్లు బాగా చేత్తో కలపాలి. మారినేట్ చేసి గంటన్నరపాటు వదిలేయాలి. మిగిలిన పేస్ట్‌ను కూడా గంటన్నరపాటు పక్కన ఉంచుకోవాలి. ఆ తర్వాత ప్యాన్‌లో నూనె వేయాలి. నూనె వేడయ్యాక మారినేట్ చేసి పెట్టుకున్న చికెన్ ముక్కలను ఉంచాలి. రెండు వైపులా ఉడికేట్లు గరిటెతో తిప్పుతూ కుక్ చేసుకోవాలి. కనీసం పదిహేను నిముషాల పాటు ప్యాన్‌లో ముక్కలను వేయించి ప్లేట్‌లో ఉంచుకోవాలి. వెంటనే ప్యాన్‌లో మిగిలిన నూనెలో యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క వేసి కలపాలి. ఆ తర్వాత మిక్సీ పట్టిన మిగిలిన పేస్ట్‌ను వేసి బాగా కలిపి.. ప్యాన్ మూత పెట్టి పది నిముషాల పాటు ఉడికించాలి. ఆ తర్వాత వేయించిన చికెన్ ముక్కలు వేసి మిశ్రమంలో రెండు నిముషాల పాటు కలిపిన తర్వాత ప్యాన్ మూత ఉంచి పదిహేను నిముషాల పాటు చిన్న మంట మీద కుక్ చేయాలి. చికెన్ ముక్కలు మగ్గుతాయి. నూనె పైకి తేలి ఉడికినట్లు కనపడితే రెండు నిముషాలు గరిటెతో మిక్స్ చేసి దించేసుకోవటమే. ఈ ఆఫ్ఘనీ చికెన్ కర్రీలో నిమ్మకాయ పిండుకుని రోటీ, చపాతీ, దోశల్లోకి తింటే భలే ఉంటుంది.



మేకప్

అలసిన కళ్లు మిలమిల

అలసటతో జీవం తగ్గిన కళ్లకు ఐ మేకప్‌తో జీవం పోయవచ్చు. కళ్ల కింద నలుపు, వాపు లాంటి లక్షణాలను కూడా ఐమేకప్‌తో దాచేయవచ్చు. అదెలాగంటే..

ఐ షాడో: తేలిక రంగు ఐ షాడోను కనురెప్పల పైన, కళ్ల అంచుల్లో ఉండే ముడతలు, కళ్ల చివర్లలో అద్దుకుంటే అలసట ప్రతిబింబించే కళ్ల మెరుపును సంతరించుకుంటాయి.

కన్‌సీలర్: కన్‌సీలర్ కళ్ల కింద నలుపును పూర్తిగా దాచలేదు. కాబట్టి కన్‌సీలర్ అద్దుకున్న తర్వాత, దాని పైన షిమ్మరీ హైలైటర్ అప్లై చేసుకోవాలి.

ఐబ్రో: అలసిన కళ్ల నుంచి చూపులను మరల్చడం కోసం కనుబొమలను ఆకర్షణీయంగా దిద్దుకోవాలి. ఐబ్రో పెన్సిల్ లేదా ఐ షాడోతో కనుబొమలను మృదువుగా అందంగా దిద్దుకోవాలి. కనుబొమలను దిద్దుకోడానికి నలుపు రంగుకు బదులుగా ముదురు గోధుమ రంగు ఎంచుకోవాలి. ఇలా చేయడం వల్ల న్యాచురల్ లుక్ సొంతమవుతుంది.




కనురెప్పలు: మస్కారా అప్లై చేయడాని కంటే ముందు కనురెప్పల వెంట్రుకలను కర్లర్‌తో పైకి తిప్పుకోవాలి. ఇలా తిప్పుకునే సమయంలో రెప్పల వెంట్రుకలన్నీ కర్లర్‌లోకి ఒదిగాయో లేదో గమనించుకోవాలి. వెంట్రుకల కుదుళ్ల నుంచి అంచుల వరకూ కర్లర్‌ను కదిలిస్తూ ల్యాషెస్‌ను వంపు తిప్పుకోవాలి.

స్ఫూర్తి

వైకల్యాన్ని జయించి... సివిల్ సర్వీసెస్ నెగ్గి

సెరెబ్రల్ పాల్సీతో చక్రాల కుర్చీకే పరిమితమైపోయిన 23 ఏళ్ల కేరళ యువతి సారిక, సివిల్ సర్వీస్ పరీక్షలో నెగ్గి, మనోబలంతో అనుకున్నది సాధించవచ్చని నిరూపించింది. యుపిఎస్సీలో 922వ ర్యాంకు సాధించిన సారిక గురించిన ఆసక్తికరమైన కథనమిది.



'నడవలేకపోయినా, చేతులు సహకరిస్తే అదే పది వేలు, అన్ని పనులకూ ఇతరుల మీద ఆధారపడే పరిస్థితి తప్పుతుంది' అనుకుంటారు దివ్యాంగులు. కానీ కేరళలోని కోజికోడ్‌కు చెందిన సారిక పరిస్థితి అంతకంటే దారుణం. సెరెబ్రల్ పాల్సీతో చేతులు కూడా సహకరించని పరిస్థితి ఆ అమ్మాయిది. అయినా వైకల్యాన్ని అధిగమించి అందలాలను అందుకున్న వాళ్ల కథల నుంచి ఆ అమ్మాయి ప్రేరణ పొందింది. సివిల్ సర్వీసెస్‌లో నెగ్గి, అనుకున్నది సాధించడానికి వైకల్యం అడ్డు రాదని నిరూపించాలని అనుకుంది. మొదటిసారి పరీక్షలో నెగ్గలేకపోయినా, రెండోసారి 2023 యుపిఎస్సీలో 922వ ర్యాంకును సాధించగలిగింది. ఆ ఘనత, తన ఉపాధ్యాయులు తల్లితండ్రులు, స్నేహితులకే దక్కుతుందని అంటున్న సారిక... "నా సంతోషాన్ని ఎలా వ్యక్తం చేయాలో తెలియడం లేదు. ఇది నేను ఊహించని విజయం" అంటూ తన సంతోషాన్ని మీడియాతో పంచుకుంది.

సవాళ్లను అధిగమించి

సివిల్ సర్వీసెస్ పరీక్ష రాయడం కోసం సరిత చేసిన ప్రయాణమంతా సవాళ్లతోనే సాగింది. పరీక్ష సెంటర్లను వెతుక్కుంటూ వెళ్లడం మొదలు, వారం రోజుల పాటు సాగే మెయిన్స్‌కు హాజరవడం వరకూ తనకెదురైన సవాళ్లన్నిటినీ ఆ అమ్మాయి పట్టుదలతో అధిగమించింది. ఐఏఎస్ అకాడమీ ఫౌండర్, మోటివేషనల్ స్పీకర్, డాక్టర్ జోబిన్ ఎస్ కొట్టాయం, కేరళలో ప్రాజెక్ట్ చిత్రశలభం అనే ట్రైనింగ్ ప్రోగ్రాంను లాంచ్ చేశాడు. దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా సివిల్ సర్వీస్ కోచింగ్ ఇవ్వడం ఆ ప్రోగ్రాం లక్ష్యం. అలా ఉచిత శిక్షణ తీసుకున్న సరిత, రెండోసారి సివిల్ సర్వీసెస్‌కు పట్టుదలతో సిద్ధపడింది. కోజికోడ్‌లో పరీక్ష హాల్ డిజేబుల్డ్ ఫ్రెండ్లీ కావడం కూడా సరితకు కలిసొచ్చింది. తిరువనంతపురంలో జరిగిన మెయిన్స్ కోసం కూడా సరితకు తగిన ఏర్పాట్లను కల్పించడం జరిగింది. పరీక్ష రాయడానికి కుడి చేయి సహకరించదు కాబట్టి సరిత స్క్రైబ్‌ను ఉపయోగించుకుంది. అంతిమంగా ఢిల్లీ ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయానికి సరిత తండ్రి ఖతార్ నుంచి వచ్చి, కూతురికి సహాయపడ్డాడు. తన పుట్టినూరు కోజికోడ్‌ను గ్రాడ్యుయేషన్ సబ్జెక్ట్‌గా ఎంచుకోవడంతో, ఇంటర్వ్యూ మొత్తం ఆ దిశగానే సాగిందని ఇంటర్వ్యూ తర్వాత చెప్పుకొచ్చింది సరిత.

ఆమే నాకు ప్రేరణ

సాదాసీదా ఉద్యోగానికి బదులుగా, సివిల్ సర్వీసెస్ ఉద్యోగాన్నే లక్ష్యంగా ఎంచుకోవడం గురించి వివరిస్తూ... "చేతులు లేని లైసెన్స్‌డ్ పైలట్ 'జెస్సికా కాక్స్' నుంచి నేను ప్రేరణ పొందాను. మనోబలం, పట్టుదల కలిగి ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదు అనడానికి ఆవిడ కథే ఒక ఉదాహరణ' అంటూ వివరించిన సరిత, ప్రభుత్వోద్యోగంలో ఎదురయ్యే సవాళ్లను కూడా ఇంతే పట్టుదలతో అధిగవిస్తూ, ప్రజలకు సేవలందించడానికి శాయశక్తులా కృషి చేస్తానని కూడా అంటోందామె.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/uI5BIAjలో చదవండి.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/5fyrUG0 లో చదవండి.

చిత్రభళా!

చింటూ: కాస్త గొడ్డలి ఇస్తావా!
చిన్నూ: గొడ్డలి చూసినప్పుడల్లా... వివేకా గుర్తుకొస్తున్నార్రా! అందుకే అది వాడటం మానేశా!
చింటూ: పోనీ... కత్తి ఇవ్వు!
చిన్నూ: అది ఉందికానీ, కత్తి అంటేనే కోడికత్తి గుర్తుకొస్తోంది కదరా! పాపం శీను!
చింటూ: ఏదేదో మాట్లాడుతున్నావ్... ఆరోగ్యం బాగానే ఉందా!
చిన్నూ: మీ అన్నియ్య రాగానే మందు మానేశా కదరా! బాగానే ఉంటోంది.



ఒక్క చాన్సే చివరి చాన్స్ కావాలి!

జగన్ నైజం దోపిడీ, విధ్వంసమే: చంద్రబాబు.. ఐదేళ్లలో రూ.5 లక్షల కోట్లు దోచాడు

- విదేశీ బ్యాంకుల్లో దాచుకున్నాడు
- ప్రజాగళంలో టీడీపీ అధినేత బాబు
- ఆలూరు, కణేకల్లులో భారీ సభలు



రాయదుర్గంలో జరిగిన ప్రజాగళం యాత్రలో మాట్లాడుతున్న చంద్రబాబు

కర్నూలు/అనంతపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జలగన్న జగన్‌కు ఇదివరకు ఇచ్చిన ఆ ఒక్క చాన్సే... చివరి చాన్స్ కావాలని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. దోపిడీ, విధ్వంసమే సీఎం జగన్ నైజమని మండిపడ్డారు. అధికారం కట్టబెడితే వ్యవస్థలను నాశనం చేశాడన్నారు. గత ఐదేళ్లలో రూ.5 లక్షల కోట్లు దోచుకున్నాడని.. దోపిడీ సొమ్మంతా విదేశీ బ్యాంకుల్లో దాచుకున్నాడని ఆరోపించారు. ప్రజాగళం యాత్రలో భాగంగా శుక్రవారం కర్నూలు జిల్లా ఆలూరు, అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని కణేకల్లులో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. జగన్‌రెడ్డి శవ రాజకీయాలు చేస్తూ లాభపడాలని చూస్తున్నాడన్నారు. 'గత ఎన్నికల్లో కోడికత్తి డ్రామా ఆడాడు.. ఇప్పుడేమో గులకరాయి డ్రామా ఆడుతున్నాడు. గులకరాయితో ఎవరైనా హత్య చేస్తారా..? జన్మనిచ్చిన తల్లికే భారమైన వ్యక్తి జన్మభూమికి భారం కాదా? తండ్రిలేని బిడ్డ అన్నాడు. ఒక్క చాన్స్ అన్నాడు. ముద్దులు పెట్టాడు. తల నిమిరాడు. అధికారంలోకి వచ్చాక పిడి గుద్దులు గుద్దాడు. ఈ ఐదేళ్ల పాలనలో మీలో ఎవరైనా బాగుపడ్డారా' అని ప్రశ్నించారు. అధికార మదంతో విర్రవీగుతున్నాడని.. అందుకే ఆయనకు 'జే గన్‌రెడ్డి'గా నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రాన్ని దోపిడీ చేసిన వ్యక్తిని ఇలా కాకపోతే మరెలా పిలుస్తారని ప్రశ్నించారు. ఆయన్ను గెలిపిస్తే.. ఢిల్లీకి వెళ్లి పైరవీలు చేసుకున్నాడని.. రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేశాడని.. అన్ని రంగాలను సర్వనాశనం చేశాడని విమర్శించారు. రూ.13 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడని.. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దైన్య పరిస్థితి తీసుకొచ్చాడని దుయ్యబట్టారు. జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి.. ఈ ఐదుగురు బాగుపడితే.. రాష్ట్రం బాగుపడినట్లా అని నిలదీశారు. మోసం చేయడంలో జగన్ దిట్టని.. అబద్ధాలు చెప్పడం ఆయనకు పుట్టుకతో వచ్చిన విద్యని విమర్శించారు. ఆయన తమపై నోరు పారేసుకుంటున్నాడని, తామూ బూతులు తిట్టాలంటే ఒక్క నిమిషం పట్టదని అన్నారు. మీకు భవిష్యత్ కావాలా..? అరాచక పాలనలోనే ఉంటారా అని ప్రజలను అడిగారు. రాష్ట్రం బాగుపడాలంటే వైసీపీని తరిమేయాలని పిలుపిచ్చారు. జరుగనున్న కురుక్షేత్రంలో ధర్మానిదే విజయమని.. జగన్ ఇంటికి పోవడం తథ్యమన్నారు. రాబోయే ప్రజా ప్రభుత్వంలో పేదలను లక్షాధికారులుగా మార్చే బాధ్యత తనదని చెప్పారు.

టెక్కలిలో దువ్వాడకు ఇంటిపోరు!

- 22న ఆయన భార్య వాణి నామినేషన్

టెక్కలి, ఏప్రిల్ 19 : శ్రీకాకుళం జిల్లాలో టెక్కలి వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఇంటిపోరుతో సతమతమవుతున్నారు. ఆయన భార్య, టెక్కలి జడ్పీటీసీ దువ్వాడ వాణి.. అదేస్థానంలో ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నారు. పార్టీ తరఫున నామినేషన్ వేస్తారా.. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతారా అనేది చెప్పడం లేదు. టెక్కలి టికెట్.. తన భర్తకు కాకుండా తనకే కేటాయించాలని గతంలో ఆమె సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమెను టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించారు. కానీ దువ్వాడ శ్రీనివాస్‌నే అభ్యర్థిగా ప్రకటించారు. శుక్రవారం నామినేషన్ వేసేందుకు ఆయన సర్వం సిద్ధం చేసుకున్నారు. ఈ తరుణంలో ఆయన భార్య వాణి కూడా నామినేషన్‌కు సిద్ధమవడం చర్చనీయాంశమవుతోంది. ఈ అంశం వైసీపీ అధిష్ఠానం వద్దకు వెళ్లినట్లు తెలిసింది.




కర్నూలు జిల్లా ఆలూరు రోడ్ షోలో ప్రసంగిస్తున్న వైఎస్ షర్మిల

వైసీపీకి ఓటేస్తే.. డ్రైనేజీలో వేసినట్టే: షర్మిల

ఆలూరు/ఆదోని, ఏప్రిల్ 19: ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ రాష్ట్రానికి చేసిందేమీ లేదని, వైసీపీకి ఓటు వేస్తే.. డ్రైనేజీలో వేసినట్టేనని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో 'ఏపీ న్యాయ్ యాత్ర' నిర్వహించారు. ఆలూరు అంబేడ్కర్ కూడలిలో నిర్వహించిన రోడ్‌షోలో వైసీపీ ప్రభుత్వంపై ఆమె విరుచుకుపడ్డారు. 'సీఎం జగన్ శిలఫలకాలను ఆవిష్కరిస్తూ ఆ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా రాష్ట్రాన్ని శంకుస్థాపనల ప్రభుత్వంగా మార్చేశాడు. ఆలూరు నియోజకవర్గంలో నగరడోన, వేదవతి ప్రాజెక్టులు నిర్మిస్తానని హామీ ఇచ్చి విస్మరించాడు. మనకు ప్రత్యేక హోదా పదేళ్ల క్రితం వచ్చి ఉండాలి. కానీ హోదా తీసుకురావడంలో జగన్ ఘోరంగా విఫలమై చేతులు ఎత్తేశాడు. ఆయనకు కనీసం రాజధాని కట్టడమైనా చేతనైందా? ప్రత్యేక హోదా వస్తే ఒక్కో నియోజకవర్గానికి 100 పరిశ్రమలు వచ్చేవి. దాంతో ఎంతో అభివృద్ధి జరిగి మన బిడ్డలకు ఎన్నో ఉద్యోగాలు వచ్చేవి. కడప స్టీల్ ఫ్యాక్టరీకి గతంలో వైఎస్ఆర్ శంకుస్థాపన చేశారు. తిరిగి జగన్ మరోసారి శంకుస్థాపన చేశాడు. ఇంకా ఎన్నిసార్లు పదేపదే శంకుస్థాపనలు చేస్తావ్..?' అంటూ విరుచుకుపడ్డారు. ఇలాంటి పార్టీకి మళ్లీ ఓటు వేసేకన్నా... డ్రైనేజీలో వేయడం ఎంతో మేలని తెలిపారు. రైతుల సంక్షేమానికి రూ.300 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని జగన్ చెప్పలేదా అని ప్రశ్నించారు. మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అవేమీ కనపడటంలేదా అంటూ జగన్‌ను ప్రశ్నించారు. మొత్తమ్మీద జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజల చేతికి చిప్ప మాత్రమే మిగిలిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందని చెప్పారు. ఎన్నికల్లో ఎవ్వరు డబ్బులిచ్చినా తీసుకోవాలని, అవి మీ దగ్గర నుంచి లాక్కున్నవేనని వివరించారు. ఓటు మాత్రం ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి వేసి గెలిపించాలని ప్రజలకు షర్మిల విజ్ఞప్తి చేశారు.

టార్గెట్ బొండా ఉమా?

- బెజవాడలో టీడీపీ ఆఫీసు వద్ద హైడ్రామా
- రాయి ఘటనలో అరెస్ట్ అని ప్రచారం



విజయవాడ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గులకరాయి దాడి ఘటనలో మలుపులు తిరుగుతున్న దర్యాప్తు ఇప్పుడు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బొండా ఉమా మహేశ్వరరావు వైపు వెళ్తుందా? కేసులో ఆయనను నిందితుడిగా చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయా? అంటే.. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు అందుకు అవుననే సమాధానం ఇస్తున్నాయి. విజయవాడ మొగల్రాజపురంలోని బొండా ఉమా ఇంటి వద్ద, అజిత్ సింగ్ నగర్‌లో పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి హైడ్రామా నడిచింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా పోలీసులు పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు వచ్చిన సమాచారం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. బొండా ఉమా ఇంటి వద్దకు శుక్రవారం ఉదయం ఇద్దరు కానిస్టేబుళ్లు వెళ్లారు. భద్రత నిమిత్తం తమను పంపారని ఆయనకు చెప్పారు. మధ్యాహ్నానికి ఆ సంఖ్య నాలుగుకు చేరింది. దీంతో బొండా ఉమాకు అనుమానం వచ్చింది. తర్వాత కారులో ఇంటి నుంచి అజిత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కాసేపటికి టాస్క్‌ఫోర్స్ అధికారులు, లా అండ్ ఆర్డర్ అధికారులు పార్టీ కార్యాలయానికి సమీపంలో వేచి ఉన్నారు. తర్వాత పోలీసు సిబ్బంది చేరుకున్నారు. దీంతో బొండా ఉమాను అరెస్టు చేసే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరిగింది. పోలీసుల రాకను గమనించిన నేతలు అన్ని డివిజన్లలో ఉన్న కార్యకర్తలకు సమాచారం ఇచ్చారు. 20 డివిజన్లలో ఉన్న కార్యకర్తలు భారీ సంఖ్యలో పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. వెల్లంపల్లి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. రాత్రి వరకు బొండా ఉమా పార్టీ కార్యాలయంలోనే ఉండి నేతలతో సమావేశమయ్యారు. జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. పార్టీ కార్యాలయం వద్ద సుమారు రెండున్నర గంటలపాటు హైడ్రామా నడిచింది. కార్యకర్తలు వెళ్లిపోవాలని పోలీసులు హెచ్చరించారు. అయినా వారు అక్కడి నుంచి కదల్లేదు. పోలీసులు ఏ క్షణాన అయినా లోపలకు ప్రవేశించి అరెస్టు చేస్తారన్న అనుమానంతో బొండా ఉమా అక్కడి నుంచి తప్పించుకున్నారు. పార్టీ కార్యాలయానికి విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయించి, వెనుక వైపు నుంచి వెళ్లిపోయారు.



మేం మాట్లాడుతుంటే వైసీపీకి గుండె దడదడ

- ఓటమి భయంతోనే కోర్టుకెళ్లారు
- కడప కోర్టు ఉత్తర్వులపై సుప్రీంకైనా వెళ్తాం
- వివేకా కుమార్తె సునీత

పులివెందుల, ఏప్రిల్ 19: 'హత్య విషయంపై మేం అక్కాచెల్లెళ్లం మాట్లాడుతుంటే వైసీపీ నేతలకు ఓడిపోతామనే భయం పట్టుకుంది. అందుకే కోర్టుకు వెళ్లారు. అయినా వీరు వేసిన పిటిషన్‌లో కోరింది ఒకటి.. కోర్టు ఇచ్చిన ఆర్డర్ మరొకటి. దీనిపై సుప్రీం కోర్టుకైనా వెళ్తాం' అని హత్యకు గురైన మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత వెల్లడించారు. ఆమె శుక్రవారం పులివెందులలో తన ఇంట్లో విలేకరులతో మాట్లాడారు. వివేకా హత్య కేసుపై తెలంగాణలోని నాంపల్లి సీబీఐ కోర్టులో విచారణ నడుస్తోందని.. అయితే దానిపై బయట మాట్లాడకూడదని ఇక్కడి కడప కోర్టు ఆర్డర్ ఇచ్చిందని అన్నారు. 'జగన్, అవినాశ్‌లపై ఫలానావారు మాట్లాడొద్దు.. ఇప్పటికే సోషల్ మీడియాలో ఉంటే వాటిని తొలగించేలా ఆదేశాలివ్వాలని వైసీపీ వారు పిటిషన్ వేశారు. వారు అడిగింది ఒకటి, కోర్టు ఆర్డర్ ఇచ్చింది మరొకటి. దీనిపై లాయర్లతో చర్చించి హైకోర్టుకు వెళ్లాలో, సుప్రీంకోర్టుకు వెళ్లాలో నిర్ణయించుకుంటాం. పై కోర్టులో ఈ ఆర్డర్ తప్పకుండా వీగిపోతుందని, మాకు న్యాయం జరుగుతుందని నమ్మకం ఉంది' అని తెలిపారు. వివేకా హత్య కేసు ఐదేళ్లుగా ప్రజల్లో ఉందని.. ఇప్పుడా విషయం మాట్లాడకూడదని అనడం ఎలా సమంజసం అవుతుందో చెప్పాలని అన్నారు. ఇటువంటి ఉత్తర్వులు తీసుకొచ్చి తనను బెదిరించాలని చూస్తున్నారని.. భయపడేది లేదని స్పష్టం చేశారు. పులివెందుల ప్రజలు, కడప ప్రజలు, ఆంధ్రప్రదేశ్ ప్రజల అండతో పోరాడతామన్నారు. 'ఎన్నికల కమిషన్, సుప్రీంకోర్టు చెప్పిన దాని ప్రకారం అభ్యర్థిపై ఏవైనా క్రిమినల్ కేసులు ఉంటే వాటిని పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలి. అటువంటి వ్యక్తిని ఎందుకు తమ అభ్యర్థిగా పెట్టుకుంటున్నామో కూడా రాజకీయ పార్టీలు చెప్పాల్సి ఉంటుంది. ఓ పార్టీకి పరువు నష్టం దావా వేసే అవకాశం ఉండదు' అని సునీత స్పష్టం చేశారు.

నవ్య | చిత్రజ్యోతి



జగపతిబాబు హిందీ చిత్రం

బాలీవుడ్ నటుడు ఆయుష్ శర్మ నటిస్తున్న హై ఓల్టేజ్ యాక్షన్ చిత్రం 'రుస్లాన్'. కరణ్ బి దర్శకత్వం వహించిన ఈ హిందీ చిత్రంలో జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. సుశ్రీ మిశ్రా హీరోయిన్. నిర్మాత కె.కె.రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌కు రచయిత విజయేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో జగపతిబాబు మాట్లాడుతూ 'ఇది నా రెండో హిందీ చిత్రం. చాలా రోజుల తర్వాత డిఫరెంట్ డైమన్షన్స్ ఉన్న పాత్ర చేశాను' అన్నారు. 'సుల్తాన్' సినిమాకు సహాయ దర్శకుడిగా చేశాను. నన్ను నటుడిగా లాంచ్ చేస్తే బాగుంటుందని రచయిత విజయేంద్రప్రసాద్ సలహా ఇచ్చారు. అలా నా జర్నీ మొదలైంది. రాధామోహన్ డేరింగ్ ప్రొడ్యూసర్. ఆయన బేనర్‌లో పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాను' అని చెప్పారు ఆయుష్ శర్మ.

నవ్వుల సునామీ



'టిల్లు స్క్వేర్' చిత్రం సాధించిన ఘన విజయంతో మరింత ఉత్సాహం పొందిన సితార ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఇప్పుడు 'మ్యాడ్' చిత్రానికి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' ను నిర్మించనుంది. గత ఏడాది అక్టోబర్‌లో విడుదలైన 'మ్యాడ్' చిత్రం సూపర్ హిట్ అయింది. ఆ చిత్రానికి దర్శకత్వం వహించిన కల్యాణ్ శంకర్ ఈ సినిమాకు కూడా దర్శకత్వం వహించనున్నారు. 'మ్యాడ్'లో నటించి మెప్పించిన యువ కథానాయకులు నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ఈ సీక్వెల్ కోసం మళ్లీ రంగంలోకి దిగారు. హీరోయిన్ల పేర్లు త్వరలో వెల్లడించనున్నారు. ఇటీవల 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. హీరో సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు కె.వి. అనుదీప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 'మ్యాడ్ నెస్' ఇంకా పూర్తి కాలేదు అని తెలిపిన మేకర్స్ ఈసారి 'మ్యాడ్‌నెస్' రెట్టింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈసారి కథానాయికల త్రయం చేసే అల్లరి థియేటర్లలో నవ్వుల సునామీ సృష్టించనుంది. సూర్యదేవర హారిక, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



మనమే ప్రపంచంలోకి...

శర్వానంద్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'మనమే'. కృతీశెట్టి కథానాయిక. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'మనమే' ప్రపంచాన్ని పరిచయం చేస్తూ చిత్రబృందం శుక్రవారం టీజర్‌ను విడుదల చేసింది. శర్వానంద్, కృతీ, మాస్టర్ విక్రమ్ ఆదిత్య పాత్రలను కొత్తతరహాలో ఆవిష్కరించబోతున్నారని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: విష్ణు శర్మ, జ్ఞానశేఖర్ వీఎస్

తరుణ్‌భాస్కర్ తాజా చిత్రం



దర్శకుడిగా విభిన్న చిత్రాలు రూపొందిస్తూ అప్పుడప్పుడు నటుడిగా కూడా తెరపై కనిపించడం తరుణ్ భాస్కర్‌కు ఓ సరదా. ఇప్పుడు ఆయన ఓ ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌లో లీడ్ రోల్ పోషిస్తున్నారు. ఈషా రెబ్బా హీరోయిన్. సంజీవ్ ఎ.ఆర్. దర్శకుడు. ప్రస్తుతం రాజమండ్రి, పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. శుక్రవారం హీరోయిన్ ఈషా పుట్టిన రోజు కావడంతో సెట్‌లో సెలబ్రేట్ చేసింది యూనిట్. శరవేగంగా షూటింగ్ పూర్తి చేసి అక్టోబర్‌లో విడుదల చేయాలని నిర్మాతల ప్లానింగ్. బ్రహ్మాజీ, శివన్నారాయణ, సురభి ప్రభావతి, బిందు చంద్రమౌళి, గోపరాజు విజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జై క్రిష్, మాటలు: నందకిశోర్ ఈమని, ఫొటోగ్రఫీ: దీప్ యెరగరా, నిర్మాతలు: సృజన్ యరబోలు, వివేక్ కృష్ణని, సాధిక్, ఆదిత్య పిట్టీ.



ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

రాజారవీంద్ర ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఉమాదేవి, శరత్‌చంద్ర నిర్మాతలు. త్వరలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. హీరో శ్రీవిష్ణు ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. సమాజం నిలదీసే పరిస్థితులు ఎదురైనప్పుడు ఓ తండ్రి ఏం చేశాడు, తన కుటుంబాన్ని ఎలా కాపాడుకున్నాడు అనే కథాంశంతో రూపొందిందని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలతో ఈ చిత్రం రూపొందించామని నిర్మాతలు తెలిపారు. ఇదొక చక్కటి ఫ్యామిలీ ఎంటర్టైనర్, ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని హంగులూ ఉన్నాయి అని దర్శకుడు చెప్పారు.

కథానాయికే రచయితగా...



అభినవ్ గోమటం హీరోగా నటించిన చిత్రం 'మై డియర్ దొంగ'. బీఎస్ సర్వాంగ కుమార్ దర్శకత్వంలో మహేశ్వర్‌రెడ్డి గోజల నిర్మించారు. ప్రముఖ ఓటీటీలో విడుదలవుతోంది. నటుడు ప్రియదర్శి చేతుల మీదుగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. అభినవ్ గోమటం మాట్లాడుతూ 'ఒక మంచి ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు ఆనందంగా ఉంది. ఈ సినిమాతో కొత్త టాలెంట్ పరిచయమవుతోంది' అన్నారు. శాలినీ ఈ చిత్ర కథను అందించడంతో పాటు హీరోయిన్‌గానూ నటించారు అని మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. శాలిని మాట్లాడుతూ 'స్క్రిప్ట్‌ను, యాక్టింగ్‌ను నిర్మాతలు నమ్మారు. సినిమా రిలీజ్ అవ్వక ముందే సక్సెస్‌ను ఆస్వాదిస్తున్నా' అన్నారు.


పొట్టేల్ కోసం ఎదురుచూస్తున్నా



సందీప్‌రెడ్డి వంగా

"పొట్టేల్ చిత్రం టీజర్ అద్భుతంగా ఉంది. ఇలాంటి సినిమాలు అరుదుగా వస్తాయి. ఈ చిత్రాన్ని విడుదలైన తొలిరోజే చూడాలనుకుంటున్నాను' అని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా చెప్పారు. యువ చంద్ర కృష్ణ హీరోగా నటించిన చిత్రం 'పొట్టేల్'. అనన్య నాగళ్ల కథానాయిక. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్‌రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగె నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను సందీప్‌రెడ్డి వంగా విడుదల చేశారు. ఈసందర్భంగా యువ చంద్రకృష్ణ మాట్లాడుతూ "పొట్టేల్ మన మట్టి కథ. స్క్రీన్ ప్లే ప్రేక్షకులను అబ్బురపరుస్తుంది' అన్నారు. తన కెరీర్‌లో ఇది బెస్ట్ చిత్రం అవుతుందని అనన్య నాగళ్ల తెలిపారు. పొట్టేల్ సినిమా విషయంలో మేమంతా గర్వంగా ఫీలవుతున్నాం, ప్రేక్షకులను తనదైన భావోద్వేగ ప్రపంచంలోకి తీసుకెళుతుంది అని సాహిత్ అన్నారు. ఇది నా కెరీర్‌లో గొప్ప పాత్ర అవుతుందని అజయ్ అన్నారు. ఈ ప్రయత్నాన్ని ఆదరించాలని నిర్మాతలు ప్రేక్షకులను కోరారు.

కుటుంబమా? నాయకుడా?



నారా రోహిత్ కథానాయకుడిగా నేటి రాజకీయ పరిస్థితిని కళ్లకు కడుతూ తెరకెక్కుతోన్న చిత్రం 'ప్రతినిధి 2'. మూర్తి దేవగుప్తా దర్శకత్వంలో కుమార్ రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీతోట, సురేంద్రనాథ్ బొల్లినేని నిర్మించారు. దర్శకుడు సుకుమార్ చేతుల మీదుగా శుక్రవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. 'మీ కుటుంబం కంటే నాలుగు సంక్షేమ పథకాలు ఇచ్చిన రాజకీయ నాయకుడే మీకు ముఖ్యమా?' అంటూ ఓటర్లను చైతన్యవంతం చేసే జర్నలిస్ట్ పాత్రలో నారా రోహిత్ ఒదిగిపోయారు. ఈ చిత్రంలో సిరీ లెల్లా కథానాయిక. సచిన్ ఖేడ్కర్, జిషుసేన్ గుప్తా, తనికెళ్ల భరణి, ఇంద్రజ కీలకపాత్రలు పోషించారు. సంగీతం: మహతి స్వరసాగర్, సినిమాటోగ్రాఫర్: నాని చమిడిశెట్టి.



లచ్చిమక్క పెళ్లి పాట

రాకేశ్ వర్రె టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'జితేందర్‌రెడ్డి'. విరించి వర్మ దర్శకత్వంలో ముదుగంటి రవీందర్‌రెడ్డి నిర్మించారు. మే 3న విడుదలవుతోంది. తాజాగా చిత్రబృందం 'లచ్చిమక్క' అంటూ సాగే పెళ్లి పాటను విడుదల చేసింది. రాంబాబు గోసాల సాహిత్యానికి, గోపీ సుందర్ స్వరాలందించారు. మంగ్లీ ఆలపించారు. ప్రస్తుతం వస్తున్న సినిమాలకు పూర్తి భిన్నమైన చిత్రమిదని నిర్మాత తెలిపారు. వైశాలి రాజ్, రియా సుమన్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వీఎస్ జ్ఞానశేఖర్

యూ ట్యూబ్ నుంచి సినిమాకు...



ప్రైవేట్ ఆల్బమ్స్‌తో యూ ట్యూబ్‌లో బాగా పాపులర్ అయిన టోనీ కిక్, సునీత్ మారస్యార్, రామ్, బుల్లెట్ బండి లక్ష్మణ్ ఇప్పుడు చిత్ర రంగంలోకి ప్రవేశించారు. టోని, సునీతను హీరోహీరోయిన్లుగా, లక్ష్మణ్‌ను దర్శకుడిగా పరిచయ కర్నాటకకు చెందిన గిరీశ్‌కుమార్ నిర్మించే చిత్రం షూటింగ్ శుక్రవారం హైదరాబాద్‌లో మొదలైంది. టోనీ కిక్, సునీత మారస్యార్ పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు ప్రదీప్‌కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, రచయిత చిన్నికృష్ణ క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'మాది కర్నాటక. రామ్, లక్ష్మణ్ చేసిన 'అల్లా హే అల్లా' వీడియో సాంగ్ నాకు బాగా నచ్చింది. ఆ టీమ్‌తో ఒక సినిమా చేయాలనుకున్నాను. దీని తర్వాత కూడా మంచి చిత్రాలు నిర్మిస్తాను' అన్నారు. దర్శకుడు లక్ష్మణ్ మాట్లాడుతూ 'జానపద గీతాల ద్వారా ప్రేక్షకుల ఆదరణ పొందాం. సినిమాలోని ప్రతి పాట, మాట ఆడియన్స్‌ను అలరించేలా ఉంటుంది. యూ ట్యూబ్‌లో నన్ను ఆదరించినట్లే ఈ సినిమాను కూడా ఆదరించాలని కోరుకుంటున్నా' అన్నారు.

కొత్త తేదీ ఖాయం



ప్రజాదరణ పొందిన హారర్, కామెడీ సిరీస్ 'అరణ్మనై'. దర్శకుడు సి.సుందర్ నటిస్తూ దర్శకత్వం వహించే ఈ సిరీస్‌లో నాలుగో భాగం 'బాక్' పేరుతో తెలుగులోకి వస్తోంది. తమన్నా, రాశీ ఖన్నా ముఖ్య పాత్రలు పోషించిన ఈ సినిమాను మొదట ఈ నెల 26న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అయితే ఎండల తీవ్రత కారణంగా 26న కాకుండా మే 3న సినిమాను రిలీజ్ చేయనున్నట్లు తాజాగా ప్రకటించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నాయి. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేస్తామని చెప్పారు. వెన్నెల కిశోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేశ్, కొవై సరళ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

ఇక జోరుగా పీఎస్‌యూల విక్రయం!

ఎల్ఐసీ, జీఐసీలో వాటాల అమ్మకం



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో వాటాల విక్రయం మరింత జోరందుకోనుంది. లోక్‌సభ ఎన్నికలు ముగిసి మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ప్రభుత్వ రంగంలోని బీమా సంస్థలైన జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (జీఐసీ) ఈక్విటీలో 10 శాతం, ఎల్ఐసీ ఈక్విటీలో మరో 1.5 శాతం విక్రయానికి అధికారులు ఇప్పటికే రంగం సిద్ధం చేశారు. ఇందులో జీఐసీ ఈక్విటీలో 10 శాతం విక్రయం ద్వారా రూ.5,700 కోట్లు, ఎల్ఐసీ ఈక్విటీలో 1.5 శాతం విక్రయం ద్వారా కనీసం రూ.10,000 కోట్లు లభిస్తాయని అంచనా.

మరో మూడు బ్యాంకులు..

జీఐసీ, ఎల్ఐసీకి తోడు ఐడీబీఐ బ్యాంక్, ప్రభుత్వ రంగంలోని రెండు బ్యాంకుల ప్రైవేటీకరణ కూడా ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి చేసేందుకు అధికార వర్గాలు కసరత్తు పూర్తి చేశాయి. ఈ రెండు బ్యాంకులు ఏవనే విషయాన్ని ప్రభుత్వం ఇప్పటి వరకు బయటపెట్టలేదు. అయితే సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సీబీఐ), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) ఈ జాబితాలో ఉన్నట్టు సమాచారం. ఎన్ఎండీసీ అనుబంధ సంస్థ ఎన్ఎండీసీ స్టీల్ ప్రైవేటీకరణ కూడా ఈ ఆర్థిక సంవత్సరం పూర్తవుతుందని భావిస్తున్నారు.

విప్రో.. డీలా!



నిరాశాజనకంగా కంపెనీ ఆర్థిక ఫలితాలు

7.8% తగ్గి రూ.2,835 కోట్లకు పరిమితమైన క్యూ4 లాభం

- రూ.22,208 కోట్లకు జారిన ఆదాయం
- 9.5 శాతం తగ్గిన ఉద్యోగుల సంఖ్య
- ఉద్యోగుల వలసల రేటు 14.2 శాతం
- ఒక్కో షేరుకు రూపాయి డివిడెండ్

బెంగళూరు: ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరపు నాలుగో త్రైమాసికంలో (క్యూ4) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 7.8 శాతం క్షీణించి రూ.2,834.6 కోట్లకు పరిమితమైంది. ఆదాయం కూడా 4.2 శాతం తగ్గి రూ.22,208.3 కోట్లకు పడిపోయింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి సైతం విప్రో ఆదాయం వార్షిక ప్రాతిపదికన 0.8 శాతం తగ్గి రూ.89,760.3 కోట్లకు చేరుకోగా.. నికర లాభం 2.6 శాతం తగ్గుదలతో రూ.11,045.2 కోట్లుగా నమోదైంది. క్యూ4లో ఐటీ సేవల విభాగం నుంచి కంపెనీకి సమకూరిన ఆదాయం 265.7 కోట్ల డాలర్లుగా నమోదైంది. క్యూ3తో పోలిస్తే 0.1 శాతం అధికమిది. మరిన్ని విషయాలు..

- ఈ జూన్ 30తో ముగియనున్న 2024-25 ఆర్థిక సంవత్సరపు తొలి త్రైమాసికానికి (క్యూ1)లో ఐటీ సేవల వ్యాపారం ద్వారా కంపెనీకి సమకూరనున్న ఆదాయం (స్థిర కరెన్సీ ఆధారంగా) 261.7-267 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండవచ్చని విప్రో అంచనా వేసింది. అనగా, 2023-24 క్యూ4తో పోలిస్తే 2024-25 క్యూ1లో ఆదాయ వృద్ధి మైనస్ 1.5 శాతం నుంచి 0.5 శాతం శ్రేణిలో నమోదు కావచ్చని కంపెనీ భావిస్తోంది.
- క్యూ4లో 120 కోట్ల డాలర్ల విలువైన భారీ డీల్స్‌ను దక్కించుకున్నట్లు విప్రో వెల్లడించింది. క్యూ3లో లభించిన 90 కోట్ల డాలర్ల బడా కాంట్రాక్టులతో పోలిస్తే 31 శాతం అధికమిది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి భారీ డీల్స్ 460 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. కాగా, క్యూ4 మొత్తం బుకింగ్స్ 360 కోట్ల డాలర్లుగా, 2023-24 మొత్తానికి 1,490 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.
- ఈ జనవరి 12న నిర్వహించిన బోర్డు సమావేశంలో వాటాదారులకు ఒక్కో షేరుకు రూపాయి మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించారు. దీనికి బోర్డు సభ్యులు తాజాగా ఆమోదం తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను దీన్నే తుది డివిడెండ్‌గా పరిగణించడం జరుగుతుందని విప్రో స్పష్టం చేసింది.
- క్యూ4లో విప్రోలో నికరంగా 6,180 మంది ఉద్యోగులు తగ్గారు. త్రైమాసికం చివరినాటికి కంపెనీ ఉద్యోగుల సంఖ్య తగ్గడం వరుసగా ఇది ఆరోసారి. కాగా, 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఉద్యోగుల సంఖ్య వార్షిక ప్రాతిపదికన 9.5 శాతం (24,516 మంది) తగ్గడంతో ఈ మార్చి 31 నాటికి 2,34,054 మందికి పరిమితమైంది. గడిచిన దశాబ్దకాలంలో విప్రో ఉద్యోగుల సంఖ్య వార్షిక ప్రాతిపదికన తగ్గడం ఇది మూడోసారి. కాగా, కంపెనీ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 14.2 శాతంగా నమోదైంది.

అనిశ్చితులు అలాగే..

గడిచిన ఆర్థిక సంవత్సరం ఐటీ పరిశ్రమకు పెద్ద సవాలుగా నిలిచింది. అది మా కంపెనీ పనితీరుపైనా ప్రభావం చూపింది. ఇప్పటికీ ఆర్థిక అనిశ్చితులు అలాగే కొనసాగుతున్నాయి. స్వల్పకాలికంగా మరిన్ని సవాళ్లు ఎదురుకావచ్చు. అయినప్పటికీ, అవకాశాలు అపరిమితం. మా ముందున్న అవకాశాలపై ఆశావహంగా ఉన్నాం. సాంకేతికంగా ఐటీ రంగం పెను మార్పులకు లోనవుతోంది. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత అందుబాటులోకి రావడంతో క్లయింట్ల అవసరాలూ మారుతున్నాయి. ఎందుకంటే, వారు ఏఐ టెక్నాలజీ సాయంతో మార్కెట్ పోటీలో నిలబడటంతో పాటు వ్యాపార విలువను పెంచుకోవాలని చూస్తున్నారు. మేం కూడా ఇందుకు సిద్ధమవుతున్నాం. క్లయింట్లు తమ లక్ష్యాల సాధించేందుకు తోడ్పడే సామర్థ్యం, నాయకత్వం, 2.30 లక్షలకు పైగా నిపుణులైన సిబ్బంది మాకుంది. ఇందుకోసం మేం గణనీయంగా కసరత్తు చేయాల్సి ఉన్నప్పటికీ సమిష్టి కృషితో కంపెనీ భవిష్యత్ వృద్ధికి బాటలు వేస్తాం.

- శ్రీనివాస్ పల్లియా, సీఈఓ, విప్రో

చైర్మన్‌గా రిషద్ ప్రేమ్‌జీ పునర్నియామకం

మరో ఐదేళ్ల పాటు (2024 జూలై 31 నుంచి 2029 జూలై 30 వరకు) విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా రిషద్ ప్రేమ్‌జీ పునర్నియామకానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. అలాగే, మరో ఐదేళ్ల (2024 జూలై 31 నుంచి 2029 జూలై 30 వరకు) నాన్ ఎగ్జిక్యూటివ్, నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా అజీమ్ ప్రేమ్‌జీ పునర్నియామకానికి సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

గ్రీన్‌కో నుంచి అమర రాజా ఇన్‌ఫ్రాకు ఆర్డర్

న్యూఢిల్లీ: అమర రాజా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ (ఏఆర్ఐపీఎల్)కు గ్రీన్‌కో నుంచి భారీ కాంట్రాక్టు లభించింది. ఈ కాంట్రాక్టు కింద కంపెనీ కర్నూలు జిల్లాలోని ఉయ్యాలవాడ పట్టణ సమీపంలో గ్రీన్‌కో కోసం 2,200 ఎకరాల్లో 700 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తుంది. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో కంపెనీ ఈ ప్రాజెక్టు చేపడుతోంది. తాజా ఆర్డర్‌తో ఈ ఏడాది మార్చి చివరి నాటికి అమర రాజా ఇన్‌ఫ్రా చేతిలో ఉన్న ఆర్డర్ల విలువ రూ.1,516 కోట్లకు చేరింది.

హ్యుండయ్ మోటార్ గ్రామీణ్ మహోత్సవ్

న్యూఢిల్లీ: హ్యుండయ్ మోటార్ కంపెనీ "గ్రామీణ్ మహోత్సవ్"ను కొత్తగా 16 ప్రాంతాలకు విస్తరిస్తోంది. ప్రయోగాత్మకంగా గుజరాత్‌లో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. తమ కార్లను ప్రదర్శించడంతో పాటు సమాంతరంగా ప్రత్యేక సంగీత కచేరీలు, జానపద నృత్యాలు, ప్రాంతీయ టాలెంట్ షోల నిర్వహణ ద్వారా గ్రామీణ భారతంతో బంధం పటిష్ఠం చేసుకోవడం, తద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని అపార మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

పబ్లిక్ ఇష్యూకి ఓలా క్యాబ్స్

రైడ్ హెయిలింగ్ కంపెనీ ఓలా క్యాబ్స్ పబ్లిక్ ఇష్యూకి రావాలని యోచిస్తోంది. కంపెనీ విలువ 500 కోట్ల డాలర్లుగా పరిగణనలోకి తీసుకుని 50 కోట్ల డాలర్లు (సుమారు రూ.4,200 కోట్లు) ఇష్యూ ద్వారా సమీకరించాలని కంపెనీ భావిస్తున్నట్టు ఆ పరిణామంతో సన్నిహిత వర్గాలు తెలిపాయి. రాబోయే మూడు నెలల కాలంలో సెబీకి దరఖాస్తు సమర్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు వారు తెలిపారు. త్వరలోనే బ్యాంకర్లను కూడా నియమిస్తారంటున్నారు. అయితే ఈ పరిణామంపై వ్యాఖ్యానించేందుకు కంపెనీ నిరాకరించింది.

ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలు రాబోతున్నాయ్..!

2026లో అందుబాటులోకి

న్యూఢిల్లీ: దేశంలో మరో రెండేళ్లలో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలు అందుబాటులోకి రాబోతున్నాయి. దేశీయ ఎయిర్‌లైన్స్ ఇండిగో యాజమాన్య సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌తో కలిసి అమెరికాకు చెందిన ఆర్చర్ ఏవియేషన్ ఈ ఎయిర్ ట్యాక్సీలను దేశంలో ప్రవేశపెట్టనుంది. వీటి ద్వారా ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ నుంచి హర్యానాలోని గురుగ్రామ్‌కు కేవలం 7 నిమిషాల్లో చేరుకోవచ్చు. ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.2,000- 3,000 వరకు వసూలు చేయనున్నట్లు ఆర్చర్ ఏవియేషన్ ఎగ్జిక్యూటివ్స్ తెలిపారు. ఈ 27 కిలోమీటర్ల రోడ్డు మార్గ ప్రయాణానికి గంటన్నర పడుతుందని, ట్యాక్సీ అద్దె రూ.1,500 వరకు అవుతుందన్నారు. అంటే, క్యాబ్ చార్జీతో పోలిస్తే 1.5 రెట్ల ధరకే నిమిషాల్లో గమ్యాన్ని చేరుకోవచ్చు. తొలుత ఢిల్లీ-గురుగ్రామ్‌తో పాటు ముంబై-బెంగళూరు మార్గంలోనూ ఈ సేవలు ప్రారంభించాలనుకుంటున్నట్లు ఆర్చర్ ఏవియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. భారత్‌లో ఎయిర్ ట్యాక్సీ సేవల ప్రారంభం కోసం గత ఏడాది నవంబరులో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌తో ఆర్చర్ ఏవియేషన్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

మార్కెట్లో పుల్‌బ్యాక్ ర్యాలీ

600 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ నాలుగు రోజుల నష్టాలకు శుక్రవారం తెర దించింది. బ్యాంకింగ్, ఆటో షేర్లలో విలువ ఆధారిత కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ఫలితంగా సెన్సెక్స్ 599.34 పాయింట్లు లాభపడి 73,088.33 వద్ద ముగియగా నిఫ్టీ 151.15 పాయింట్లు లాభపడి 22,147 వద్ద క్లోజైంది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1,156.57 పాయింట్లు, నిఫ్టీ 372 పాయింట్లు నష్టపోయాయి.

నెస్లే డౌన్: తక్కువగా అభివృద్ధి చెందిన కొన్ని దేశాల్లో శిశు పాల ఉత్పత్తులను అధిక చక్కెర శాతంతో విక్రయించిందన్న అభియోగాల నేపథ్యంలో నెస్లే షేరు పతనం కొనసాగుతోంది. బీఎస్ఈలో శుక్రవారం ఈ షేరు ఇంట్రాడేలో 3.53 శాతం నష్టంతో రూ.2,375.75 స్థాయికి దిగజారింది. అయితే చివరికి 1.04 శాతం నష్టంతో రూ.2,437.10 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో కూడా 1.32 శాతం నష్టంతో రూ.2,430 వద్ద ముగిసింది.

23న ఎంఫోర్స్ ఆటోటెక్ ఇష్యూ: ఆటో విడిభాగాల తయారీదారు ఎంఫోర్స్ ఆటోటెక్ ఐపీఓ వచ్చే మంగళవారం ప్రారంభమై గురువారం ముగుస్తుంది. ఇష్యూలో భాగంగా 54.99 లక్షల తాజా ఈక్విటీ షేర్లు జారీ చేయడం ద్వారా రూ.54 కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. షేరు ధర శ్రేణిని రూ.93-98గా నిర్ణయించారు. ఈ షేర్లను బీఎస్ఈ ఎస్ఎంఈ సూచీలో లిస్టింగ్ చేస్తారు.

కెనరా స్టాక్ విభజన : ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ షేర్ల విభజనకు రికార్డు తేదీని మే 15గా నిర్ణయించింది. ఆ తేదీకి బ్యాంక్ షేర్లున్న వారందరూ దీనికి అర్హులవుతారు. ఒక్కోటి రూ.10 ముఖ విలువ గల షేర్లను ఒక్కోటి రూ.2 విలువ గల ఐదు షేర్లుగా విభజించేందుకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు ఫిబ్రవరిలో ఆమోదముద్ర వేసింది.

బంగారం అ'ధర' హో: బులియన్ మార్కెట్లో బంగారం ధర ఎక్కడా వెనుక చూపే లేదన్నట్టుగా పరుగులు తీస్తోంది. ఢిల్లీ మార్కెట్లో శుక్రవారం 10 గ్రాముల బంగారం ధర రూ.400 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.74,100 పలికింది. కిలో వెండి ధర కూడా రూ.100 పెరిగి కొత్త రికార్డు స్థాయి రూ.86,600 పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 15 డాలర్లు పెరిగి 2,390 డాలర్లకు చేరింది. వెండి కూడా ఔన్సు 28.29 డాలర్లు పలికింది.

ఐటీలో ఆగని సంక్షోభం

64,000 మంది ఉద్యోగులు బయటకు

బెంగళూరు: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో సంక్షోభం కొనసాగుతోంది. ఈ ప్రభావం ఉద్యోగుల మీదా పడుతోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) మూడు అగ్రశ్రేణి ఐటీ దిగ్గజ కంపెనీలు టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో కంపెనీలు 64,000 మంది ఉద్యోగులను బయటికి పంపించాయి. ఇందులో ఇన్ఫోసిస్ 24,994 మందిని,విప్రో 24,516 మందిని, టీసీఎస్ 13,244 మందిని ఇంటికి పంపించాయి.చిన్న,మధ్య తరహా ఐటీ కంపెనీలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య లక్షకు పైనే ఉంటుందని అంచనా. అయితే ఇందులో కొందరు ఉద్యోగాలు మారిన వారు కూడా ఉన్నారు.

తీసివేతలకు కారణాలు..

- అమెరికా, ఐరోపా దేశాల్లో ఆర్థిక సంక్షోభం తలెత్తటం
- కంపెనీలు తమ ఐటీ బడ్జెట్‌లను గణనీయంగా తగ్గించడం
- ఆర్డర్లు తగ్గడంతో కంపెనీలు ఉద్యోగుల కోతలకు దిగడం
- కొంతమంది ఉద్యోగులు సరికొత్త టెక్నాలజీలను సరిగా నేర్చుకోలేక పోవడం
- తయారీ, బీఎఫ్ఐఎస్ రంగాల్లో మంచి అవకాశాలు లభించడం

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,340 ▲	68,150 ▲	90,000 ▼
ముంబై	73,404 ▼	67,236 ▼	82,853 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ

హైదరాబాద్	410	విజయవాడ	415
వరంగల్	412	గోదావరి	415
చిత్తూరు	493	విశాఖపట్నం	430

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	118	గోదావరి	131
వరంగల్	118	విజయవాడ	131
కరీంనగర్	118	గుంటూరు	131
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	131
కర్నూలు	118	చిత్తూరు	134
విశాఖపట్నం	118		

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: ఢిల్లీ

ఢిల్లీ X హైదరాబాద్

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లి (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
361 (7 మ్యాచ్‌లు)	13 (7 మ్యాచ్‌లు)

లఖ్‌నవూ సూపర్

చెన్నైపై ఘనవిజయం

రాహుల్, డికాక్ అర్ధసెంచరీలు

తేలిపోయిన సీఎస్‌కే బౌలర్లు



రాహుల్ (53 బంతుల్లో 82)

లఖ్‌నవూ: హ్యాట్రిక్ విజయాలపై కన్నేసిన చెన్నై సూపర్ కింగ్స్‌కు ఝలక్. అటు రెండు వరుస ఓటముల తర్వాత లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విజయాల బాట పట్టింది. సొంత మైదానమంతా పసుపుమయం అయినప్పటికీ.. ఆల్‌రౌండ్ షోతో అదుర్స్ అనిపించింది. ముందుగా బౌలర్లు సీఎస్‌కేను ఓ మాదిరి స్కోరుకే కట్టడి చేయగా.. ఆ తర్వాత ఓపెనర్లు రాహుల్ (53 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 82), డికాక్ (43 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 54) శతక భాగస్వామ్యంతో విజయాన్ని ఖాయం చేశారు. చెన్నై బౌలర్లు ఈ మ్యాచ్‌లో పూర్తిగా తేలిపోయారు. దీంతో 8 వికెట్ల తేడాతో గెలిచిన లఖ్‌నవూ 8 పాయింట్లతో నిలిచింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్లకు 176 పరుగులు సాధించింది. జడేజా (40 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 57 నాటౌట్), రహానె (36), మొయిన్ అలీ (30), ఎంఎస్ ధోనీ (9 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 28 నాటౌట్) రాణించారు. క్రునాల్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో లఖ్‌నవూ 19 ఓవర్లలో 2 వికెట్లకు 180 పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రాహుల్ నిలిచాడు.

అలవోకగా..: స్లో పిచ్‌పై ఛేదన లఖ్‌నవూకు కూడా కష్టంగా మారుతుందనిపించినా.. ఓపెనర్లు రాహుల్, డికాక్ ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుకుసాగారు. వికెట్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలించడంతో ఈ ఇద్దరూ శతక భాగస్వామ్యంతో చెన్నై బౌలర్లను ఆటాడేసుకున్నారు. ముఖ్యంగా రాహుల్ దూకుడుకు స్కోరు 11 ఓవర్లలోనే వంద దాటడం విశేషం. బంతి చక్కగా బ్యాట్ మీదికి రావడంతో రాహుల్ ఆరంభం నుంచే వేగంగా ఆడాడు. మూడో ఓవర్‌లో 4,6.. ఆరో ఓవర్‌లో 4,6 బాదడంతో పవర్‌ప్లేలో 54 రన్స్ చేసింది. 11వ ఓవర్‌లో మరో రెండు ఫోర్లతో రాహుల్ 31 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అటు డికాక్ కూడా చక్కగా సహకరిస్తూ 40 బంతుల్లోనే ఈ ఫీట్ సాధించాడు. ఈ దశలో వికెట్ కోసం చెన్నై ఎదురుచూపులకు తెర దించుతూ 15వ ఓవర్‌లో ముస్తాఫిజుర్.. డికాక్ వికెట్ తీశాడు. దీంతో తొలి వికెట్‌కు 134 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. కానీ అప్పటికి ఎల్ఎస్‌జీ విజయానికి 30 బంతుల్లో 43 పరుగులే అవసరమయ్యాయి. 17వ ఓవర్‌లో పూరన్ రెండు, రాహుల్ ఓ ఫోర్‌తో 15 రన్స్ వచ్చాయి. తర్వాతి ఓవర్‌లో జడేజా డైవింగ్ క్యాచ్‌తో రాహుల్ వెనుదిరిగినా లఖ్‌నవూకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. పూరన్ (23 నాటౌట్), స్టొయినిస్ (8 నాటౌట్) మరో ఓవర్ ఉండగానే మ్యాచ్‌ను ముగించారు.

జడేజా నిలకడ, ధోనీ మెరుపులు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై ఆరంభం నుంచే తడబడింది. పరుగులు కష్టంగా మారిన ఈ పిచ్‌పై లఖ్‌నవూ బౌలర్లు వరుస విరామాల్లో వికెట్లను తీస్తూ ఒత్తిడి పెంచారు. కానీ ఆఖరి రెండు ఓవర్ల సమయంలో బరిలోకి దిగిన ఎంఎస్ ధోనీ మాత్రం ఎలాంటి ఇబ్బంది లేకుండా ధనాధన్ షోతో మురిపించాడు. జడేజా అజేయ అర్ధసెంచరీతో నిలువగా జట్టు సవాల్ విసిరే స్కోరందుకోగలిగింది. పేసర్ మొహిసిన్ అద్భుత బంతికి ఓపెనర్ రచిన్ రెండో ఓవర్‌లోనే గోల్డెన్ డకౌట్ అయ్యాడు. ఆ తర్వాత కెప్టెన్ రుతురాజ్ (17) సైతం నిరాశపరుస్తూ పేసర్ యష్‌కు దొరికిపోయాడు. అటు ఓపెనర్‌గా రహానె ఈసారి ఫామ్‌ను చాటుకున్నాడు. మూడో ఓవర్‌లో సిక్సర్ బాదిన తను ఐదో ఓవర్‌లో రెండు వరుస ఫోర్లు సాధించడంతో పవర్‌ప్లేలో జట్టు 51/2 స్కోరుతో నిలిచింది. అనంతరం పరుగులు మరీ నెమ్మదించగా వికెట్లు కూడా వేగంగా కోల్పోయింది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా బరిలోకి దిగిన జడేజాతో కలిసి రహానె మూడో వికెట్‌కు 35 పరుగులు జోడించాక తొమ్మిదో ఓవర్‌లో వెనుదిరిగాడు. క్రునాల్ అతడిని బౌల్డ్ చేశాడు. కాసేపటికే చెన్నైకి గట్టి దెబ్బ తగిలింది. ఫామ్‌లో ఉన్న శివమ్ దూబే (3)ను పేసర్ స్టొయినిస్ అవుట్ చేయగా.. తర్వాతి ఓవర్‌లోనే ఇంపాక్ట్ ప్లేయర్ రిజ్వీ (1)ని క్రునాల్ దెబ్బతీశాడు. దీంతో జట్టు 90/5 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దశలో బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో 34 బంతుల పాటు కనీసం ఫోర్ కూడా నమోదు కాలేదు. అతికష్టంగా 15వ ఓవర్‌లో స్కోరు వంద దాటింది. అటు 34 బంతుల్లో జడ్డూ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అయితే మొయిన్ అలీ 18వ ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సర్లతో చెన్నై శిబిరంలో ఊపును తెచ్చాడు. ఆరో వికెట్‌కు 51 పరుగులు అందించాక తను అదే ఓవర్‌లో అవుట్ కావడంతో ఎంఎస్ ధోనీ బరిలోకి దిగాడు. వచ్చిందే తడవుగా.. 300+ స్ట్రయిక్ రేట్‌తో 19వ ఓవర్‌లో 4,6తో 15 రన్స్.. ఆఖరి ఓవర్‌లో 6,4,4తో 19 రన్స్ అందించడంతో స్కోరు 170 దాటింది.

1

ఐపీఎల్‌లో ఎక్కువ 50+ స్కోర్లు (25) సాధించిన వికెట్‌కీపర్‌గా రాహుల్. ధోనీ (24)ని అధిగమించాడు.

స్కోరుబోర్డు

చెన్నై: రహానె (బి) క్రునాల్ 36, రచిన్ (బి) మొహిసిన్ 0, రుతురాజ్ (సి) రాహుల్ (బి) యశ్ 17, జడేజా (నాటౌట్) 57, దూబే (సి) రాహుల్ (బి) స్టొయినిస్ 3, రిజ్వీ (స్టంప్డ్) రాహుల్ (బి) క్రునాల్ 1, మొయిన్ అలీ (సి) బదోని (బి) బిష్ణోయ్ 30, ధోనీ (నాటౌట్) 28, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 176/6; వికెట్ల పతనం:** 1-4, 2-33, 3-68, 4-87, 5-90, 6-141; **బౌలింగ్:** హెన్రీ 3-0-26-0, మొహిసిన్ 4-0-37-1, యశ్ ఠాకూర్ 4-0-45-1, క్రునాల్ పాండ్యా 3-0-16-2, బిష్ణోయ్ 4-0-44-1, స్టొయినిస్ 2-0-7-1.

లఖ్‌నవూ: డికాక్ (సి) ధోనీ (బి) ముస్తాఫిజుర్ 54, రాహుల్ (సి) జడేజా (బి) పతిరన 82, పూరన్ (నాటౌట్) 23, స్టొయినిస్ (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 19 ఓవర్లలో 180/2; వికెట్ల పతనం:** 1-134, 2-161; **బౌలింగ్:** దీపక్ చాహర్ 3-0-26-0, తుషార్ దేశ్‌పాండే 4-0-42-0, ముస్తాఫిజుర్ 4-0-43-1, జడేజా 3-0-32-0, పతిరన 4-0-29-1, మొయిన్ అలీ 1-0-5-0.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	7	6	1	0	12	0.677
కోల్‌కతా	6	4	2	0	8	1.399
చెన్నై	7	4	3	0	8	0.529
హైదరాబాద్	6	4	2	0	8	0.502
లఖ్‌నవూ	7	4	3	0	8	0.123
ఢిల్లీ	7	3	4	0	6	-0.074
ముంబై	7	3	4	0	6	-0.133
గుజరాత్	7	3	4	0	6	-1.303
పంజాబ్	7	2	5	0	4	-0.251
బెంగళూరు	7	1	6	0	2	-1.185

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

నన్నూ చుట్టేసింది ధోనీ మేనియా!

స్టెయిన్



ధోనీ (9 బంతుల్లో 28 నాటౌట్)

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ధోనీకి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఇక మహీకి ఇదే ఆఖరి ఐపీఎల్ అని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ సీజన్‌లో చెన్నై జట్టు మ్యాచ్‌ల కోసం అభిమానులు స్టేడియాలకు పోటెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో మహీ మేనియా తననూ ఆవహించిందంటున్నాడు సఫారీ మాజీ పేసర్ డేల్ స్టెయిన్. 'ధోనీ మేనియా.. నాతోపాటు సౌతాఫ్రికానూ చుట్టుముట్టేసింది. నేను టీవీ ఎక్కువగా చూడను. కానీ ఐపీఎల్ అందునా మహీని చూడడం కోసం టీవీకి అతుక్కుపోతున్నా. అలా గంటలకొద్దీ ఆన్ చేసి ఉంచుతుండడంతో టీవీ పగిలిపోతుందని నా గర్ల్‌ఫ్రెండ్ పరిహాస మాడుతోంది' అని డేల్ సరదాగా చెప్పుకొచ్చాడు.

తెలుగు మూలాల ఇంగ్లండ్ క్రికెటర్ రామన్ సుబ్బా రో మృతి



న్యూఢిల్లీ: తెలుగు మూలాలున్న ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ రామన్ సుబ్బా రో (92) వృద్ధాప్య సమస్యలతో మరణించినట్టు ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు గురువారం ప్రకటించింది. 1958లో ఇంగ్లండ్ తరఫున టెస్ట్ అరంగేట్రం చేసిన ఆయన 1961 వరకు 13 మ్యాచ్‌లు ఆడారు. 29 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరైన సుబ్బా రో 'ఫస్ట్‌క్లాస్'లో కేంబ్రిడ్జ్ వర్సిటీ, సర్రే, నార్తంప్టన్‌షైర్ జట్లకు ఆడారు. ఆటకు వీడ్కోలు పలికాక 1992-2001 మధ్య 41 టెస్టులు, 119 వన్డే మ్యాచ్‌లకు రెఫరీగా వ్యవహరించారు. ఇప్పటిదాకా..జీవించి ఉన్న పెద్ద వయస్సు ఇంగ్లండ్ క్రికెటర్‌గా ఆయన ఖ్యాతి గాంచారు. అతని తండ్రి పంగులూరి వెంకట సుబ్బారావు బాపట్లకు సమీపంలోని జమ్ములపాలెం నుంచి 1913లో ఉన్నత విద్యకోసం ఇంగ్లండ్ వెళ్లి స్థిరపడ్డారు. తల్లి ఇంగ్లండ్‌కు చెందిన డోరిస్ మిల్డ్రెడ్ పిన్నర్.

ఫైనల్లో యుకీ జోడీ

మ్యూనిచ్ (జర్మనీ): భారత టెన్నిస్ స్టార్ యుకీ భాంబ్రీ బవేరియన్ ఇంటర్నేషనల్ టోర్నీలో డబుల్స్‌లో ఫైనల్ చేరాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో యుకీ/అల్బానో అల్బానో (ఫ్రాన్స్) ద్వయం 6-1, 6-7(5-7), 10-7తో ఆస్ట్రియా జంట అలెగ్జాండర్/లుకాస్‌పై నెగ్గింది.

ఫ్చ్.. కొద్దిలో మిస్



జిమ్నాస్ట్ దీపకు చేజారిన పతకం

వరల్డ్‌కప్‌లో నాలుగోస్థానం

న్యూఢిల్లీ: భారత స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ మరోసారి అంతర్జాతీయ వేదికపై ఆకట్టుకునే ప్రదర్శన చేసింది కానీ.. త్రుటిలో పతకం చేజార్చుకుంది. దోహ వేదికగా జరిగిన ఎఫ్ఐజీ ఆపరేటస్ వరల్డ్‌కప్‌లో మహిళల వాల్ట్ ఈవెంట్‌లో దీప నాలుగోస్థానంలో నిలిచింది. పారిస్ ఒలింపిక్స్‌కు క్వాలిఫయింగ్ ఈవెంట్ అయిన ఈ టోర్నీలో దీప.. శుక్రవారం జరిగిన వాల్ట్ విభాగం ఫైనల్స్‌లో 13.333 స్కోరు చేసి కొద్దిలో కాంస్యాన్ని కోల్పోయింది. జార్జివా వాలెంటినా (బల్గేరియా) 13.466 పాయింట్లతో మూడోస్థానంలో నిలిచి కంచు పతకాన్ని దక్కించుకుంది. పనామా జిమ్నాస్ట్ నవాస్ కార్లా (13.850)కు స్వర్ణం, కొరియాకు చెందిన అన్ చాంగ్ ఓక్ (13.833)కు రజతం లభించాయి. భారత్‌కే చెందిన ప్రణతి నాయక్ క్వాలిఫయింగ్ రౌండ్‌లోనే వెనుదిరిగింది. గతంలో రెండుసార్లు మోకాలి ఆపరేషన్ కారణంగా ఫామ్ కోల్పోయిన 30ఏళ్ల దీప.. ఆమధ్య డోపింగ్ నిబంధనల ఉల్లంఘనతో దాదాపు రెండేళ్ల సస్పెన్షన్‌కు గురైంది. దీంతో ఇప్పటికీ ఒలింపిక్స్ బెర్త్ వేటలోనున్న దీపకు పారిస్ టిక్కెట్ అందుకునేందుకు వచ్చేనెల 16 నుంచి ఉజ్బెకిస్థాన్‌లో జరిగే ఆసియా చాంపియన్‌షిప్ చివరి అవకాశం కానుంది.

ఒలింపిక్ ట్రయల్స్‌లో ఇషా టాప్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ ట్రయల్స్ తొలి రోజు పోటీల్లో హైదరాబాద్ యువ షూటర్ ఇషా సింగ్ టాప్‌లో నిలిచింది. శుక్రవారం ఇక్కడ జరిగిన ట్రయల్స్ 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో ఇషా 585 పాయింట్లు సాధించింది. సీనియర్లు సిమ్రన్‌ప్రీత్ కౌర్ (583), మనూ భాకర్ (582) తర్వాతి రెండు స్థానాలతో సరిపెట్టుకున్నారు. పురుషుల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో భవేష్ (580) టాప్‌లో నిలవగా, విజయ్‌వీర్ సిద్ధు (579), అనీష్ (578) తర్వాతి స్థానాల్లో నిలిచారు. శనివారం ఫైనల్స్ జరుగుతాయి.

అగ్రస్థానానికి గుకేష్



టొరంటో: భారత యువ గ్రాండ్‌మాస్టర్ గుకేష్ క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో అగ్రస్థానానికి చేరుకోగా, తాజా ఫలితాలతో ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతీ టైటిల్ రేసు నుంచి దాదాపు దూరమయ్యారు. 12వ రౌండ్‌లో నిజత్ అబసోవ్(అజర్‌బైజాన్)పై గుకేష్ సంచలన విజయం సాధించాడు. నెపోమ్నియాచి (రష్యా)తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకోగా, ఫాబియానో (అమెరికా) చేతిలో విదిత్ ఓడాడు. మహిళల విభాగంలో అలెగ్జాండ్రా గోరియాచ్కినా (రష్యా)తో గేమ్‌ను హంపి డ్రా చేసుకోగా, అన్నా ముజిచుక్ (ఉక్రెయిన్)పై వైశాలి గెలిచింది. మొత్తం 12 రౌండ్లు ముగిసే సరికి గుకేష్ (7.5) టాప్‌లో, నకమురా (అమెరికా-7.5) రెండో స్థానంలో ఉన్నారు. మహిళల్లో టాన్ జాంగీ (చైనా) 8 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలవగా, హంపి 6 పాయింట్లతో 4వ, వైశాలి 5.5 పాయింట్లతో 6వ స్థానంలో కొనసాగుతున్నారు.

రెజ్లర్లకు నిరాశ

బిష్కెక్ (కజకిస్థాన్): ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో తొలిరోజు భారత రెజ్లర్లకు నిరాశే ఎదురైంది. శుక్రవారం ఇక్కడ జరిగిన 57 కిలోల విభాగంలో అమన్ సెహ్రావత్ సెమీస్‌లో ఓడిపోగా.. స్టార్ రెజ్లర్ దీపక్ పూనియా, సుజీత్ కల్కల్ వెయింగ్‌కు ఆలస్యంగా రావడంతో వారి ఎంట్రీని తిరస్కరించారు. కాగా మహిళల విభాగం పోటీలు శనివారం జరుగుతాయి.



అబ్ కీ బార్?

కాషాయ రంగులోకి దూరదర్శన్ లోగో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడిచే దూరదర్శన్ చానెల్ తన లోగోను మార్చుకుంది. ఎరుపు రంగులో ఉన్న లోగోను తాజాగా కాషాయంలోకి మార్చింది. ఏప్రిల్ 16 నుంచి ఇది అమల్లోకి వచ్చినట్లు సోషల్ మీడియా ద్వారా డీడీ న్యూస్ ప్రకటించింది. ఈ సందర్భంగా... లోగో మారింది తప్ప చానెల్ విలువల్లో ఎలాంటి మార్పు లేదని తెలిపింది. "వేగం కంటే కచ్చితత్వాన్ని, అబద్ధాల కంటే నిజాన్ని, సంచలనాల కంటే సత్యాన్ని మాత్రమే ముందుంచే దూరదర్శన్... తన కొత్త ప్రయాణాన్ని ప్రారంభించింద"ని పోస్ట్ చేసింది. ఎన్నికల వేళ లోగో కాషాయంలోకి మారడం ప్రాధాన్యం సంతరించుకొంది.

ఇద్దరు యువరాజుల సినిమాను జనం ఎప్పుడో తిరస్కరించారు

» రాహుల్ గాంధీ, అఖిలేశ్ పొత్తుపై మోదీ ఎద్దేవా

అమ్రోహా(యూపీ), ఏప్రిల్ 19: ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో చేతులు కలిపిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌లపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. ఈ ఇద్దరు యువరాజులు కలిసి తీసిన సినిమాను ప్రజలు ఏనాడో (2017) తిరస్కరించారని గుర్తుచేశారు. అయినా 'దో షెహజాదీ కీ జోడీ(ఇద్దరు యువరాజుల జోడీ)' సినిమా షూటింగ్‌ను వారు కొనసాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన అమ్రోహాలో జరిగిన ఎన్నికల సభలో ప్రసంగించారు. 'యూపీ ప్రజలను వీరు ఓట్లు అడిగేందుకు వచ్చినప్పుడల్లా.. కుటుంబం, అవినీతి, బుజ్జగింపు రాజకీయాల పెట్టెతో వస్తారు. మన మతవిశ్వాసాలపై దాడిచేయడానికి ఏ మాత్రం సంకోచించరు' అని వ్యాఖ్యానించారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో పశ్చిమ యూపీని తగులబెట్టారని, మతకల్లోలాలు సృష్టించారని ఆరోపించారు. యోగి ప్రభుత్వం వచ్చాక నేరగాళ్లపై ఉక్కుపాదం మోపి ప్రజలకు భద్రత కల్పించిందన్నారు. అమ్రోహా కాంగ్రెస్ అభ్యర్థి డానిష్ ఆలీపై ప్రధాని విరుచుకుపడ్డారు. 'భారత్ మాతా కీ జై' అని అనడానికి ఆయనకు అభ్యంతరాలు ఉన్నాయని.. ఇలాంటి వ్యక్తిని పార్లమెంటులో అడుగుపెట్టనిద్దామా అని ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, ఎలక్టోరల్ బాండ్ల విధానం ప్రపంచంలోనే అతిపెద్ద దోపిడీ పథకమన్న రాహుల్ గాంధీ ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. ప్రతిపక్ష పార్టీలు కూడా బాండ్ల ద్వారా విరాళాలు సేకరించాయని, అది కూడా దోపిడీయేనా అని ప్రశ్నించారు.

ద్వేషాన్ని ఓడించండి.. ప్రేమ దుకాణాలు తెరవండి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: "ద్వేషాన్ని ఓడించడం ద్వారా వీధి వీధినా ప్రేమ దుకాణాలు తెరవండి" అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఓటర్లకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల తొలిదశ పోలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైన తర్వాత రాహుల్ గాంధీ ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. "ఈరోజు తొలి దశ పోలింగ్! గుర్తుంచుకోండి. మీరు వేసే ప్రతి ఓటు.. కొన్ని తరాల దేశ ప్రజాస్వామ్య భవితవ్యాన్ని నిర్ణయిస్తుంది" అని పేర్కొన్నారు. "బయటకు రండి! గడిచిన పదేళ్లుగా ఈ దేశ ఆత్మకు జరిగిన గాయాలపై మీ ఓటు అనే మందు(బామ్) పూయండి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి" అని రాహుల్ పిలుపునిచ్చారు.

కేజ్రీవాల్ మూడు సార్లే మామిడి పళ్లు తిన్నారు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలు చూపించి మెడికల్ బెయిల్ పొందడం కోసం తిహాడ్ జైలులో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ మామిడిపండ్లను తింటున్నారన్న ఈడీ ఆరోపణలపై శుక్రవారం ఆయన తరఫు న్యాయవాదులు కోర్టులో వివరణ ఇచ్చారు. ఆయన కేవలం మూడు సార్లు మాత్రమే మామిడి పండ్లను తిన్నారని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి తెలిపారు. దీని వల్లనే చక్కెర స్థాయి ఏమీ పెరగలేదని చెప్పారు. టైప్- 2 మధుమేహంతో బాధపడుతున్నందున ఇన్సులిన్ తీసుకునేందుకు అవకాశం ఇవ్వాలని, తన వ్యక్తిగత వైద్యుడిని రోజూ 15 నిమిషాల పాటు వీడియా కాన్ఫరెన్స్ ద్వారా కలిసేందుకు అనుమతివ్వాలని కేజ్రీవాల్ రోస్ అవెన్యూ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం ప్రత్యేక జడ్జి కావేరి బవేజా విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఈడీ వాదనను 'చిల్లర' వాదనగా అభిషేక్ సింఘ్వి కొట్టిపడేశారు. మెడికల్ బెయిల్ పొందడానికి ఎవరైనా కావాలని సుగర్ స్థాయిని పెంచుకొంటారా.. పక్షవాతం తెచ్చుకుంటారా.. అని ప్రశ్నించారు. వాదనలు విన్న న్యాయాధికారి నిర్ణయాన్ని సోమవారానికి వాయిదా వేశారు.

రేప్ చేసి.. బెల్టుతో కొట్టి.. గాయాలపై కారం

» మధ్యప్రదేశ్‌లో నెల రోజుల పాటు యువతికి నరకం

భోపాల్, ఏప్రిల్ 19: ఆ దుర్మార్గుడి చేతిలో ఆ యువతి చూసింది మాటల్లో చెప్పలేనంత నరకం!! ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడటమే కాదు.. బెల్టు, నీళ్ల పైపుతో ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. తీవ్ర గాయాలతో ఆమె ఒళ్లంతా పచ్చి పుండులా తయారైతే.. ఆ గాయాల మీద కారం పొడి చల్లి పైశాచిక ఆనందం పొందాడు. ఆమె పట్ల ఈ దారుణ చేష్టలను ఒకట్రెండురోజులు కాదు.. ఏకంగా నెలరోజులు సాగించాడు. మధ్యప్రదేశ్ గుణలోని శివపురిలో ఈ ఘోరం వెలుగుచూసింది. బాధిత యువతి వయసు 23 ఏళ్లు! ఆమె తన తల్లితో కలిసి నివసిస్తోంది. నిందితుడు ఆమె ఇంటి పొరుగున ఉండే వ్యక్తే. ఒకానొక రోజు ఆమెను బలవంతంగా తన ఇంట్లోకి ఎత్తుకెళ్లి ఓ గదిలో నిర్బంధించాడు. అతడి దారుణ చేష్టలకు ఆమె కేకలు వేయకుండా ఉండేందుకు, రోదన తాలూకు శబ్దాలు బయటకు వినిపించకుండా ఉండేందుకు పెదవులకు గ్లూ పూసి నోరు తెరవకుండా చేశాడు. తనను పెళ్లి చేసుకోవాలని, ఆమె కుటుంబానికి ఉన్న ఆస్తినంతా తన పేరిట రాయాలని ఒత్తిడి చేస్తూ ఆ ఉన్మాది ఇంతటి దారుణానికి ఒడిగట్టాడు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

సివిల్స్ టాపర్ ఆదిత్యకు 1,099 మార్కులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: అఖిల భారత సర్వీసుల్లో నియామకాలకు నిర్వహించిన సివిల్స్-2023లో ఎంపికైన అభ్యర్థులు సాధించిన మార్కులను యూపీఎస్సీ శుక్రవారం విడుదల చేసింది. మొత్తం 2,025 మార్కులకుగాను టాపర్ ఆదిత్య శ్రీవాత్సవ 1099 మార్కులు సాధించారు. రెండో ర్యాంకర్ అనిమేశ్ ప్రధాన్‌కు 1,067 మార్కులు, మూడో ర్యాంకు సాధించిన తెలంగాణ యువతి దోనూరు అనన్య రెడ్డికి 1,065 మార్కులు వచ్చాయి. టాప్ టెన్‌లో వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచిన పీకే సిద్ధార్థ్ రామ్‌కుమార్ 1059, రుహానీ 1049, సృష్టి దబాస్ 1048, అన్మోల్ 1045, ఆసీస్‌కుమార్ 1045, నౌషీన్ 1045, ప్రజాపతి 1044 మార్కులు సాధించారు.

సూపర్‌మార్కెట్‌లో చోరీకి యత్నం

» అమెరికాలో ఇద్దరు తెలుగు అమ్మాయిల అరెస్ట్!

హైదరాబాద్, ఏప్రిల్ 19: అమెరికాలోని ఓ సూపర్ మార్కెట్‌లో చోరీ యత్నం చేసిన ఇద్దరు తెలుగు అమ్మాయిలు పోలీసులకు దొరికిపోయారు. హైదరాబాద్, గుంటూరుకు చెందిన విద్యార్థినులు భవ్య, యామిని.. న్యూజెర్సీలోని స్టీవెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. వీరిద్దరూ మార్చి 19న ఓ సూపర్ మార్కెట్‌కు వెళ్లారు. రెండు వస్తువులకు మాత్రం బిల్లు చెల్లించి.. 27 వస్తువులను బ్యాగులో వేసేసుకొని వెళ్లిపోవడానికి ప్రయత్నించారు. గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు దుకాణానికి రావడంతో ఇద్దరు విద్యార్థినులు.. తాము రెట్టింపు చెల్లిస్తామని ప్రాధేయపడ్డారు. మరోసారి ఇలాంటి తప్పు చేయబోమని చెప్పారు. కానీ, పోలీసులు వారిని అరెస్టు చేశారు.

స్కాట్లాండ్‌లో ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి

లండన్, ఏప్రిల్ 19: ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన ఇద్దరు ఏపీ విద్యార్థులు.. ట్రెక్కింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందారు. ఈ దుర్ఘటన స్కాట్లాండ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. మృతిచెందిన వారిని జితేంద్రనాథ్ కరుటూరి (26), చాణక్య బొలిశెట్టి (22)గా గుర్తించారు. ఈ ఇద్దరూ స్కాట్లాండ్‌లోని డుండీ యూనివర్సిటీలో మాస్టర్స్ చదువుతున్నారు. బుధవారం సాయంత్రం ఈ ఇద్దరూ స్నేహితులతో కలిసి ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పెర్త్‌షైర్‌లోని లిన్ ఆఫ్ టమ్మెల్‌కు వెళ్లారు. రెండు నదులు కలిసే ఈ ప్రాంతంలో వారు ట్రెక్కింగ్ చేస్తుండగా వారు జారి నీటిలో పడ్డారు.

వెద్దా తెగకు భారతీయులతో జన్యుసంబంధాలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వెద్దాస్.. శ్రీలంకలో ఇప్పటికీ ఆటవిక జీవనం సాగించే ఒక తెగ ఇది. ఈ తెగ మూలాలపై చాలా పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే.. వీరికి, భారతీయులకు జన్యుపరమైన సంబంధాలున్నాయని హైదరాబాద్‌కు చెందిన సీసీఎంబీ పరిశోధకులు చేసిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. అధ్యయనంలో భాగంగా వారు వెద్దాస్ తెగకు చెందినవారి ఆటోసోమల్, మైటోకాండ్రియల్ జన్యువులను సమగ్రంగా విశ్లేషించి ఈ వివరాలను తెలిపారు.

తొలి దశలో 62.37%

త్రిపురలో అత్యధికంగా 80.1%.. బిహార్‌లో కేవలం 48.5% పోలింగ్

» 21రాష్ట్రాల్లో 102 స్థానాలకు ఎన్నికలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రచండ భానుడు నడినెత్తిన నిప్పులు చెరుగుతున్నా.. వడగాడ్పులు వీస్తున్నా.. శుక్రవారం దేశవ్యాప్తంగా 16.63 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. కొన్నిచోట్ల వర్షం కురుస్తున్నా కూడా.. ఓటర్లు ఓపిగ్గా లైన్‌లో నిలబడి ప్రజాస్వామ్యంలో తమ పవిత్ర కర్తవ్యాన్ని నిర్వర్తించారు. శుక్రవారం రాత్రి 9 గంటల సమయం వరకూ అందిన వివరాల ప్రకారం.. సార్వత్రిక ఎన్నికల సమరం తొలి దశలో భాగంగా 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 62.37% ఓటింగ్ నమోదైంది. కొన్నిచోట్ల నుంచి ఇంకా పూర్తిగా వివరాలు అందనందున.. పోలింగ్ శాతాలు ఇంకా పెరిగే అవకాశం ఉందని ఈసీ ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా.. ఎన్నికల తొలిదశలో భాగంగా ఏడు రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లోని మొత్తం అన్ని స్థానాలకూ (తమిళనాడు-39, ఉత్తరాఖండ్-5, అరుణాచల్ ప్రదేశ్-2, మేఘాలయ-2, అండమాన్ నికోబార్ దీవులు-1, మిజోరాం-1, నాగాలాండ్-1, పుదుచ్చేరి-1, సిక్కిం-1, లక్షద్వీప్-1) పోలింగ్ ముగిసింది. అలాగే.. రాజస్థాన్ లో 12 స్థానాలు, ఉత్తర ప్రదేశ్‌లో 8 స్థానాలు, మధ్యప్రదేశ్‌లో 6 స్థానాలు, అసోం, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్‌లో ఐదేసి స్థానాలు, బిహార్‌లో 4 స్థానాలు, పశ్చిమబెంగాల్‌లో 3 స్థానాలు, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయలలో చెరి రెండు స్థానాలు, అండమాన్, ఛత్తీస్ గఢ్, జమ్ముకశ్మీర్, లక్షద్వీప్, మిజోరం, నాగాలాండ్, పుదుచ్చేరి, సిక్కిం, త్రిపురలో చెరి ఒక స్థానాలకు పోలింగ్ ముగిసింది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కింలో లోక్‌సభ స్థానాలతోపాటు అసెంబ్లీ స్థానాలకూ ఎన్నికలు జరిగాయి. అక్కడక్కడా చెదురుమదురు హింసాత్మక ఘటనలు మినహా.. శుక్రవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈసీ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురలో అత్యధికంగా 80.17 శాతం ఓటింగ్ నమోదు కాగా.. 77.57% ఓటింగ్‌తో పశ్చిమబెంగాల్ రెండో స్థానంలో నిలిచింది.



అసోంలోని శివసాగర్‌లో మహిళా ఓటర్ల క్యూ



శుక్రవారం ఓటు వేసిన తర్వాత షోంపెన్ ఆదివాసీ

మణిపూర్‌లో 69.13% ఓటింగ్

ముహూర్తాల సీజన్ కావడంతో.. చాలా మంది నవ దంపతులు పెళ్లిదుస్తుల్లోనే పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. చాలామంది దివ్యాంగులు, వృద్ధులు, వీల్‌చెయిర్లలో, స్ట్రెచర్లపై వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. తమిళనాడు, అరుణాచల్‌ప్రదేశ్, అండమాన్ నికోబార్, అసోంలో కొన్ని బూత్‌లలో ఈవీఎంలలో చిన్నపాటి సమస్యలు వచ్చాయి. పశ్చిమబెంగాల్‌లో 3 లోక్‌సభ నియోజకవర్గాలకు శుక్రవారం పోలింగ్ జరగ్గా.. వాటిలో కూచ్‌బేహార్ నియోజకవర్గంలో హింస చెలరేగింది. మణిపూర్‌లో 69.13% ఓటింగ్ నమోదైంది. నాగాలు, కుకీలు అత్యధిక సంఖ్యలో ఉండే చండేల్‌లో అత్యధికంగా 85.54శాతం మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన బస్తర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 63.41 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తమిళనాడులో 72.09 శాతం ఓటింగ్ నమోదైంది. సేలం, తిరువళ్లూరు జిల్లాల్లో ముగ్గురు వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి.. ఓటేయకుండానే తుదిశ్వాస విడిచారు. అండమాన్ దీవుల్లో 56.87% ఓటింగ్ నమోదైంది. అక్కడ.. షోంపెన్ తెగకు చెందిన ఏడుగురు ఆదివాసులు తొలిసారి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బిహార్‌లో అత్యల్పంగా 48.5% ఓటింగ్ నమోదైంది.

నాగాలాండ్‌లో ఆరుజిల్లాల్లో సున్నా శాతం ఓటింగ్

'ఫ్రాంటియర్ నాగాలాండ్ టెరిటరీ' డిమాండ్‌తో.. ఈస్టర్న్ నాగాలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఈఎన్‌పీవో) ఇచ్చిన నిరవధిక బంద్ పిలుపు కారణంగా నాగాలాండ్‌లోని ఆరుజిల్లాల్లో సున్నా శాతం ఓటింగ్ నమోదైంది. పోలింగ్ సిబ్బంది దాదాపు 9 గంటలపాటు 738 బూత్‌ల్లో ఓపిగ్గా వేచి చూసినా.. 4 లక్షల మంది ఓటర్లలో ఒక్కరు కూడా వచ్చి ఓటేయలేదు. 20 శాసనసభ స్థానాల పరిధిలోని 20 మంది ఎమ్మెల్యేలు సైతం ఓటింగ్‌లో పాల్గొనలేదంటే అక్కడ పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తమిళనాడులో బీజేపీ బోణీ?

తమిళనాడులో ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనైనా బోణీ కొట్టాలనే లక్ష్యంతో విస్తృతంగా ప్రచారం చేసిన బీజేపీ.. తన ఓటుశాతాన్ని గణనీయంగా పెంచుకున్నట్టు తెలుస్తోంది. ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్ అన్నామలై పోటీచేసిన కోయంబత్తూర్‌లో ఈసారి 71.17% పోలింగ్ నమోదైంది. ఇది 20 ఏళ్ల అత్యధికం. గత ఎన్నికల్లో 37 స్థానాలు గెలుచుకున్న డీఎంకే కూటమి ఈసారి 30 స్థానాలు దాటకపోవచ్చునని అంచనా. ఈసారి బీజేపీ ఓట్లు 15-20% పెరగవచ్చని ప్రముఖ తమిళ రచయిత మాలన్ అభిప్రాయపడ్డారు.

భారత్‌కు ఐరన్ డోమ్?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: భారత్‌లో కూడా ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ తరహాలో గగనతల రక్షణ వ్యవస్థ(ఎయిర్ డిఫెన్స్)ను ఏర్పాటు చేయనున్నారు. తక్కువ ఎత్తు నుంచి జరిగే గగనతల దాడులను ఈ వ్యవస్థ ఎదుర్కొంటుంది. భారత్-అమెరికా కలిసి ఈ వ్యవస్థను రూపొందించనున్నాయి. ఈ విషయాన్ని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ఇటీవల ప్రకటించారు. ఇందులో భాగంగా స్ట్రైకర్ ఏ1 వాహనాల ఛాసిస్‌లను భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా ఇక్కడే రూపొందిస్తారు. వీటికి గగనతల దాడులను ఎదుర్కొనే లేజర్ ఆధారిత ఆయుధ వ్యవస్థ ఎం-షోరాడ్‌ను అమరుస్తారు. వీటిని అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటారు. ఇందులో సంప్రదాయ క్షిపణులను ఎదుర్కొనే వ్యవస్థతో పాటు 50 కిలోవాట్ల శక్తి కలిగిన లేజర్ ఆయుధ వ్యవస్థ కూడా ఉంటుంది. సరిహద్దుల్లో తక్కువ ఎత్తు నుంచి వచ్చే డ్రోన్లు, హెలికాపర్లను, గ్లైడర్లను ఎదుర్కోవడానికి ఈ వాహనాలు ఉపయోగపడతాయి. సరిహద్దుల వెంట సంచరిస్తూ ఈ వాహనాలు పాకిస్థాన్, చైనాల నుంచి వచ్చే తక్కువ ఎత్తు గగనతల దాడులను ఎదుర్కొంటాయి. మొత్తం 300 వాహనాలను భారత్-అమెరికాలు నిర్మిస్తాయి. స్ట్రైకర్ ఏ1 వాహనాలను అమెరికా ఎప్పుడో అభివృద్ధి చేసి, వినియోగంలోకి తెచ్చింది. అందులోకి అవసరమైన ఎం-షోరాడ్‌ను అమెరికా సమకూరుస్తుంది.

ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణులను అందించిన భారత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: భారత్, ఫిలిప్పీన్స్ దేశానికి బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను సరఫరా చేసింది. 2022లో ఇరుదేశాల మధ్య కుదిరిన 375 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.31 వేల కోట్లు) ఒప్పందం మేరకు భారత వాయుసేనకు చెందిన సీ-17 గ్లోబ్‌మాస్టర్ రవాణా విమానంలో క్షిపణులు, లాంచర్లతో కూడిన ఆయుధ వ్యవస్థను ఫిలిప్పీన్స్‌కు శుక్రవారం పంపించింది. డీల్ కుదిరిన రెండు సంవత్సరాల తర్వాత మొదటి దశ క్షిపణులను భారత్ సరఫరా చేసింది. ఈ సందర్భంగా భారత వాయుసేన అధికారులు, ఫిలిప్పీన్స్ అధికారులకు స్వీట్లు పంచారు. భారత్ ఓ విదేశానికి బ్రహ్మోస్ క్షిపణిని సరఫరా చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. చైనాతో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఫిలిప్పీన్స్‌కు ఈ బ్రహ్మోస్ క్షిపణులు ఎంతో ముఖ్యమైన రక్షణ ఆయుధాలుగా మారనున్నాయి. వీటి ద్వారా ఆ దేశ పశ్చిమ తీరంలో రక్షణ రంగ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. కాగా భారత్, రష్యాతో కలిసి అభివృద్ధి చేసిన ఈ బ్రహ్మోస్ క్షిపణి ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన(2.8 మ్యాక్ లేదా ధ్వనివేగం కంటే మూడు రెట్ల వేగం) సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిగా గుర్తింపు పొందింది. భూమి, వాయు, జలమార్గాల ద్వారా ఈ బ్రహ్మోస్ క్షిపణిని ప్రయోగించవచ్చు.

వాట్సాప్‌లోకి ఏఐ వచ్చింది!

న్యూయార్క్, ఏప్రిల్ 19: అడిగిందే తడవుగా అన్నీ చెబుతాననే కృత్రిమ మేధ.. వాట్సాప్‌లోకీ వచ్చేసింది! ఒక్క వాట్సాప్‌లోనే కాదు.. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, మెసెంజర్‌లోనూ 'మెటా ఏఐ' అందుబాటులోకి వచ్చింది. ఈ కృత్రిమ మేధ చాట్‌జీపీటీ తరహాలోనే మనం అడిగే ప్రశ్నలకు సమాధానమిస్తుంది. మనం ఇచ్చే ప్రాంప్ట్‌ల ఆధారంగా చిత్రాలను కూడా ఉచితంగానే రూపొందిస్తుంది. కాకపోతే, ప్రస్తుతానికి దీన్నివాట్సాప్ బీటా వెర్షన్ వాడేవారికి మాత్రమే అందుబాటులోకి తెచ్చారు. త్వరలోనే అందరికీ వస్తుందని మెటా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. గూగుల్, మైక్రోసాఫ్ట్ తదితర దిగ్గజాల బాటలోనే కృత్రిమ మేధపై చాలాకాలంగా దృష్టి పెట్టిన మెటా సంస్థ లామా-3 అనే తదుపరితరం ఏఐ మోడల్‌ను రూపొందించింది. దాన్నే వాట్సాప్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్ వంటివాటిలో వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది.

ఎన్ఎస్‌జీ చీఫ్‌గా నళిన్ ప్రభాత్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: దేశంలో ఉగ్రవాదాన్ని నిరోధించే జాతీయ భద్రతా దళం (ఎన్ఎస్‌జీ) అధిపతిగా సీనియర్ ఐపీఎస్ అధికారి నళిన్ ప్రభాత్ నియమితులయ్యారు. ఈమేరకు కేంద్ర సిబ్బంది, వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నళిన్ ప్రభాత్ ఏపీ క్యాడర్‌కు చెందిన 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి.. ఆయన ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్ అదనపు డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డిప్యుటేషన్‌పై ఆయన కేంద్ర సర్వీసుల్లోకి వెళ్లే ముందు ఉమ్మడి ఏపీలోనూ వివిధ హోదాల్లో పనిచేశారు. ఎన్ఎస్‌జీ డైరెక్టర్ జనరల్ పదవిలో 2028 ఆగస్టు 31వ తేదీ వరకు నళిన్ ప్రభాత్ కొనసాగుతారని కేంద్రం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇటు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ప్రత్యేక డైరెక్టర్‌గా సప్నా తివారీని నియమించారు. ఆమె ఒడిశా క్యాడర్‌కు చెందిన 1992 ఐపీఎస్ బ్యాచ్ అధికారి.

మైనారిటీ ఓట్లపై కమలం కన్ను

ముస్లిం, క్రిస్టియన్ల కొత్త ఓటు బ్యాంకుపై బీజేపీ నేతల దృష్టి

» మోదీ భాయిజాన్, స్నేహ యాత్ర వంటి ప్రత్యేక కార్యక్రమాలతో చేరువ



ఫైల్

సార్వత్రిక సమరంలో మూడోసారి విజయం దక్కించుకోవాలని లక్షించుకున్న ప్రధాని మోదీ నేతృత్వంలో బీజేపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. మైనారిటీలను అక్కున చేర్చుకునే ప్రయత్నం చేస్తోంది. బీజేపీ అంటేనే హిందూత్వ అజెండా ఉన్నప్పటికీ ముస్లిం, క్రిస్టియన్ల ఓట్లను కూడా ఈ ఎన్నికల్లో రాబట్టుకునేందుకు ప్రణాళికలు వేసి అమలు చేస్తోంది. మైనారిటీ వర్గాల్లో పెరుగుతున్న అభిప్రాయాల వైవిధ్యాన్ని ఉపయోగించుకోవాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది. దీంతో పాటు ఇతర పార్టీలు మైనారిటీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని, వారి సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని కమలనాథులు ప్రచారం చేస్తున్నారు. మోదీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు ముస్లింలు, క్రిస్టియన్లకు కూడా చేరుతున్నాయని వివరిస్తున్నారు. బీజేపీ హిందూత్వ అజెండాను అనుసరిస్తున్నా.. పార్టీలో ముస్లిం నాయకులకు ప్రాధాన్యం ఇస్తోంది. అదేవిధంగా బీజేపీ సైద్ధాంతిక మాతృసంస్థ ఆరెస్సెస్ లోనూ ముస్లిం విభాగం 'రాష్ట్రీయ ముస్లిం మంచ్' కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అయితే, ముస్లింల ఓటు బ్యాంకును తమకు అనుకూలంగా మార్చుకోవడం మాత్రం మోదీ ప్రధాని అయ్యాకే ప్రారంభంకావడం గమనార్హం. ముఖ్యంగా అరబ్ దేశాల ముఖ్య నేతలతో మోదీ స్నేహ సంబంధాలు పెంచుకోవడం దీనిలో ఒక భాగమని పరిశీలకులు పేర్కొంటున్నారు. మరోవైపు సాధారణ పరిస్థితులకు భిన్నంగా ముస్లింలు బీజేపీకి ఓట్లు వేస్తుండడం గమనార్హం. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ముస్లింల ఓట్లు గణనీయంగా పడ్డాయని లోక్‌నీతి-సీఎస్‌డీఎస్ సర్వే పేర్కొంది. 2009తో పోలిస్తే 2014లో బీజేపీకి ముస్లింల ఓట్లు రెట్టింపు అయినట్లు వివరించింది. 2021లో జరిగిన ప్యూ రిసెర్చ్ సెంటర్ సర్వేలో 19 శాతం మంది ముస్లిం ఓటర్లు 2019లో బీజేపీకి ఓటేసినట్టు చెప్పారు.

పస్మాందాలు కీలకం

ముస్లింలో ఓటుబ్యాంకును సొంతం చేసుకునే లక్ష్యంతో కదులుతున్న బీజేపీ.. వీరిలో పేదలుగా ఉన్న పస్మాందా వర్గాలను మచ్చిక చేసుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ వర్గానికి చెందిన ఎం. అబ్దుల్ సలామ్‌ను కేరళలోని మళప్పురం నియోజకవర్గంలో నిలబెట్టింది. అదేవిధంగా బీజేపీ ఎమ్మెల్సీగా ఉన్న తారిక్ మన్సూర్‌ను ఎలక్షన్ మేనిఫెస్టో కమిటీలో నియమించింది. ఇక, దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింలతో బీజేపీ నేతలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 22 వేల సమావేశాలు నిర్వహించి.. వారిలో ఉన్న అసంతృప్తిని తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో 20% మంది ముస్లింలు బీజేపీకి అనుకూలంగా మారడం ఖాయమని రాష్ట్ర బీజేపీ చీఫ్ చంద్రశేఖర్ అన్నారు.

క్రిస్టియన్ల కోసం

క్రిస్టియన్ ఓటు బ్యాంకు కోసం కూడా బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో క్రిస్టియన్లు ఎక్కువగా ఉన్న కేరళపై బాగానే ఆశలు పెట్టుకుంది. పాపులర్ ఫ్రెంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)ని నిషేధించడం ద్వారా క్రిస్టియన్లు ఉపశమనం పొందారని, వారంతా బీజేపీకి అనుకూలంగా ఓటేయడం ఖాయమని రాష్ట్ర నేతలు భావిస్తున్నారు. గత ఏడాది రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని.. స్నేహ యాత్రను ప్రారంభించి.. క్రిస్టియన్లను బీజేపీతో మమేకమయ్యేలా ప్రయత్నించారు. దీంతోపాటు, కేరళలోని క్రిస్టియన్లను ఆకర్షించడం ద్వారా వీరి ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ఈశాన్య రాష్ట్రాల్లోనూ పుంజుకునేందుకు అవకాశం ఉంటుందని కమలనాథులు లెక్కలు వేసుకున్నారు.



ఫైల్

మోదీ భాయిజాన్

మునింలను ఆకట్టుకునే క్రమంలో బీజేపీ గత ఏడాది 'మోదీ భాయిజాన్' ప్రచారానికి శ్రీకారం చుట్టింది. అదేవిధంగా 23 లోక్‌సభ స్థానాల పరిధిలో ఉన్న 4,100 ముస్లిం ఆధిపత్య గ్రామాల్లో 'ఖామీ చౌపాల్' కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. అలాగే, గత ఏడాది ఉత్తరప్రదేశ్‌లోని పస్మాందా ముస్లింలను ఆకట్టుకునేందుకు 27 జిల్లాలో 'స్నేహ యాత్ర'లను నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లో ముస్లింల ఓటు బ్యాంకు 19 శాతానికి పైగా ఉంది.

- సెంట్రల్ డెస్క్

ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతిదాడి!

అణు కేంద్రాలకు, వైమానిక స్థావరానికి నిలయమైన ఇస్ఫాహన్ పట్టణంపై డ్రోన్లతో దాడి

» సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ జన్మదినం రోజునే..

దుబాయి, ఏప్రిల్ 19: పశ్చిమాసియా సంక్షోభం మరో మలుపు తిరిగింది. ఇటీవల ఇరాన్ జరిపిన డ్రోన్, క్షిపణి దాడులకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ ఆ దేశంపై శుక్రవారం ఉదయం ప్రతిదాడులు జరిపింది. ఇరాన్ అత్యున్నత నేత అయతుల్లా అలీ ఖమేని (85) జన్మదినమైన ఏప్రిల్ 19వ తేదీని ఇందుకు ఎంచుకోవటం గమనార్హం. ఇరాన్‌లో పలు అణుకేంద్రాలున్న ఇస్ఫాహన్ పట్టణంపై ఇజ్రాయెల్ డ్రోన్లతో ఈ దాడులు జరిపింది. వీటిని ఇరాన్ విజయవంతంగా తిప్పికొట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఇరాన్‌కు పెద్దగా నష్టం వాటిల్లలేదని సమాచారం. దాడిని ఇరాన్‌గానీ, ఇజ్రాయెల్‌గానీ ధ్రువీకరించలేదు. ఇరాన్ ఆర్మీ కమాండర్ జనరల్ అబ్దుల్ రహీమ్ మౌసవి మాత్రం.. శుక్రవారం ఉదయం ఇస్ఫాహన్ గగనతలంలో కొన్ని అనుమానిత వస్తువులు కనిపించగా వాటిని తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం చేసిందన్నారు. ఆ వస్తువుల కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లలేదన్నారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి సమయంలో సిరియా ప్రభుత్వ టీవీ చానల్‌లో సైన్యం జారీ చేసిన ఓ ప్రకటనను చదివి వినిపించారు. సిరియాకు దక్షిణాన ఓ ప్రాంతంలోని గగనతల రక్షణ వ్యవస్థపై ఇజ్రాయెల్ క్షిపణి దాడులకు పాల్పడిందని, ఈ ఘటనలో కొంత సామగ్రి ధ్వంసమైందని ఈ ప్రకటన పేర్కొంది. దాడికి గురైన ప్రాంతం ఇరాన్ అని వెల్లడించలేదు. ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సైన్యానికి చెందిన ఓ రాడార్ దెబ్బతిన్నదని బ్రిటన్‌లోని సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్‌రైట్స్ సంస్థ తెలిపింది. దాడి జరిపినట్లుగా పేరు చెప్పేందుకు ఇష్టపడని ఇజ్రాయెల్ అధికారులు తెలిపారని న్యూయార్క్‌టైమ్స్ పేర్కొంది.



ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరాన్‌లో నిరసన ప్రదర్శన

వైమానిక, అణుకేంద్రాల స్థావరం

ఇస్ఫాహన్ పట్టణానికి సమీపంలో ఓ వైమానిక స్థావరంతోపాటు పలు అణుకేంద్రాలున్నాయి. అమెరికా నుంచి ఇరాన్ ఎఫ్-14 టామ్‌క్యాట్ యుద్ధవిమానాలను కొనుగోలు చేసింది. వీటి స్థావరం ఇస్ఫాహన్‌లోనే ఉంది. చైనా సరఫరా చేసిన మూడు స్వల్పస్థాయి అణు రియాక్టర్లు ఈ పట్టణంలోనే ఉన్నాయి. ఇస్ఫాహన్ భూగర్భంలో నటాంజ్ అణుశుద్ధి కేంద్రం ఉంది. ఇజ్రాయెల్ గతంలో పలుమార్లు ఈ కేంద్రంపై రహస్య దాడులు జరిపింది. తాజా ఘటన నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వ టీవీ చానల్ ఓ ప్రకటన విడుదల చేస్తూ.. అణుకేంద్రాలన్నీ సురక్షితంగా ఉన్నాయని పేర్కొంది. దీన్ని ఐక్యరాజ్య సమితికి చెందిన అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) కూడా ధ్రువీకరించింది. 2018లో ట్రంప్ హయాంలో అమెరికా.. 'ఇరాన్ అణు ఒప్పందం' నుంచి వైదొలిగాక ఇరాన్ తమ అణుశుద్ధీకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేసిందని, ప్రస్తుతం ఆ దేశం వద్ద అణ్వాయుధాలు తయారుచేసేంత శుద్ధిచేసిన యురేనియం ఉం దని సమాచారం. ఇక ఇజ్రాయెల్ దాడిని ఇరాన్ అధికారికంగా గుర్తించకపోవడం, ఇజ్రాయెల్ దీనిపై బహిరంగ ప్రకటన చేయకపోవటంతో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశంలేదని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక ఇజ్రాయెల్‌పై ఇటీవల క్షిపణులతో విరుచుకుపడ్డ ఇరాన్‌పై మరిన్ని ఆం క్షలు విధిస్తామని జీ7దేశాలు హెచ్చరించాయి. ఇజ్రాయెల్, ఇరాన్ సంయమనం పాటించాలని జీ7పిలుపునిచ్చింది. కాగా ఈనెల 30వరకు ఇజ్రాయెల్ నగరం టెల్‌అవీవ్‌కు విమానాల రాకపోకలను ఎయిరిండియా నిలిపివేసింది.



అబ్ కీ బార్?

నేడు మెదక్ పర్యటనకు సీఎం రేవంత్

నీలం మధు నామి నేషన్ కార్యక్రమానికి హాజరు

మెదక్, ఏప్రిల్ 19: సీఎం రేవంత్‌రెడ్డి శనివారం మెదక్ పర్యటనకు వెళ్లనున్నారు. కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి నీలం మధు నామినేషన్ కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. సీఎం రాకను పార్టీ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇందుకోసం మెదక్ పట్టణంలోని సీఎస్ఐ గ్రౌండ్‌లో హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు శుక్రవారం దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మెదక్‌లో సీఎం రోడ్ షో నిర్వహించనున్నట్లు, కార్నర్ మీటింగ్‌లో ప్రసంగించనున్నట్లు మంత్రి తెలిపారు.



మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న వంశీచంద్‌రెడ్డి, చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

రెండో రోజూ అదే జోరు..

లోక్‌సభ ఎన్నికలకు చురుగ్గా నామినేషన్ల ప్రక్రియ

మొత్తం 57 మంది అభ్యర్థులు.. 69 నామినేషన్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్) : లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. తొలి రోజు, గురువారం 42 మంది అభ్యర్థులు 48 నామినేషన్లు దాఖలు చేయగా.. రెండో రోజు శుక్రవారం 57 మంది అభ్యర్థులు 69 నామినేషన్లు సమర్పించారు. శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన వారిలో బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, బీఆర్ఎస్ నేతల పద్మారావుగౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితర ప్రముఖులు ఉన్నారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి నామినేషన్ దాఖలులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.ఇదే స్థానానికి బీఆర్ఎస్ తరఫున మన్నె శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్ వేశారు. హైదరాబాద్ పార్లమెంట్‌స్థానానికి ఎంఐఎం అభ్యర్థిగా ఆ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్, స్వతంత్ర అభ్యర్థిగా మహ్మద్ అక్రమ్ అలీ ఖాన్ నామినేషన్లు దాఖలుచేశారు. సికింద్రాబాద్ స్థానానికి బీజేపీ అభ్యర్థి జీ కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ సహా ఆరుగురు వేర్వేరుగా తమ నామినేషన్లు సమర్పించారు.కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ తరఫున ఆ పార్టీ నాయకులు నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు. అయితే, సంజయ్ అఫిడవిట్ దాఖలు కాలేదు. నాగర్ కర్నూల్‌లో బీఆర్ఎస్ తరఫున ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, నిజామాబాద్‌లో బీజేపీ తరఫున ధర్మపురి అర్వింద్, బీఆర్ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, పెద్దపల్లిలో కాంగ్రెస్ తరఫున గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా కొంకటి లింగ మూర్తి నామినేషన్లు వేశారు. భువనగిరిలో బూర నర్సయ్యగౌడ్ (బీజేపీ), ఖమ్మంలో తాండ్రవినోద్‌రావు (బీజేపీ) తమ మద్దతుదారులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ తరఫున ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు నామినేషన్ సమర్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ నియోజకవర్గాలకు సంబంధించి ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. మహబూబాబాద్‌కు కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు, ఆధార్ పార్టీ అభ్యర్థి జాటోతు రఘునాయక్ నామినేషన్లు సమర్పించారు. భువనగిరి పార్లమెంట్ స్థానానికి బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, సీపీఎం అభ్యర్థి ఎండి.జహంగీర్, సోషలిస్టు పార్టీ అభ్యర్థి రచ్చ సుభద్రారెడ్డి, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. మల్కాజ్‌గిరికి ఐదు నామినేషన్లు దాఖలవ్వగా, చేవెళ్ల స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ సమర్పించారు. కాగా, శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన 32 మంది, 25 మంది స్వతంత్ర అభ్యర్థులు వేర్వేరుగా తమ నామినేషన్లు దాఖలు చేశారు. గురు, శుక్రవారాల్లో కలిపి 98 మంది అభ్యర్థులు మొత్తం 117నామినేషన్లు దాఖలు చేశారు.





మహబూబాబాద్‌లో కాంగ్రెస్ జనజాతర సభకు హాజరైన జనం; మాట్లాడుతున్న సీఎం రేవంత్

టచ్ చేసి చూడు!

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ, "నిన్నటికి నిన్న పొంకనాలాయన, పిట్టలదొర అంటుండు.. తనతో 20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నరని, చిటికె వేస్తే వస్తారని. చిటికేసుడు కాదు.. మిద్దె ఎక్కి డప్పు కొట్టు. నీ దగ్గర ఉన్నోళ్లయినా.. అక్కడ ఉంటరేమో చూద్దాం. గతంలో లాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల గొర్ల మందను తోడేళ్లలా వచ్చి తాపకొకటి కొట్టుకుపోదామనుకుంటున్నవేమో. బిడ్డా.. ఈడ కాపలా ఉన్నది రేవంత్‌రెడ్డి. నువ్వు ప్రయత్నం చేసి చూడు. మా ఎమ్మెల్యేలను కంచె వేసి కాపాడుకునే శక్తి, హైటెన్షన్ వైర్ రేవంత్‌రెడ్డి ఉన్నడు. వచ్చి ముట్టుకో బిడ్డా.. కరెంటు తీగ మీద వాలిన కాకి ఎలా కర్రెగా అయి చస్తదో.. కాంగ్రెస్ వైపు చూస్తే నీ సంగతి కూడా గట్లనే అయితది. నువ్వు మా దిక్కు చూసుడు కాదు.. సాయంత్రం నీ దొడ్లకు ఎన్ని వస్తాయో లెక్కబెట్టుకో" అని కేసీఆర్‌ను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

ఎర్రకోటపై రాహుల్ జెండా ఎగరేస్తారు..

రాహుల్‌గాంధీ ప్రధానిగా ఎర్రకోటపై జెండా ఎగురవేయడం ఖాయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్లపాటు పరిపాలించిన బీజేపీ ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేసిందని, ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం అవసరమని ఉద్ఘాటించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్ జనజాతర సభలో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలోని మోదీ, ఫాంహౌస్‌లోని కేసీఆర్ ఇద్దరూ తోడుదొంగలేనన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొందపెట్టిన ప్రజలే ఈ లోక్‌సభ ఎన్నికల్లో మోదీని కూడా ఓడించి కాంగ్రెస్‌తో కూడిన ఇండియా కూటమిని అధికారంలోకి తీసుకు వస్తారని తెలిపారు. తల్లిని చంపి బిడ్డను ఇచ్చారంటూ తెలంగాణను మోదీ పదే పదే అవమానపరిచారని చెప్పారు. కూతురు కవిత బెయిల్ కోసం కేసీఆర్.. మోదీతో చేతులు కలిపారని, మహబూబ్‌నగర్, చేవెళ్ల, మల్కాజ్‌గిరి, జహీరాబాద్, సికింద్రాబాద్‌లలో బీజేపీ అభ్యర్థులను గెలిపించే చీకటి ఒప్పందం ఆ రెండు పార్టీల మధ్య కుదిరిందని ఆరోపించారు. మొదట్నుంచి మోదీ తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తూ వస్తున్నారని, 42 సీట్లు ఉన్న తెలుగు రాష్ట్రాలకు ఒకే ఒక్క మంత్రిపదవి ఇచ్చి 30 సీట్లు ఉన్న గుజరాత్‌కు ఏడు మంత్రిపదవులు ఇచ్చారని మండిపడ్డారు. తెలంగాణలో బీజేపీకి ఒక్క సీటు కూడా ఇవ్వొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం.. తెలంగాణకు రావాల్సిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని మోదీ తుంగలో తొక్కారని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకుండా వదిలేసిన బీజేపీ.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుందని ఆరోపించారు. ఉత్తరాది కుంభమేళా, గంగానది శుద్ధికి రూ.వేల కోట్లు ఖర్చు చేసిన కేంద్రం.. తెలంగాణలో మేడారం మహాజాతరకు రూ.3 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. మేడారం మహాజాతరకు గుర్తింపు ఇవ్వబోమని చెప్పిన కిషన్‌రెడ్డి.. కమలం పార్టీకి ఓటు వేయాలని ఎలా అడుగుతారని ప్రశ్నించారు. కేసీఆర్ తమను దిగిపో.. దిగిపో అంటున్నారని, తామేమైనా అల్లాటప్పాగా వచ్చామా? అని ప్రశ్నించారు. మరో పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందన్నారు. ఆగస్టు 15 లోపు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.500 బోనస్ ఇస్తామని, భద్రాద్రి రాముడి సాక్షిగా చెబుతున్నానని అన్నారు.

కారు మళ్లీ ఇంటికి రాదు..

కారు కొంచెం ఖరాబ్ అయిందని, గ్యారేజీకి పోయిందని నిన్నమొన్న కేటీఆర్ అంటున్నారని, కానీ, కారు ఖరాబ్ కాలేదని. ఇంజన్ చెడిపోయి వర్క్‌షాప్‌కు వెళ్లిందని సీఎం రేవంత్ అన్నారు. అక్కడి నుంచి మళ్లీ ఇంటికి రాదని, ఇనుప సామాను దుకాణంలో తూకం పెట్టి అమ్మాల్సిందేనని చెప్పారు. "నీ కారే కాదు.. నీ అయ్య ఆరోగ్యం కూడా అనుము చెడ్డది. ఇవ్వాల్టికీ నడవలేకపోతున్నడు. మొన్న జరిగిన ఎన్నికల్లో కారును బండకేసి కొట్టిన్రు. వంద మీటర్ల గోతి తీసి పాతిన్రు" అంటూ రేవంత్ మండిపడ్డారు. 2009లో కేసీఆర్‌ను కరీంనగర్ ప్రజలు తిరస్కరిస్తే.. పాలమూరు ప్రజలు తెలంగాణ వస్తుందని, బతుకులు మారుతాయని భావించి ఎంపీగా గెలిపించారని తెలిపారు. కానీ, పదేళ్ల అధికారంలో ఉండి పాలమూరుకు ఏమీ చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక వంద రోజుల్లో 35 కోట్ల మంది ఆడబిడ్డలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేశారని, ఆరోగ్య శ్రీ ద్వారా పేదల వైద్యం కోసం రూ.10 లక్షలు ఇస్తున్నామని.. గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇస్తున్నామని చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలను ఆదుకున్నామని, 30 వేల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీలకు తగినన్ని నిధులు కేటాయించేందుకు బీసీ జనాభా లెక్కలు తీస్తున్నామని అన్నారు. వంద రోజుల్లో పాలమూరు జిల్లాకు రూ.10 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. ముదిరాజ్ బిడ్డను పంద్రాగస్టులోపు మంత్రిని చేస్తామని మరోసారి సీఎం హామీ ఇచ్చారు. మాదిగల వర్గీకరణ కోసం పార్లమెంట్, సుప్రీంకోర్టులో పోరాడే బాధ్యత తమ ప్రభుత్వానిదని చెప్పారు. బీఆర్ఎస్-బీజేపీ ఒక్కటై కాంగ్రెస్‌ను ఓడించాలని కుట్రలు చేస్తున్నాయని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి పని చేయాలని సూచించారు.



రేవంత్ బీజేపీ ఏజెంట్

ఆయనకు రాహుల్ చోటాభాయ్, మోదీ బడేభాయ్: హరీశ్

జహీరాబాద్, ఏప్రిల్ 19: సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీకి ఏజెంట్‌గా మారారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో శుక్రవారం రాత్రి బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన ఈద్‌మిలాప్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో హరీశ్ రావు ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం ఆర్ఎస్ఎస్‌తోనే మొదలైందని చెప్పారు. రేవంత్ రెడ్డి.. రాహుల్‌గాంధీని చోటాభాయ్‌గా, ప్రధాని మోదీని బడేభాయ్‌గా భావిస్తున్నారని, ఆయన కాంగ్రెస్సా లేక బీజేపీ వ్యక్తినా అనే విషయాన్ని అందరూ గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌లో మైనారిటీలకు సముచిత స్థానం దక్కలేదని, మంత్రి వర్గంలో వారికి అవకాశం కల్పించలేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలలో కేవలం ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని మాత్రమే అమలు చేస్తున్నారన్నారు.

పొన్నం వ్యాఖ్యలు ముమ్మాటికీ కోర్టు ధిక్కరణే : బండి సంజయ్

హైదరాబాద్/కరీంనగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కోర్టులపై చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ కోర్టు ధిక్కరణే అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలంలోని పలువురు మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీకి 500 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు ఇస్తే శరత్‌చంద్రారెడ్డికి బెయిల్ వచ్చిందంటూ పొన్నం చేసిన వ్యాఖ్యలు కోర్టు ధిక్కరణ కిందకు వస్తాయని చెప్పారు. న్యాయ స్థానాలపై, చట్టాలపై నమ్మకం లేకుండా మంత్రి హోదాలో కోర్టును కించపరచడంపై న్యాయపరంగా ముందుకు వెళ్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు క్వింటాలు వరికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ హామీ ఏమైందని ప్రశ్నించారు.

భువనగిరిలో మాకు మద్దతివ్వండి

భట్టికి స్పష్టం చేసిన తమ్మినేని

హైదరాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): భువనగిరిలో పార్లమెంట్ స్థానంలో తమ పార్టీ అభ్యర్థికి మద్దతివ్వాలని ఉప ముఖ్యమంత్రి భట్టిని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. మిగిలిన 16 స్థానాల్లో కాంగ్రెస్‌కు సీపీఎం మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో భట్టితో భేటీ సందర్భంగా ఈ విషయాన్ని చర్చించారు. భేటీలో భాగంగా.. లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పనిచేద్దామని, కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు తెలపాలని సీపీఎం నేతలను భట్టి అభ్యర్థించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... దేశంలో లౌకికవాద పార్టీలు ఇండియా కూటమితో జతకడుతునట్లు, అదేబాటలో పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఎంలు కలిసి పనిచేయాలని అంగీకారానికి వచ్చినట్లు తెలిపారు. సీపీఎం నాయకులు చేసిన ప్రతిపాదనలను పార్టీ అధిష్ఠానం, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని చెప్పారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, ఎస్.వీరయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, భువనగిరి పార్లమెంటు స్థానంలో సీపీఎం ఇప్పటికే ఎండీ జహంగీర్‌ను అభ్యర్థిగా ప్రకటించింది.

హైదరాబాద్‌లో ఏ ప్రతిపాదికన ఓట్లు తొలగించారు?

అధికారులను ప్రశ్నించిన పార్టీల నేతలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఓట్ల తొలగింపుపై పలు పార్టీల నేతలు అధికారులను ప్రశ్నించారు. ఏ ప్రతిపాదికన 5.41 లక్షల ఓట్లను తొలగించారు? బోగస్ ఓట్లకు సంబంధించి తాము చేసిన ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నారా? అని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 8న జాబితా ప్రకటన అనంతరమూ ఓట్లు తొలగించారా? అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ప్రశ్నించారు. తొలగింపులు జరిగాయని రోనాల్డ్ రోస్ సమాధానమిచ్చారని నిరంజన్ తెలిపారు. కాగా ఈ నెల 25న అనుబంధ జాబితా విడుదల చేయనున్నట్టు రోనాల్డ్ రోస్ తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలులో పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించారు. ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగా 'సువిధ' పోర్టల్, యాప్ ద్వారా దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం మే 3 నుంచి 8వ తేదీ వరకు హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి సంబంధించి ఆల్ సెయింట్స్ స్కూల్‌లో, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఓటర్ల కోసం పికెట్‌లోని కేంద్రీయ విద్యాలయంలో, కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కంటోన్మెంట్ సీఈసీ ఆఫీస్‌లో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

అందరూ కోటీశ్వరులే!

ఎన్నికల అఫిడవిట్లలో అభ్యర్థుల ఆస్తులు, అప్పుల లెక్కలు

లోక్‌సభ ఎన్నికలకు ఇప్పటిదాకా నామినేషన్లు దాఖలు చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో దాదాపు అందరూ కోటీశ్వరులే ఉన్నారు. నామినేషన్లతో పాటు వారు సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. రూ.కోట్లు విలువైన స్థిర, చర ఆస్తులు కలిగిన అభ్యర్థులు కొందరు తమకు సొంతిళ్లు, వాహనాలు లేవని పేర్కొనడం గమనార్హం.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



నా భార్య నాకు రూ.1.20 కోట్లు బాకీ: హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి ఆయన సతీమణి రూ.1.20 కోట్లు బాకీ ఉన్నారు. రూ.18.89 కోట్ల విలువైన స్థిరచరాస్తులు కలిగిన ఒవైసీ లోక్‌సభ ఇచ్చే వేతనంతోనే జీవనం సాగిస్తున్నారు. ఎంఐఎం తరఫున హైదరాబాద్ ఎంపీగా నామినేషన్ దాఖలు చేసిన అసదుద్దీన్ తన ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లో పేర్కొన్నారు. దాని ప్రకారం.. ప్రస్తుతం శాస్త్రిపురం మైలార్‌దేవ్‌పల్లిలోని తమ నివాసం మొత్తం విస్తీర్ణం 1,30,680 ఎస్ఎఫ్‌టి ఉండగా, ఇందులో 36,250 ఎస్ఎఫ్‌టిలో భవన నిర్మాణం ఉందని తెలిపారు. ఇందులో తనకు 3/4, భార్యకు నాలుగోవంతు వాటా ఉందన్నారు. 36,250 ఎస్ఎఫ్‌టీల్లో చేపట్టిన భవన నిర్మాణ ఖర్చులో తన భార్య వాటా కింద తనకు రూ.1.20 కోట్లు బాకీ ఉందన్నారు. హైదరాబాద్‌లోని విశ్రీగంజ్‌లో 3843 ఎస్ఎఫ్‌టి స్థలంలో మరో నివాసం ఉందన్నారు. ఈ భవనాన్ని రూ.2.04 కోట్లకు కొనుగోలు చేయగా ప్రస్తుత విలువ దాదాపు రూ.19.65 కోట్లు ఉందని తెలిపారు. మొత్తం రూ. 2.88 కోట్ల విలువైన చరాస్తులు, రూ.16.01 కోట్ల స్థిరాస్తులు కలిపి మొత్తం రూ.18.89 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని తెలిపారు. తన పేరున రూ.4.30 కోట్లు, భార్య పేరుతో రూ. 2.75 కోట్ల చొప్పున మొత్తం రూ.7.05 కోట్ల అప్పులున్నాయన్నారు. లోక్‌సభ ఇచ్చే వేతనమే తన జీవనాధారమని పేర్కొన్నారు. తన వద్ద రూ.2లక్షలు, తన భార్య వద్ద రూ. 50వేలు నగదు ఉండగా.. మూడు బ్యాంకుల్లో కలిపి రూ.1.56 కోట్లు, తన భార్య పేరున ఒక బ్యాంకులో రూ.1.30 లక్షలున్నాయని ప్రకటించారు. తనతోపాటు కుటుంబసభ్యుల పేరిట ఎలాంటి వాహనాలు లేవని తెలిపారు. భార్య పేరిట రూ. 14.41 లక్షల విలువైన 20 తులాల బంగారం ఉందని వెల్లడించారు. ఇక, ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, హైదరాబాద్‌లో తనపై మొత్తం 5 క్రిమినల్ కేసులు నమోదయ్యాయని ప్రకటించారు.,

కోటీశ్వరుడే కానీ కారు లేదు. !

పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ తరఫున నామినేషన్ వేసిన గడ్డం వంశీకృష్ణ కోటీశ్వరుడే కానీ ఆయనకు సొంత కారు లేదు. వంశీకృష్ణ సమర్పించిన అఫిడవిట్ ప్రకారం ఆయనకు రూ.21,59,73,094 స్థిర, చరాస్తులు ఉన్నాయి. స్థిర ఆస్తుల విలువ రూ.4,17,05,497 కాగా, ఆయన భార్య పేరిట రూ.52,03,178 విలువైన ఆస్తులు ఉన్నాయి. అలాగే రూ.6.83 కోట్ల విలువైన రుణాలు ఉన్నాయి. వంశీకృష్ణ పేరిట రూ.17,42,67,687 విలువైన చరాస్తులు ఉన్నాయి. ఆయనపై ఎలాంటి కేసులు లేవు.

కొప్పుల ఆస్తులు రూ.1.30 కోట్లు

పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ తనకు రూ.1,30,34,911 విలువైన స్థిర, చరాస్తులు ఉన్నాయని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన పేరిట రూ.40 లక్షలు, భార్య పేరిట కోటి 23 లక్షల స్థిర ఆస్తులు ఉన్నాయని తెలిపారు. ఆయన పేరిట రూ.90,34,911, భార్య పేరిట రూ.2,69,25,849 విలువైన చరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. తన వద్ద రూ.20 వేలు, భార్య వద్ద రూ.15 వేలు నగదు ఉందన్నారు. తనకు రెండు ఇన్నోవా వాహనాలు, భార్యకు ఒక బొలేరో వాహనం ఉన్నాయని, తనపై ఎలాంటి కేసుల్లేవని పేర్కొన్నారు. తనకు రూ.28,75,465, భార్య పేరిట రూ.1,74,81,512 అప్పులు ఉన్నాయని ఈశ్వర్ వెల్లడించారు.

కిషన్‌రెడ్డి దంపతుల ఆస్తి 4.53 కోట్లు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఆ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్‌రెడ్డి తమ దంపతులకు రూ.4,53,55,087 విలువైన ఆస్తులు ఉన్నాయని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన వద్ద రూ.70 వేలు, భార్య వద్ద రూ.25 వేలు నగదు ఉన్నదని తెలిపారు. అలాగే తమ కుమార్తె వద్ద రూ.15 వేలు, కొడుకు వద్ద రూ.10 వేలు ఉన్నట్లు చూపించారు. తన పేరిట వేర్వేరు బ్యాంకు ఖాతాల్లో కలిపి రూ.18.71 లక్షలు ఉన్నాయని, భార్య కావ్య పేరిట రూ.2.38 లక్షలు ఉన్నట్లు చూపించారు. భార్య పేరు మీద 1.63 కోట్ల అప్పు ఉన్నట్లు తెలిపారు. తనపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని అఫిడవిట్‌లో వివరించారు.

బాజిరెడ్డికి భారీగా భూములు

నిజామాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు రూ.3,85,90,017 విలువైన స్థిర, చరాస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో తెలిపారు. చీమన్‌పల్లిలో 25 ఎకరాల భూమి, భార్య పేరు మీద 6 ఎకరాల 21 గుంట భూమి ఉన్నట్లు పేర్కొన్నారు. నిజామాబాద్‌లో ఒక ఇల్లు, రాజేంద్రనగర్‌లో 500 గజాలు, కొండాపూర్‌లో 100 గజాలు, జక్రాన్‌పల్లిలో 6 ఎకరాల 20 గుంటల భూమి, బీబీపూర్‌లో 3 ఎకరాల భూమి ఉన్నట్లు పేర్కొన్నారు.

పద్మారావుగౌడ్‌కు స్థిరాస్తుల్లేవు

సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు రూ.2.69 కోట్లు, భార్య స్వరూప పేరిట రూ.92.90 లక్షల విలువైన చరాస్తులున్నాయి. తనకు 600 గ్రాములు, సతీమణికి 750 గ్రాముల బంగారం, 17 కిలోల వెండి ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే, తన పేరిట స్థిరాస్తులు లేవని చూపిన ఆయన భార్య పేరిట వివిధ ప్రాంతాల్లో రూ.93.96 లక్షల విలువైన భవనాలు ఉన్నట్టు పేర్కొన్నారు. రూ.97 లక్షల విలువైన వోల్వో కారు, రూ.21.03 లక్షల స్కార్పియో, భార్య పేరిట రూ.20.16 లక్షల హ్యుండయ్ వెర్నా కారు, రూ.50 లక్షల వాహన రుణం ఉన్నట్టు చూపారు.

తాండ్ర దంపతులకు 7 కిలోల బంగారం

ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు దంపతుల వద్ద సుమారు ఏడు కిలోల బంగారం ఉంది. వినోదరావు దాఖలు చేసిన అఫిడవిట్ ప్రకారం.. ఆ దంపతులకు రూ.16.23 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. ఇందులో వినోదరావు పేరిట రూ.11.65 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. ఇందులోని రూ.7.04 కోట్ల చరాస్తుల్లో రూ.1.90 కోట్లు విలువ చేసే మూడున్నర కిలోల బంగారం, రూ.1.82 లక్షల విలువైన 32.700 గ్రాముల వెండి ఉన్నాయి. వినోదరావు సతీమణి పేరిట రూ.1.92 కోట్లు విలువ చేసే 3.261 కిలోల బంగారం, రూ.19.66 లక్షల విలువైన 29.800 గ్రాముల వెండి ఉన్నాయి. వినోదరావు పేరిట రూ.3.42లక్షల అప్పులు ఉన్నాయి.

ఆర్ ఎస్ ప్రవీణ్‌కు సొంత వాహనాల్లేవు



నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ తన కుటుంబానికి రూ.1.41 కోట్లు ఆస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే తన మీద 3 ఎఫ్ఐఆర్‌లు ఉన్నట్లు తెలిపారు. రూ.16500 నగదు మాత్రమే ఉన్నట్లు చెప్పారు. తనతోపాటు తన కుటుంబంలో ఎవరికీ సొంత వాహనాలు లేవని పేర్కొన్నారు.

వంశీచంద్‌కు సొంతిల్లు లేదు

మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి సొంతిల్లు లేదు. తన కుటుంబానికి రూ.3,31,71,049 ఆస్తులు ఉన్నాయని ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన పేరిట రూ.71,28,903 లక్షల చరాస్తులు, రూ.35 లక్షల స్థిరాస్తులు ఉన్నట్లు పేర్కొనగా, తన భార్య ఆశ్లేషారెడ్డి పేరిట రూ.1,90,42,146 చరాస్తులు, రూ.35లక్షల విలువ చేసే స్థిరాస్తులు ఉన్నట్లు తెలిపారు. వంశీకి సంబంధించి రూ.15.92 లక్షలు విలువ చేసే 240 గ్రాముల బంగారు, తన భార్యపై రూ.99.54 లక్షలు విలువ చేసే 1500గ్రాముల నగలు, రూ.75 లక్షలు విలువ చేసే వజ్రాల నగలు ఉన్నట్లు పేర్కొన్నారు. తన స్వగ్రామం అప్పారెడ్డిపల్లిలో 5 ఎకరాలు, తన భార్య పేరిట మరో 5 ఎకరాల భూమి ఉన్నదని వెల్లడించారు. తనకు ఒక ఫార్చునర్ కారు, రూ. 20.76 లక్షల కారు లోను ఉందని వెల్లడించారు.

బూర నర్సయ్య ఆస్తులు 46.99కోట్లు

భువనగిరి బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ తన కుటుంబానికి రూ.46,99,78,409 ఆస్తులు ఉన్నాయని ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన పేర్కొన్నారు. ఆయన పేరున స్థిర, చరాస్థులు మొత్తం రూ.35,03,18,818, ఆయన భార్య అనిత పేరు మీద రూ.11,96,59,593 ఉన్నాయని తెలిపారు. తనకు రూ.1,28,17,844 అప్పు ఉండగా, భార్యకు రూ.1,93,83,212 అప్పులున్నాయని చెప్పారు.

పోతుగంటి ఆస్తులు 33.85 లక్షలే

నాగర్‌కర్నూల్ ఎంపీ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ తన కుటుంబానికి రూ. 33.85 లక్షల ఆస్తులున్నట్లు అఫిడవిట్‌లో తెలిపారు. ఇందులో రూ.15.86 లక్షల విలువైన స్థిరాస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. తనపై ఎలాంటి కేసులు లేవని, సొంతంగా కారు లేదని వెల్లడించారు. చేతిలో రూ.2 లక్షల నగదు, ద్విచక్ర వాహనం, 15 తులాల బంగారంతో కలిసి రూ. 17.99 లక్షల చరాస్తులు ఉన్నట్లు తెలిపారు. కల్వకుర్తి మండలం గుండూరులో 7.08 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నదని తెలిపారు.

రఘునందన్ ఆస్తులు 21.07 కోట్లు

మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు తనకు రూ.21.07 కోట్లు విలువైన స్థిర, చరాస్తులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో స్థిరాస్తులు రూ.12.94 కోట్లు, చరాస్తులు రూ.9.13 కోట్లుగా చూపించారు. అలాగే, రూ.12.11 కోట్ల రుణాలున్నట్లు తెలిపారు. తన వద్ద రూ.2.5 లక్షలు నగదు ఉందని, బ్యాంకు ఖాతాల్లో రూ.5.2 కోట్లు ఉన్నాయని వెల్లడించారు. తమ కుటుంబానికి 46.25 ఎకరాల వ్యవసాయ, వ్యవసాయేతర భూములున్నాయని పేర్కొన్నారు. తన భార్య మంజులకు 14 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయని వివరించారు.

అర్వింద్ ఆస్తులు రూ.97 కోట్లు

నిజామాబాద్ ఎంపీ బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ తమకు రూ.97,53,52,312 విలువైన స్థిర,చరాస్తులు ఉన్నట్టు అఫిడవిట్‌లో ప్రకటించారు. చరాస్తుల విలువ రూ.47,71,90,312, స్థిరాస్తుల విలువ రూ.49,51,62,200గా చూపించారు. భార్య పేరిట రూ.12,11,70,114 విలువైన చరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. డిపెండెంట్ పేరు మీద రూ.24,97,647 ఉన్నట్లు తెలిపారు. తనకు రూ.19,17,38,918లు, భార్య పేరిట రూ.11,43,63,000 అప్పులు ఉన్నట్టు పేర్కొన్నారు.

బలరాంనాయక్‌పై కిడ్నాప్ కేసు

మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తనపై చెన్నైలో కిడ్నాప్ కేసు నమోదైందనిఅఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే, తన మీద చెక్ బౌన్స్ సహా ఆరు కేసులు ఉన్నట్లు తెలిపారు. మజీద్‌పూర్‌లో 2కోట్ల విలువ చేసే సాగుభూమి ఉందని, 2.45కోట్ల అప్పు ఉన్నట్లు పేర్కొన్నారు. బంజారా హిల్స్‌లో 50లక్షల విలువైన భవనం ఉందని తన భార్య పేరిట రూ.94,00,392 ఆస్తులున్నట్టు పేర్కొన్నారు.

సచివాలయంలో 'గేట్ల' మార్పు

» సింగిల్ స్లైడింగ్ స్థానంలో రెండు గేట్లు ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిపాలనా సౌధమైన సచివాలయంలో లోపాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఆ మధ్య వర్షం నీటికి సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద వాటర్ లీకవ్వడం, పార్కింగ్ సమస్య, పిల్లర్ పగుళ్లు... వంటి సమస్యలు తలెత్తగా తాజాగా గేట్ల నిర్మాణంలో డొల్లతనం బయటపడింది. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి సచివాలయంలోకి వెళ్లే.. ప్రధాన ద్వారంతో పాటు, దానికి ఎదురుగా ఉండే మరో ద్వారం వైపు ఉన్న (బాహుబలి తలుపుల కింది నుంచి సీఎం వెళ్లే ఎంట్రీ పాయింట్) సింగిల్ స్లైడింగ్ గేట్లను మార్చుతున్నారు. ప్రస్తుతం ఉన్న సింగిల్ స్లైడింగ్ గేట్లు ఒక్కొక్కటి భారీగా ఉన్నాయి. 7 అడుగుల మేర బారు ఉండడంతో వాటిని తెరవడం, మూయడం చాలా కష్టంగా మారింది. ఈ బాహుబలి గేటు వల్ల అవతలివైపు నుంచి వచ్చే వ్యక్తులను గుర్తించలేకపోవడం మరో లోపం. దాంతో ముఖ్యమంత్రి లోపలికి వచ్చే సమయంలో వాటిని అప్పటికప్పుడే తీయాలంటే సిబ్బందికి కష్టంగా మారింది. దీంతో వాటి స్థానంలో 'ఐరన్ గ్రిల్ డబుల్ గేట్ల'ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ డబుల్ గేట్ల విధానంలో ఒక్కో గేటును సునాయాసంగా ఓపెన్ చేసేందుకు అవకాశం ఉండడంతో పాటు, అవతలివైపు నుంచి వస్తున్న వ్యక్తులను గుర్తించవచ్చు. ప్రస్తుతం సచివాలయంలోని సీఎంవోకు వెళ్లే బ్లాక్ పక్కన (మసీదు, చర్చి గోడలవైపు) ఉన్న సింగిల్ గేటు వద్ద డబుల్ గేటును ఏర్పాటు చేస్తున్నారు

దుబాయ్ విమాన రాకపోకలకు మరో 3 రోజులు!

» అమెరికా, ఐరోపా వెళ్లే భారతీయుల అగచాట్లు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

భారీ వర్షాలతో అతలాకుతలమైన దుబాయ్ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నప్పటికీ కీలకమైన దుబాయ్ విమానాశ్రయం ఇంకా సాధారణ పరిస్థితికి రాలేదు. ఇక్కడికి వచ్చే విమానాల సంఖ్యను కుదిస్తున్నట్లు విమానాశ్రయం శుక్రవారం ప్రకటించింది. ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎమిరేట్స్, ఫ్లై దుబాయ్ విమానయాన సంస్థలు తమ విమానాలను రీ షెడ్యూల్ లేదా రద్దు చేశాయి. విమానాల రాకపోకల్లో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉంది దుబాయ్ విమానాశ్రయం. ప్రతిరోజూ వందలాది మంది తెలుగు ప్రవాసీయులు, వారి కుటుంబసభ్యులు, తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యాపారవేత్తలు ఈ విమానాశ్రయం గుండా అమెరికా, ఐరోపా, ఇతర దేశాలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో దుబాయ్ మీదుగా ఇతర దేశాలకు వెళ్లే భారతీయులు అగచాట్లు పడుతున్నారు. విమానాశ్రయం సాధారణ స్థితికి వచ్చేందుకు మరో మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కాగా, దుబాయ్‌లో పాఠశాలలు ఇంకా మూసే ఉన్నాయి. మరోవైపు వరదల్లో దేశవ్యాప్తంగా ఒక్క వ్యక్తి మాత్రమే మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. అయితే ఇప్పటికే కొందరు విదేశీయులు మరణించినట్లు వార్తలు వస్తున్నాయి. వాటిని అధికారులు ధ్రువీకరించలేదు.

దుబాయ్ ప్రయాణాలు వాయిదా వేసుకోండి

» భారత రాయబార కార్యాలయం

అబుదాబి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: దుబాయ్‌కు వచ్చే, దుబాయ్ విమానాశ్రయం మీదుగా ప్రయాణించే భారతీయులు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని యూఏఈలోని భారత రాయబార కార్యాలయం కోరింది. కార్యకలాపాలు సాధారణ స్థితికి వచ్చే వరకు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని శుక్రవారం సూచించింది. విమానం బయలుదేరే తేదీ, సమయాలను విమానయాన సంస్థ ద్వారా ధ్రువీకరించుకున్న తర్వాతే విమానాశ్రయానికి రావాలని ముంబై విమానాశ్రయ అధికారులు ప్రయాణికులకు సూచించారు. దుబాయ్‌కు వెళ్లే, దుబాయ్ నుంచి వెళ్లే తమ విమానాలను రద్దు చేసినట్లు ఎయిర్ ఇండియా శుక్రవారం ప్రకటించింది. ఏప్రిల్ 21 వరకు టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు రీషెడ్యూల్‌కు ఒక అవకాశం లేదా రద్దు చేసుకుంటే పూర్తి రిఫండ్ అందించనున్నట్లు ప్రకటించింది.

సినీనటుడు రఘుబాబు అరెస్టు.. విడుదల

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 19 : నల్లగొండ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నేత సంధినేని జనార్ధన్‌రావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేసులో సినీనటుడు రఘుబాబును శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ను రిమాండ్‌కు తరలించారు. రఘుబాబుకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 17న బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌రావు నార్కట్‌పల్లి-అద్దంకి బైపాస్ వద్ద రోడ్డు దాటుతుండగా, వెనుక వేగంగా వస్తున్న సినీనటుడు రఘుబాబు కారు ఢీకొనడంతో మృతి చెందారు. అప్పటికప్పుడు పోలీసులు రఘుబాబును అదుపులోకి తీసుకున్నా సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. తాజాగా శుక్రవారం ఆయన్ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా బెయిల్ మంజూరు చేసినట్టు టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

మంత్రి తుమ్మలపై కుట్రను ఛేధించాలి : సీపీఐ

హైదరాబాద్, ఖమ్మం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై అసెంబ్లీ ఎన్నికల సమయంలో దాడికి కుట్ర చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ వైరుధ్యాలు భౌతిక దాడులకు దారి తీయడం, కుట్రలు చేయడం సమాజానికి మంచిది కాదన్నారు. దీని వెనుక ఉన్న వ్యక్తులను, శక్తులను త్వరితగతిన గుర్తించాలని కోరారు.

వంద కేంద్రంగా ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)



విశేషం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది డిసెంబరు 7వ తేదీన కొలువుదీరింది. ఏప్రిల్ 17వ తేదీ నాటికి నాలుగు నెలల 10 రోజుల కాలాన్ని పూర్తి చేసుకున్నది. ఇంత తక్కువ సమయంలో హామీలను సంతృప్త స్థాయిలో అమలు చేయడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాని పని. కానీ.. ఇంతలోనే లోక్‌సభ ఎన్నికలు వచ్చి పడ్డాయి. రాజకీయ పార్టీలకు ఎన్నికల్లో గెలవడమే లక్ష్యం. దాని కోసం ఎలాంటి అవకాశం అందివచ్చినా జారవిడుచుకోవు. అధికార పార్టీ అయినా ప్రతిపక్షమైనా ఎన్నికలకు అనుగుణంగా విమర్శలు, ప్రతి విమర్శలకు సిద్ధపడతాయి. దీనికి తగినట్లుగానే కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ స్పందిస్తున్నాయి. 100 రోజుల కాంగ్రెస్ పాలనే కేంద్రంగా ప్రచారాన్ని రక్తి కట్టిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేశామని కాంగ్రెస్ చెబుతోంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తును అమలు చేస్తున్నామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించామని, ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య ఖర్చుల పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని గుర్తు చేస్తోంది. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇన్ని పథకాలను అమలు చేస్తున్నామని, లోక్‌సభ ఎన్నికల్లో ఇవే తమకు శ్రీరామ రక్ష అని ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ హామీలకు తోడు, సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా.. ఆగస్టు 15వ తేదీలోగా రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించారు. ఇతర హామీలను కూడా అమలు చేస్తామని చెబుతున్నారు. ఎక్కడికెళ్లినా 100 రోజుల పాలన చూసి ఓట్లేయమని అడుగుతున్నారు. లోక్‌సభ ఎన్నికలు తమ వంద రోజుల పాలనకు రెఫరెండమ్ లాంటివని ధైర్యంగా ప్రకటించారు. అదేసమయంలో బీఆర్ఎస్, బీజేపీపై సీఎం ఘాటుగా స్పందిస్తున్నారు. రాష్ట్రంలో ఐదు లోక్‌సభ స్థానాలను గెలిపించి ఇవ్వాలంటూ బీఆర్ఎస్‌కు బీజేపీ సుపారీ ఇచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణ చేశారు. అయినప్పటికీ, ఆ రెండు పార్టీలకు రాష్ట్రంలో పెద్దగా సీట్లు రావని, 17 లోక్‌సభ స్థానాల్లో 14 సీట్లను తామే గెలవబోతున్నామని ఘంటాపథంగా చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తే... మరింత ఉత్సాహంతో పని చేయడానికి వీలవుతుందని పేర్కొంటున్నారు.

తూర్పారబడుతున్న విపక్షాలు

ఇక బీఆర్ఎస్ పార్టీ నేతలు కాంగ్రెస్ 100 రోజుల పాలనను తూర్పారపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ ఇచ్చిన హామీలను 420 హామీలంటూ ఎద్దేవా చేస్తూ.. ప్రజలు ఆ హామీలను చూసి మోసపోయారని, మళ్లీ ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో మోసపోవద్దని బీఆర్ఎస్ పిలుపునిస్తోంది. 'అంతులేని హామీలతో కాంగ్రెస్ గెలిచింది. వాటిని నెరవేర్చేవరకు వెంటాడి వేటాడుతాం. రాష్ట్రంలో సరిగా కరెంటు ఉండటం లేదు. తాగు నీటికీ కటకటే. హామీలపై ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీయాలి' అని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఇటీవల పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా తెలంగాణకు ఎలాంటి న్యాయం చేయలేదని, మతం పేరిట దేశంలో చిచ్చు పెట్టి ఓట్లు అడగటం తప్ప బీజేపీకి ఎలాంటి ప్రచారాస్త్రం లేదని కేసీఆర్ విమర్శిస్తున్నారు. మరోవైపు, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా కాంగ్రెస్ 100 రోజుల పాలన మీదనే ధ్వజమెత్తటం గమనార్హం. ఇచ్చిన హామీల్లో వేటినీ కాంగ్రెస్ సరిగా అమలు చేయలేదని ఆ పార్టీ ఆరోపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో తుక్కుగూడ సభలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా... మళ్లీ అదే తుక్కుగూడలో సభ పెట్టి కొత్త హామీలను గుప్పించారని విమర్శిస్తోంది. పాత హామీలకే దిక్కులేదు, కొత్త హామీలతో ముందుకొస్తున్న కాంగ్రెస్‌ను ఆదరిస్తే అంతే సంగతి అంటూ ప్రజలను హెచ్చరిస్తోంది. అవినీతిని అరికడతామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హయాంలో అవినీతి ఏమాత్రం తగ్గలేదని బీజేపీ ఆరోపిస్తోంది. తెలంగాణకు మోదీ ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందని, పలు రైల్వే ప్రాజెక్టులు ఇచ్చిందని, ముద్ర రుణాలు అందిస్తున్నామని ప్రచారం చేస్తోంది.

జాతీయ మేనిఫెస్టోలను పక్కన పెట్టి..

బీజేపీ, కాంగ్రెస్ రెండూ జాతీయ పార్టీలు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆ రెండు పార్టీలు మేనిఫెస్టోలను రూపొందించి ఇప్పటికే విడుదల చేశాయి. కాంగ్రెస్ 'పాంచ్ న్యాయ్ పచ్చీస్ గ్యారెంటీ' పేరుతో మహిళలు, యువత, రైతులు, కార్మికులు, సామాజిక న్యాయం వారీగా పలు హామీలను ప్రకటించింది. పేద మహిళలకు ఏటా రూ.లక్ష ఆర్థికసాయం, నిరుద్యోగ యువతకు ఒక ఏడాదిపాటు ఉద్యోగ శిక్షణ.. ఆ సమయంలో రూ.లక్ష వేతనం, మహిళలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్, ఆర్థికంగా వెనకబడిన అన్ని కులాల వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్, కులగణన, రిజర్వేషన్లలో ప్రస్తుతం అమలవుతున్న 50 శాతం పరిమితి తొలగింపు, రైతులకు చట్టబద్ధంగా మద్దతుధర, ఉపాధి హామీ పథకం రోజువారీ వేతనం రూ.400కు పెంపు వంటి పలు ఆకర్షణీయ హామీలను ప్రకటించింది. మరోవైపు బీజేపీ 'సంకల్ప్‌పత్ర్: మోదీ కి గ్యారెంటీ' పేరుతో మేనిఫెస్టోను విడుదల చేసింది. గ్యాన్ (గరీబ్, యువ, అన్నదాత, నారీ - పేదలు, యువత, రైతులు, మహిళలు)లోని నాలుగు వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ పలు హామీలను ప్రకటించింది. దేశంలోని 3 కోట్ల మంది ప్రజలకు పక్కా గృహాలను నిర్మించి ఇస్తామని, 70 ఏళ్లు దాటినవారికి రూ.5 లక్షల ఉచిత వైద్యాన్ని అందిస్తామని, మరో ఐదేళ్ల పాటు ఉచిత రేషన్‌ను సరఫరా చేస్తామని, దక్షిణాదికి బుల్లెట్ రైలును ఇస్తామని, ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తామని, పైప్‌లైన్ ద్వారా గ్యాస్‌ను అందిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో, దేశంలోని ఆయా రాష్ట్రాల్లో జాతీయ స్థాయి మేనిఫెస్టోల ఆధారంగానే కాంగ్రెస్, బీజేపీలు ప్రచారాన్ని సాగిస్తున్నాయి. కానీ, తెలంగాణకు వచ్చేసరికి వాటి వ్యూహం మారిపోయింది. ఇక్కడ 100 రోజుల పాలన కేంద్రంగానే ఈ రెండు జాతీయపార్టీలూ ప్రచారం నిర్వహిస్తున్నాయి.

గోదావరి-కావేరీ డీపీఆర్..

గడువుపై వెనక్కి!

» విమర్శలు రావడంతో గడువు కాలమ్‌ను ఎత్తివేసిన ఎన్‌డబ్ల్యూడీఏ

» ఇచ్ఛంపల్లి నుంచి కాళేశ్వరానికి నీళ్లు

» మేడిగడ్డను పునరుద్ధరించకపోతే ఇచ్ఛంపల్లి ఎత్తు పెంచుతాం

» నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ వెదిరే శ్రీరామ్

హైదరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరీ అనుసంధానం ప్రాజెక్టు ముసాయిదా డీపీఆర్‌పై రాష్ట్రాలకు విధించిన గడువుపై విమర్శలు రావడంతో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) వెనక్కి తగ్గింది. నిన్నటిదాకా నెలాఖరులోగా డీపీఆర్‌పై అభ్యంతరాలు/సూచనలు ఉంటే తెలపాలని, లేని పక్షంలో డీపీఆర్‌ను ఆమోదించినట్లు పరిగణనలోకి తీసుకుంటామని అల్టిమేటం ఇచ్చిన ఎన్‌డబ్ల్యూడీఏ, డెడ్‌లైన్‌అంశాన్ని పక్కనపెట్టినట్లు తాజా ఉత్తర ప్రత్యుత్తరాల్లో పేర్కొంది. వాస్తవానికి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ప్రభుత్వాలు ఏ విధాన నిర్ణయాలు తీసుకోవడానికి వీల్లేకుండా పోతోంది. ముఖ్యమంత్రుల స్థాయిలో సంతకాలు చేయాలంటే ఎన్నికల సంఘం అనుమతి కూడా తప్పనిసరి. ఎన్‌డబ్ల్యూడీఏ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో తాజాగా జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల్లో గడువు కాలమ్‌ను ఎత్తివేశారు.

ఇచ్ఛంపల్లి వద్ద బ్యారేజీ కట్టి..

గోదావరి-కావేరీ అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా ఇచ్ఛంపల్లి వద్ద బ్యారేజీ కట్టి, అక్కడి నుంచే కాళేశ్వరం ప్రాజెక్టు కింద నీటి అవసరాలు తీర్చడానికి గల అవకాశాలను పరిశీలిస్తున్నామని నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ వెదిరే శ్రీరామ్ స్పష్టం చేశారు. ఆ మేరకు ప్రతిపాదనలపై శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ సమావేశంలో చర్చించారు. దాంతో పాటు భేటీలో ఐదు ప్రాజెక్టులపై చర్చించారు. మేడిగడ్డను పునరుద్ధరణ, మరమ్మతులు చేయకపోతే ఇచ్ఛంపల్లి బ్యారేజీ ఎత్తును పెంచి.. ఆ బ్యారేజీ నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు నీటి అవసరాలు తీర్చడానికి గల అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. సమ్మక్క బ్యారేజీని 80 మీటర్లకు తగ్గించుకుంటే ఎన్‌వోసీ ఇచ్చేందుకు ఆ రాష్ట్రం సిద్ధంగా ఉందని గుర్తు చేశారు. ఏ విధంగా చూసినా గోదావరి-కావేరీ అనుసంధానంతో తెలంగాణకు మేలే జరుగుతుందని చెప్పారు.

'ట్యాపింగ్' తేలితే కఠిన చర్యలే!

తెలంగాణలో టెలిగ్రాఫ్ చట్టాన్ని ఉల్లంఘించినట్లయితే చర్యలు తప్పవు

» కేసీఆర్ పదేళ్ల పాలనపై అనేక ఆరోపణలు

» తెలంగాణలో బీజేపీకి 10 సీట్లు పక్కా

» 'ఆంధ్రజ్యోతి'తో అనురాగ్ సింగ్ ఠాకూర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల పాలనపై ఎన్నో ఆరోపణలు వచ్చాయని కేంద్ర మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ చెప్పారు. కాళేశ్వరం మొదలుకొని ఫోన్ ట్యాపింగ్ వరకు అన్నింటినీ రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ నిజమైతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎటువంటి అనుమతి లేకుండా దేశంలో ఒకరి ఫోన్‌ను మరొకరు ట్యాప్ చేయడం కుదరదని చెప్పారు. తెలంగాణలో టెలిగ్రాఫ్ చట్టాన్ని ఉల్లంఘించి ఫోన్ ట్యాపింగ్ చేసినట్లయితే, కేంద్రం చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఇక ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేకనే ప్రతిపక్షాలు ఈవీఎంల విషయంలో అసత్య ఆరోపణలు చేస్తున్నాయని ఆరోపించారు.ఎన్నికల బాండ్ల విషయంలోనూ అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. లోక్‌సభ, ఏపీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీలోని తన నివాసంలో ఠాకూర్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. తెలంగాణలో పది లోక్‌సభ సీట్లకు తగ్గకుండా గెలుస్తామని చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ హవా కొనసాగుతోందని.. తెలంగాణలోనూ ఆ ప్రభావం బలంగా ఉందని తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు సీట్లు గెలుచుకున్నామని.. ఈ సారి అది రెండు నుంచి మూడు రెట్లు పెరిగే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు. పదేళ్ల పాటు కేసీఆర్ నియంతృత్వ పోకడలతో ప్రజలు విసిగిపోయారని, అందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌కు ఓటేశారని తెలిపారు. కాంగ్రెస్ ఆకర్షక హామీలను చూసి ప్రజలు మోసపోయారన్నారు. కానీ, ప్రస్తుతం తెలంగాణలో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెప్పారు. ప్రజలు ఈ సారి బీజేపీకి ఓటెయ్యబోతున్నారని తెలిపారు.



మద్యం కేసులో కవితది కీలకపాత్ర

ఢిల్లీ మద్యం కుంభకోణంలో కేసీఆర్ కుమార్తె కవితది కీలకపాత్రని ఠాకూర్ అన్నారు. దేశంలో అవినీతిపై పదేళ్ల నుంచి ప్రధాని మోదీ యుద్ధం చేస్తున్నారని తెలిపారు. కవిత జైల్లో ఉండి దర్యాప్తు సంస్థలపై, కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. ఇక ఇదే కుంభకోణంలో అరెస్టయిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ నిజాయతీ ముసుగు తొలగిపోయిందని ఠాకూర్ తెలిపారు. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలలకే అక్కడి వైద్యారోగ్య శాఖ మంత్రి అవినీతి ఆరోపణలతో రాజీనామా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆప్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి దారుణంగా మారిందన్నారు.

ఏపీలో ఎన్డీయేదే విజయం..

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి అధికారంలోకి రాబోతోందని ఠాకూర్ చెప్పారు. ఏపీలో జగన్ పరిపాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 110 స్థానాలకు పైగా గెలుచుకుంటుందని చెప్పారు. జూన్‌లో చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఏపీలోనూ అత్యధిక లోక్‌సభ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే శక్తిమంతమైన నేత నరేంద్ర మోదీ అని ఠాకూర్ తెలిపారు. "పదేళ్లలో దేశం ఎంతో అభివృద్ధి చెందింది. మోదీ సారథ్యంలో దేశ కీర్తి ఎన్నో రెట్లు పెరిగింది. ఒకప్పుడు ప్రతి చిన్న దానికి భారత్ ప్రపంచ దేశాల వైపు చూడాల్సి వచ్చేదని.. ఇప్పుడు ప్రపంచ దేశాలకు ఏ సహాయం కావాలన్నా భారత్ వైపు చూస్తున్నాయని చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే దేశాన్ని పాకిస్థాన్, చైనా వంటి దేశాలకు అప్పగించినట్టేనని.. ఈ విషయాన్ని దేశమంతా గ్రహించిందన్నారు. అందుకే దక్షిణాది రాష్ట్రాల ప్రజలు సైతం మోదీయే ప్రధానిగా ఉండాలని కోరుకుంటున్నారని చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచాక అసెంబ్లీ సాక్షిగా జై పాకిస్థాన్ నినాదాలు విన్నామని.. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ సారి అత్యధిక స్థానాలను బీజేపీ కైవసం చేసుకోబోతుందని తెలిపారు. ఏపీ, తెలంగాణలోనే సుమారు 30 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తంచేశారు. దేశమంతా మోదీ నాయకత్వాన్ని కోరుకుంటోందని, అందుకే 'మోదీ కా గ్యారెంటీ' పేరిట మేనిఫెస్టోను తీసుకొచ్చామని తెలిపారు. దేశంలో ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు ఎంతో అవసరమని.. బీజేపీతోనే ఇవన్నీ సాధ్యమని స్పష్టం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 20 ఏప్రిల్ 2024

వాట్సాప్ కొత్త ఫీచర్స్



వాట్సాప్ సరికొత్త ఫీచర్‌ని పరిచయం చేస్తోంది. ఇటీవలి కాంటాక్ట్‌లతో యూజర్లు సులువుగా కాంటాక్ట్ అయ్యేందుకు వీలుగా 'రీసెంట్ ఆన్‌లైన్ కాంటాక్ట్' ఫీచర్‌ను పరిచయం చేస్తోంది. బేటా టెస్టింగ్‌లో ఈ ఫీచర్ కనిపించింది. ఫలితంగా ప్రస్తుతం యాక్టివ్‌గా, ఆన్‌లైన్‌లో ఉన్న వారితో కాంటాక్ట్ కావడం మరింత

రీసెంట్ ఆన్‌లైన్ కాంటాక్ట్స్ లిస్ట్

ఈజీగా ఉంటుంది. బంధువులు, స్నేహితులతో మరింత బాగా సంభాషించుకునేందుకు ఈ ఫీచర్ తోడ్పడుతుందని 'వబేటాఇన్ఫో' పేర్కొంది. ఆన్‌లైన్‌లో ఉన్న అన్ని కాంటాక్ట్‌లతో సమగ్ర జాబితా ఏదీ కనిపించదు. ఇటీవలి కాలంలో యాక్టివ్‌గా ఉన్న వాటితో క్యురేటెడ్ లిస్ట్ మాత్రమే కనిపిస్తుంది. తద్వారా వెంటనే కమ్యూనికేట్ అయ్యేందుకు ఎవరు అందుబాటులో ఉన్నారో చెబుతుంది. టైమ్లీ కమ్యూనికేషన్ అంతకుమించి ఆప్టిమైజేషన్ లక్ష్యంతో ఈ ఫీచర్‌ను వాట్సాప్ రూపొందిస్తోంది. తద్వారా కమ్యూనికేషన్ ఎక్స్‌పీరియెన్స్ మెరుగ్గా ఉండేలా చూడనుంది. అలాగే వాట్సాప్‌ను అనుచిత ప్రయోజనాలకు ఉపయోగించుకోవడాన్ని నిరోధించాలని పూనుకుంది. ఈ ఏడాది ఒక్క ఫిబ్రవరి నెలలోనే మన దేశంలో 76 లక్షల మేర వాట్సాప్ అకౌంట్లను నిషేధించింది. రెగ్యులేటరీ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా ఈ చర్య తీసుకుంది.



టెస్టింగ్‌లో 'ప్రైవేట్ మెన్షన్'

వాట్సాప్ తాజాగా 'ప్రైవేట్ మెన్షన్' ఫీచర్‌ను పరీక్షిస్తోంది. దీంతో వాట్సాప్ పరిధిలోనే ప్రత్యేకించి కొన్ని కాంటాక్టులతో స్టేటస్ అప్డేట్స్‌ను పంచుకోవచ్చు. పర్సనలైజ్డ్ ఇంటరాక్షన్స్‌ను పెంచుకోవచ్చు. స్టేటస్ అప్డేట్స్‌లోనే స్పెసిఫిక్ కాంటాక్ట్‌లను ట్యాగ్ చేసే వెసులుబాటు దీంతో లభిస్తుందని 'డబ్ల్యుఎబేటాఇన్ఫో' పేర్కొంది. ఇది ప్రైవసీని మెయింటైన్ చేస్తుంది. మెన్షన్ చేసిన కాంటాక్ట్‌లకు మాత్రమే అప్డేట్ కనిపిస్తుంది. అంతేకాకుండా మ్యూటింగ్ సదుపాయం కూడా ఉంది. అంటే మ్యూట్ చేసిన కాంటాక్టుల నుంచి నోటిఫికేషన్లు రావు. ముఖ్యంగా వాట్సాప్ పరిధిలోనే ఉంటూ ప్రైవసీకి భంగం కలుగకుండా చూసుకోవచ్చు. ముఖ్యమైన అప్డేట్స్ అవసరమైన అటెన్షన్ పొందే వీలుకలుగుతుంది. యూజర్ ఇంటరాక్షన్స్ మెరుగవుతాయి. అందరిలో ఉంటూ మనకు అవసరమైన వాళ్లతో మాత్రమే అనుసంధానం కావడం అంటే ఇదే అని కూడా చెప్పుకోవచ్చు.

చాట్ ఫిల్టర్స్


చదవని మెసేజ్‌లను త్వరితగతిన కనుగునేందుకు వీలుగా వాట్సాప్ 'చాట్ ఫిల్టర్స్' ఉపయోగపడనున్నాయి. ఇందుకు అనుగుణంగా చాట్ లిస్ట్ టాప్‌లో మూడు వేర్వేరు ఫిల్టర్లు కనిపిస్తాయి. వాట్సాప్‌లో వచ్చే మెసేజ్‌లను ఆర్గనైజ్ చేసుకునేందుకు ఈ ఫిల్టర్లు ఉపయోగపడతాయి. చాట్‌లిస్ట్ యావత్తూ స్క్రోలింగ్ చేయకుండానే ముఖ్యమైన చాట్స్ యూజర్‌కు తెలుస్తాయి. గూగుల్‌కు చెందిన జీమెయిల్‌లో మూడు ఆప్షన్స్ ఉంటాయి. దాంతో మెసేజెస్ నేవిగేషన్ సులువుగా ఉంటుంది. 2020లోనే ఈ వెసులుబాటు జీమెయిల్‌లో అందుబాటులోకి వచ్చింది. సరిగ్గా అదేమాదిరిగా ఈ చాట్ ఫిల్టర్లు ఉపయోగపడనున్నాయి. ఆల్, అన్‌రీడ్, గ్రూప్ అని మూడు ఆప్షన్స్ చాట్‌లిస్ట్ టాప్‌లోనే కనిపిస్తాయి. ఆల్ అన్నది ఇక్కడ డిఫాల్ట్ వ్యూ. అన్‌రీడ్‌లో యూజర్ మార్క్ చేసినవి కావచ్చు లేదా ఓపెన్ చేయనివి కావచ్చు. గ్రూప్స్‌పై టాప్ చేస్తే అక్కడ కూడా గ్రూప్ చాట్స్, కమ్యూనిటీస్‌కు సంబంధించిన సబ్ గ్రూప్స్ ఉంటాయి. ఏవి ముఖ్యమైనవి, మరేవి చదవాలి, వేటికి సమాధానం ఇవ్వాలి అనే విషయంలో ఇకపై యూజర్‌కు ఇబ్బంది ఉండదు. దీని అప్డేట్ వాట్సాప్ బేటా ఫర్ ఆండ్రాయిడ్‌లో కనిపించింది. మంగళవారమే ప్రకటించిన ఈ అప్డేట్ త్వరలోనే యూజర్లు అందరికీ చేరువ కానుంది.

స్నాప్‌చాట్‌లో వాటర్‌మార్క్

స్నాప్‌చాట్ తాజాగా ఏఐ జనరేటెడ్ ఇమేజెస్ కోసం వాటర్‌మార్క్‌ని తీసుకువస్తున్నట్టు ప్రకటించింది. తద్వారా దుర్వినియోగాన్ని అరికట్టడానికి తోడు పారదర్శకతను పెంచాలని భావిస్తున్నట్టు తెలిపింది. వాటర్‌మార్క్ ఫీచర్ స్పటికం మాదిరిగా స్నాప్ లోగో దానికి తోడు స్పార్కల్ ఎమోజీతో దర్శనమిస్తుంది. ఏఐ ఇమేజ్ అయితే చాలు, ఇది ఆటోమేటిక్‌గా అప్లయ్ అవుతుంది. యాప్ లేదంటే కెమెరా రోల్‌లో సేవ్ అవుతుంది. అదే సమయంలో ఈ వాటర్‌మార్క్ తొలగింపు అంటే యూసేజ్ నిబంధనలను అతిక్రమించినట్టు లేదా ఉల్లంఘించినట్టు పరిగణిస్తారు. ఏఐ జనరేటెడ్ కంటెంట్ విషయంలో స్నాప్‌చాట్ కూడా మైక్రోసాఫ్ట్, మెటా తదితర దిగ్గజ టెక్ సంస్థలను ఫాలో అవుతోంది. పారదర్శకత, జవాబుదారీతనానికి పూచీపడుతోంది. ఆ క్రమంలో భాగంగా స్నాప్‌చాట్ ప్రస్తుతం సెల్ఫీ నిర్దేశిత 'డ్రీమ్స్' ఫీచర్‌ను పరిచయం చేసింది. దీంతో యూజర్లు తమ ఫొటోలకు ఏఐ జనరేటెడ్ ఎఫెక్ట్స్‌ను పొందవచ్చు.



గూగుల్ వాలెట్ ఇండియాలో ఆరంభం!



గూగుల్ వాలెట్ మొత్తానికి మన దేశంలోకి వచ్చి చేరిందని సమాచారం. ప్లేస్టోర్‌లో లిస్టింగ్ కానుంది. ఈ పరిణామం చోటుచేసుకుంటే మాత్రం డిజిటల్ పేమెంట్స్‌లో గణనీయమైన మార్పులను చూడగలుగుతాం. ఇండియన్ మార్కెట్‌కు అవసరమైన మార్పులు, చేర్పులతో ఇది మనదేశంలోకి వస్తున్నట్టు ఇటీవలి నివేదికలు కొన్ని సూచించాయి. దేశంలోని బ్యాంకులు, ఎయిర్‌లైన్స్ తదితరాలతో కలసి పనిచేయనుంది. ప్రస్తుతానికి ఇది అందుబాటులో లేనప్పటికీ యూజర్లు యాప్‌ను మాన్యువల్‌గా డౌన్‌లోడ్ చేసుకుని బ్యాంక్ కార్డులతో లింక్ చేసుకోవచ్చు. కాంటాక్ట్‌లెస్ వ్యవహారాలను సజావుగా సాగించుకోవచ్చు. గూగుల్ పేకు తోడు మరికొన్ని అవసరాలను దీంతో కొనసాగించవచ్చని కూడా చెబుతున్నారు. 'టెక్‌క్రంచ్' దీన్ని మొదట గుర్తించింది. ఎస్‌బీఐ, ఎయిర్ ఇండియా, పీవీఆర్ ఐనాక్స్ కనిపించాయి. అయితే వాటిని గూగుల్ వెంటనే రీప్లేస్ చేసింది. ఈ నేపథ్యంలోనే నాలుగు స్క్రీన్‌షాట్స్ మాత్రం ఇండియన్ ఆడియెన్స్‌ను ఉద్దేశించి కనిపించాయి. ఇంటిగ్రేషన్ విషయంలో ఇంకా అనిశ్చితి ఉంది. నేరుగా ఇది డౌన్‌లోడ్ కావటం లేదు. ఆండ్రాయిడ్ డివైజుల్లోకి లేటెస్ట్ ఏపీకే ఫైల్స్‌ని సైడ్‌లోడింగ్ చేసుకోవాలి. తద్వారా ఈ వాలెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సమాచారం. అలా బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డులనూ అనుసంధానించుకోవచ్చు. ఎన్‌ఎఫ్‌సీ ఎనేబుల్డ్ స్మార్ట్‌ఫోన్స్‌లో కాంటాక్ట్‌లెస్ పేమెంట్స్‌కు అలాగే యూపీఐ ట్రాన్సాక్షన్స్‌కు సపోర్ట్ ఉంటుంది. మొత్తమ్మీద వ్యవహారం ఇంకా గందరగోళంలోనే ఉందని చెప్పవచ్చు.

గూగుల్ ప్లే ఇక ఫింగర్‌ప్రింట్ వెరిఫికేషన్



ఆండ్రాయడ్ యాప్స్‌నకు సంబంధించి గూగుల్ ప్లే స్టోర్ కొన్ని మార్పులు చేసింది. సాంప్రదాయకంగా వస్తున్న పాస్‌వర్డ్ స్థానే బయోమెట్రిక్ వెరిఫికేషన్‌ను పరిచయం చేసింది. యూజర్ వెసులుబాటు, భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ మార్పులు చేసింది. ఆండ్రాయిడ్ యూజర్లు అతి త్వరలోనే ఈ మార్పును గమనించనున్నారు. ప్రస్తుతం దీన్ని పొందేందుకు ప్లేస్టోర్ సెట్టింగ్స్‌లోకి వెళ్ళాలి. పర్చేజ్ వెరిఫికేషన్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. అక్కడ బయోమెట్రిక్ వెరిఫికేషన్ ఆప్షన్‌ను టోగెల్ చేయాలి. ఇందుకోసం గూగుల్ అకౌంట్ పాస్‌వర్డ్ అవసరమవుతుంది. అయితే రాబోయే అప్డేట్‌తో మాత్రం ఈ పని మరింత సూటిగా ఉంటుందని చెప్పవచ్చు. ఇది అందుబాటులోకి తెచ్చుకుంటే యూజర్లు ఇకపై ఫింగర్‌ప్రింట్ లేదంటే ఫేస్ రికగ్నిషన్‌తో ప్లే స్టోర్ నుంచి కొనుగోళ్ళు సాగించవచ్చు. 'యువర్ గూగుల్ ప్లే పర్చేజ్ వెరిఫికేషన్ సెట్టింగ్స్' పేరిట గూగుల్ చేసిన ఈ మార్పులను ఒక ఈ మెయిల్‌లో ప్రకటించింది. రాబోయే వారాల్లో ఈ మార్పు అందుబాటులోకి రానుందని యూజర్లకు తెలిపింది. అలాగే ఈ వెరిఫికేషన్‌లోనూ మూడు ఆప్షన్లను పొందుపరిచింది. ఆల్వేస్, ప్రతి 30 నిమిషాలకు, నెవ్వర్ అని ఉంచింది. కస్టమర్ తనకు అనుగుణంగా ఈ మూడింటిలో ఒకటి ఎంచుకోవచ్చు. యూజర్ సెక్యూరిటీని ఉద్దేశించి ఈ ఆప్షన్లను ఉంచింది. బయోమెట్రిక్ డేటా స్టోరేజ్‌లో మాత్రం యూజర్లు తమ విచక్షణను పాటించాల్సి ఉంటుంది. పిల్లలు, ఇతరుల విషయంలో ఈ జాగ్రత్త అవసరం. ఆ క్రెడెన్షియల్స్ షేరింగ్ కాకుండా జాగ్రత్త పడాలని గూగుల్ హెచ్చరించింది.

వివో వి-30ఇ స్పెసిఫికేషన్స్ లీక్!

వివో వి-30ఇ స్పెసిఫికేషన్స్ లీక్ అయ్యాయి. మందంగా డిజైన్, పవర్‌ఫుల్ కెమెరా, పొటెన్షియల్ చిప్‌సెట్ తదితరాలు రాబోయే వివో స్మార్ట్‌ఫోన్‌లో ఉన్నాయని సమాచారం. వివో ఇటీవల విడుదల చేసిన వి30, వి30 ప్రొ సరసన ఈ కొత్త మోడల్ చేరనుంది. వి30ఇ విషయానికి వస్తే, 3డి కర్వ్‌డ్ డిస్‌ప్లే, డిజైన్ మందంగా ఉండనున్నాయి బ్లూ గ్రీన్, బ్రౌన్



రెడ్ రంగుల్లో లభ్యం కానుంది. టాప్ లెఫ్ట్‌లో సర్క్యులర్ కెమెరా మాడ్యూల్ ఉండొచ్చు. క్వాల్కామ్ స్నాప్‌డ్రాగన్ 6జనరేషన్ 1 చిప్‌సెట్, 8జీబీ ర్యామ్‌కు తోడు ఆండ్రాయిడ్ 14 ఆధారిత ఫన్‌టచ్‌ఓఎస్ పై రన్ అవుతుంది.

ఆండ్రాయిడ్ 15 నుంచి వైర్‌లెస్ చార్జింగ్!





ఆండ్రాయిడ్ 15 - ఎన్‌ఎఫ్‌సీ(నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్) వైర్‌లెస్ చార్జింగ్‌ను పరిచయం చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. సాంప్రదాయకంగా వస్తున్న క్యూఐ స్టాండర్డ్‌కు ప్రత్యామ్నాయంగా దీన్ని తీసుకువస్తోంది. ప్రస్తుతం ఇది ఒక వాట్‌కు మించకుండా, చిన్నపాటి యాక్సెసరీలకు మాత్రమే అందుబాటులో ఉంది. అంటే ట్రాకర్లు, స్టయిలస్, వైర్‌లెస్ ఇయర్‌బడ్స్‌కు మరీ ముఖ్యంగా పవర్ ట్రాన్స్‌మిషన్‌లో పరిమితులను పరిగణనలోకి తీసుకుని దీన్ని తీసుకువస్తోంది. వాటిలో ఉండే లిమిటెడ్ స్పేస్‌తో లార్జర్ చార్జింగ్ కాయిల్స్‌ను పెట్టడం వీలుకాదని, అందుకోసం ఎన్‌ఎఫ్‌సీ వైర్‌లెస్ చార్జింగ్ సదుపాయాన్ని తీసుకువస్తోందని 'ఆండ్రాయిడ్ అథారిటీ' పేర్కొంది. దీంట్లో ప్రధాన వెసులుబాటు - కాంపాక్ట్ యాంటెనాలతో పవర్ ట్రాన్స్‌మిషన్ జరుగుతుంది. ఆండ్రాయిడ్ 15 బేటా 1లో ఇటీవలి జరిగిన పరిశోధనలు ఈ విషయాన్ని బైటపెట్టాయి. ఆండ్రాయిడ్ ఓపెన్ సోర్స్ ప్రాజెక్ట్(ఏఓఎస్‌పీ)తో ఇంకా ఇది ఇంటిగ్రేట్ కాలేదు. అయినప్పటికి జరుగుతున్న పరిణామాలు గూగుల్ చేస్తున్న ప్రయత్నాలను తెలియజేస్తున్నాయి. అయితే, ఈ ఎన్‌ఎఫ్‌సీ వైర్‌లెస్ చార్జింగ్‌లోనూ కొన్ని పరిమితులు ఉన్నాయి. గరిష్ఠంగా ఇది కూడా ఒక వాట్ పవర్‌కు మించి ట్రాన్స్‌మిట్ చేయలేదు. దీంతో ఎక్కువ పవర్ అవసరమయ్యే డివైజ్‌ల పరిస్థితి ప్రశ్నార్థకమే అని చెప్పవచ్చు. అందుకే ఇది ఇయర్‌బడ్స్, స్మార్ట్ వాచీలు, ఫిట్‌నెస్ ట్రాకర్లు లాంటి చిన్నపాటి డివైజ్‌లకే అనుకూలమని భావించవచ్చు. అంటే పెద్ద చార్జింగ్ కాయిల్స్‌ను పెట్టడానికి వీలులేని వాటికే ఇది పనికొస్తుంది.



యాపిల్ ఐఫోన్ నోట్స్‌కు అప్‌గ్రేడెడ్ వెర్షన్స్!

యాపిల్ - ఐఓఎస్ 18తోఉన్న ఐఫోన్ నోట్స్‌యాప్‌ను బిల్ట్ ఇన్ కాలిక్యులేటర్, రికార్డర్‌తో ఇంటిగ్రేట్ చేస్తోందని వినికిడి. ఐఓఎస్ యూజర్లు ఈ నోట్ యాప్‌ని చాలా బాగా ఉపయోగిస్తూ ఉంటారు. ప్రస్తుతం ఆ యాప్ మరింత ఉపయోగకరంగా ఉండేందుకు వీలుగా ఈ రెంటినీ జోడిస్తోంది. 'యాపిల్‌ఇన్‌సైడర్' ఈ రెంటినీ ప్రస్తావించింది. వివరాల్లోకి వెళితే...

బిల్ట్ ఇన్ రికార్డర్ ఫీచర్‌తో చాలా సులువుగా రికార్డ్, సేవ్, ఆడియో క్లిప్స్ ప్లే తదితరాలను నోట్స్‌యాప్ పరిధిలోనే చేసుకోవచ్చు. వాయిస్ మెమోతో టెక్స్ లేదా ఇమేజ్‌లను జోడించుకోవచ్చు. క్యాలిక్యులేటర్ ఇంటిగ్రేషన్‌తో నోట్ యాప్‌లోనే మేథ్స్ నోట్స్ క్రియేట్ అవుతుంది. దీంతో యూజర్లు క్లిష్టమైన లెక్కలను సాల్వ్ చేసుకోవచ్చు. అయితే ఈ విషయం రూఢి కావాల్సి ఉంది. మైక్రోసాఫ్ట్‌కు చెందిన వన్‌నోట్ ఫీచర్లతో సమానంగా ఉండనున్నాయి. యాపిల్ కూడా మేక్‌ఓఎస్ కాలిక్యులేటర్ యాప్ డిజైన్‌ను మారుస్తున్నట్టు సమాచారం.

పవర్‌పాయింట్ కోపైలెట్ ప్రాంప్ట్స్ ఇస్తే ప్రజంటేషన్ చేస్తుంది



మైక్రోసాఫ్ట్ 'పవర్‌పాయింట్ కోపైలెట్ అద్భుతాలను సృష్టిస్తుందంటే అతిశయోక్తి కాదు. కొన్ని నిమిషాల్లోనే అవలీలగా ప్రజంటేషన్స్‌ను క్రియేట్ చేయగల సామర్థ్యం దీనికి ఉంది. దీనికి ఉన్న ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) ఫీచర్స్‌తో పని చాలా సులువుగా ఉంటుంది. ప్రస్తుత డిజిటల్ యుగంలో వివిధ పనులు సాఫీగా, ఆటోమేటిక్‌గా సాగేందుకు టెక్ కంపెనీలు అందిస్తున్న ఏఐ ఆధారిత టూల్స్ ఎంతగానో తోడ్పడుతున్నాయి.

మైక్రోసాఫ్ట్ కూడా సరిగ్గా ఆ బాటలోనే నడుస్తోంది. ఇది అందిస్తున్న ఈ టూల్ విషయానికే వస్తే, దీని ఏఐ పవర్డ్ అసిస్టెంట్ వివిధ ప్రజంటేషన్స్ రూపకల్పనలో ఇతోధికంగా తోడ్పడుతుంది. కన్‌వర్షనల్ ప్రాంప్ట్స్‌ను రాస్తే చాలు, యూజర్ అనుకుంటున్న థీమ్‌కు అనుగుణంగా ప్రజంటేషన్ అందిస్తుంది. ఇందుకోసం ఈ టూల్ నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్(ఎన్‌ఎల్‌పీ), క్లౌడ్ ఆధారిత ఏఐ ఇంజన్‌ను ఉపయోగిస్తుంది. అలా యూజర్ ఆలోచనలకు అనుగుణంగా ప్రజంటేషన్‌ను సృష్టిస్తుంది. అనుకున్నదే తడవు జరిగిపోవడం అంటే ఇదే అని చెప్పవచ్చు. ప్రభావపూరితంగా దీన్ని ఉపయోగించుకోవడంలో భాగంగా...

- కోపైలెట్‌లోని పవర్ పాయింట్ - కంటెంట్‌కు అనుగుణంగా ఆటో సజెషన్స్ ఇస్తుంది. తద్వారా రైటింగ్, డిజైనింగ్‌లో రిఫైన్‌మెంట్‌కు తోడ్పడుతుంది.
- డిజైన్ సహా స్క్రాచ్ నుంచి యూజర్ పవర్ పాయింట్‌ని డెవలప్ చేసుకోవచ్చు. తదుపరి యూజర్ తన ప్రాధాన్యాలకు అనుగుణంగా కస్టమైజ్ చేసుకోవచ్చు.
- ఇనీషియల్ డ్రాఫ్ట్‌లతోనూ ప్రయోజనం పొందవచ్చు. ఆపై స్మార్ట్ సజెషన్స్‌తో దాన్ని మెరుగుపర్చుకోవచ్చు. కంటెంట్, డిజైన్‌పరంగా కావాల్సిన రీతిలో రూపొందించుకోవచ్చు. శూన్యం నుంచి అద్భుతాన్ని రూపొందించుకోవడం అంటే ఇదే.
- ఎఫెక్టివ్ కొలాబిరేషన్ ఫీచర్లు కూడా ఉన్నాయి. ఫలితంగా టీమ్ మెంబర్స్‌తో కలిసి చక్కగా పని చేసుకోవచ్చు. ఎడిటింగ్, రిఫైన్‌మెంట్ తదితర పనులను చక్కబెట్టుకోవచ్చు.


ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శనివారం 20 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com

విశాఖ ఐఐపీఈలో ఎమ్మెస్సీ

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)- 'ఎమ్మెస్సీ ఇన్ అప్లయిడ్ జియాలజీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మినరల్ ఎక్స్‌ప్లోరేషన్, సబ్ సర్ఫేస్ మోడలింగ్, ఫాసిల్ ఫ్యూయెల్, గ్రౌండ్ వాటర్ ఎక్స్‌ప్లోరేషన్, డ్రిల్లింగ్, ఎస్టిమేషన్ ఆఫ్ రిసోర్సెస్, సైట్ ఇన్వెస్టిగేషన్ అంశాలకు సంబంధించిన సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా ఫీల్డ్ వర్క్‌లు, ల్యాబొరేటరీ ప్రయోగాలు, రీసెర్చ్ ప్రాజెక్టులు ఉంటాయి. రెండో సెమిస్టర్ చివరలో ఆరు నుంచి ఎనిమిది వారాల వ్యవధి గల సమ్మర్ ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 15 సీట్లు ఉన్నాయి. జామ్ 2024 స్కోర్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: జియాలజీ ప్రధాన సబ్జెక్ట్‌గా ప్రథమ శ్రేణి మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ జామ్ 2024 అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఏప్రిల్ 22 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 11
- **మొదటి అడ్మిషన్ లిస్ట్ విడుదల:** జూన్ 14న
- **రెండో అడ్మిషన్ లిస్ట్ విడుదల:** జూన్ 28న
- **మూడో అడ్మిషన్ లిస్ట్ విడుదల:** జూలై 9న
- **తరగతులు ప్రారంభం:** జూలై 22నుంచి
- **వెబ్‌సైట్:** www.iipe.ac.in



ఎస్‌వీఎన్ఐఆర్‌టీఏఆర్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని దివ్యాంగుల సాధికారత విభాగం నిర్వహిస్తున్న పలు ఇన్‌స్టిట్యూషన్‌లలో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సీఈటీ) 2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ టెస్ట్‌ను కటక్‌లోని స్వామి వివేకానంద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీహాబిలిటేషన్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్(ఎస్‌వీఎన్ఐఆర్‌టీఏఆర్) నిర్వహిస్తోంది.

దీని ద్వారా బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ(బీపీటీ), బ్యాచిలర్ ఆఫ్ ఆక్యుపేషనల్ థెరపీ(బీఓటీ), బ్యాచిలర్ ఇన్ ప్రోస్థటిక్స్ అండ్ ఆర్థోటిక్స్(బీపీఓ), బ్యాచిలర్ ఇన్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ(బీఏఎస్ఎల్‌పీ) కోర్సుల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. బీఏఎస్ఎల్‌పీ ప్రోగ్రామ్‌నకు కోర్సులో భాగంగా ఏడాది ఇంటర్న్‌షిప్ ఉంటుంది. మిగిలిన ప్రోగ్రామ్‌లకు అదనంగా ఆర్నెల్ల వ్యవధి గల ఇంటర్న్‌షిప్ ఉంటుంది. అభ్యర్థులందరూ నిర్దేశించిన గ్రామం/జిల్లా కేంద్రంలోని ఆసుపత్రులు/రీహాబిలిటేషన్ సంస్థల్లో పనిచేయాల్సి ఉంటుంది. పురుషులకు, మహిళలకు విడిగా వసతి సౌకర్యం ఉంది.

క్యాంపస్‌లు-సీట్లు

- స్వామి వివేకానంద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీహాబిలిటేషన్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్(ఎస్‌వీఎన్ఐఆర్‌టీఏఆర్), **కటక్:** ఇందులో బీపీటీ 62, బీఓటీ 62, బీపీఓ 46, బీఏఎస్ఎల్‌పీ 10 సీట్లు ఉన్నాయి.
- **నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ లోకోమోటార్ డిజెబిలిటీస్(ఎన్ఐఎల్‌డీ), కోల్‌కతా:** ఇందులో బీపీటీ 57, బీఓటీ 56, బీపీఓ 47 సీట్లు ఉన్నాయి.
- **నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్ (ఎన్ఐఈపీఎండీ), చెన్నై:** ఇందులో బీపీటీ 18, బీఓటీ 18, బీపీఓ 20, బీఏఎస్ఎల్‌పీ 27 సీట్లు ఉన్నాయి.
- **కంపోజిట్ రీజనల్ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్, రీహాబిలిటేషన్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజెబిలిటీస్(సీఆర్‌సీఎస్ఆర్ఈ), గువహటి:** ఇందులో బీఏఎస్ఎల్‌పీ 20 సీట్లు ఉన్నాయి.
- **పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పర్సన్స్ విత్ ఫిజికల్ డిజెబిలిటీస్(పీడీయూఎన్ఐపీపీడీ), న్యూఢిల్లీ:** ఇందులో బీపీటీ 68, బీఓటీ 68, బీపీఓ 39 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు

- బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ(బీపీటీ), బ్యాచిలర్ ఆఫ్ ఆక్యుపేషనల్ థెరపీ(బీఓటీ) ప్రోగ్రామ్‌లకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. బ్యాచిలర్ ఇన్ ప్రోస్థటిక్స్ అండ్ ఆర్థోటిక్స్(బీపీఓ) ప్రోగ్రామ్‌నకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/మేథమెటిక్స్, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. బీఏఎస్ఎల్‌పీ ప్రోగ్రామ్‌నకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/మేథమెటిక్స్/కంప్యూటర్ సైన్స్/ స్టాటిస్టిక్స్/ఎలక్ట్రానిక్స్/సైకాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. జనరల్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. దివ్యాంగులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు సీఈటీ 2024 ఫలితాలు వెలువడిన వారంలోపు మార్కుల పత్రాలు, సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. అభ్యర్థుల వయసు అడ్మిషన్ నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 4 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** సికింద్రాబాద్, విజయవాడ
- **ఎస్‌వీఎన్ఐఆర్‌టీఏఆర్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2024 తేదీ:** జూన్ 23న
- **ఫలితాలు విడుదల:** జూలై 5న
- **వెబ్‌సైట్:** https://admission.svnirtar.nic.in

సీఈటీ 2024 వివరాలు

- దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నపత్రంలో నాలుగు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ ఎబిలిటీ అండ్ జనరల్ నాలెడ్జ్ అంశాల నుంచి పది ప్రశ్నలు; రెండో పార్ట్‌లో ఫిజిక్స్ నుంచి 30 ప్రశ్నలు, మూడో పార్ట్‌లో కెమిస్ట్రీ నుంచి 30 ప్రశ్నలు, నాలుగో పార్ట్‌లో బయాలజీ(జువాలజీ, బోటనీ)/మేథమెటిక్స్ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఇంటర్/పన్నెండోతరగతి స్థాయిలోనే ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు.

యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామ్

ఖాళీలు 827

న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్...కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ విభాగాల్లో మెడికల్ ఆఫీసర్/జీడీఎంవో ఉద్యోగాలను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు.

- కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2024

కేటగిరీ-1

మెడికల్ ఆఫీసర్స్ గ్రేడ్(జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్ సబ్-క్యాడర్ ఆఫ్ సెంట్రల్ హెల్త్ సర్వీస్): 163 పోస్టులు

కేటగిరీ-2

1. అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్(రైల్వే): 450 పోస్టులు
2. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్(న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్): 14 పోస్టులు
3. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ గ్రేడ్-2(ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్): 200 పోస్టులు

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
వయో పరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 32 సంవత్సరాలు మించకూడదు
పే స్కేల్: నెలకు రూ.56,100- రూ.1,77,500
దరఖాస్తు రుసుము: రూ.200. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(500 మార్కులు), ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్(100 మార్కులు), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం, తిరుపతి
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30
దరఖాస్తులో సవరణకు చివరి తేదీ: మే 7
రాత పరీక్ష తేదీ: మే 14
వెబ్‌సైట్: https://upsc.gov.in/



బిట్ మెస్రాలో ఎంసీఏ

మెస్రాలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బిట్)- మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మెస్రా, లాల్‌పూర్, నోయిడా, జైపూర్ క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు మూడు క్యాంపస్‌లు ఎంచుకొని ప్రాధాన్యక్రమాన్ని దరఖాస్తు ఫారంలో సూచించాలి. సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత

- అభ్యర్థులు గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(బీసీఏ)/బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ అప్లికేషన్స్)/బీఎస్సీ ఆనర్స్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి మార్కుల పత్రాలు, సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్

- ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కంప్యూటర్ ఫండమెంటల్స్ నుంచి 50 ప్రశ్నలు; మేథమెటికల్ ఎబిలిటీ, అనలిటికల్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, జనరల్ ఇంగ్లీష్ అంశాల నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ టెస్ట్‌లో అర్హత పొందాలంటే కనీసం 35 మార్కులు రావాలి. వీరిని మాత్రమే ఆన్‌లైన్ ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. దీనికి 100 మార్కులు నిర్దేశించారు. ఇందులో అర్హత పొందాలంటే కనీసం 40 మార్కులు రావాలి. ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్‌కు 40 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 10
- **ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 16
- **వెబ్‌సైట్:** bitmesra.ac.in



జాబ్ కార్నర్

హెచ్‌ఏఎల్‌లో అసిస్టెంట్ ఇంజనీర్లు

హైదరాబాద్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్..కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్): 3 పోస్టులు
2. అసిస్టెంట్ ఇంజనీర్(మెకానికల్): 3 పోస్టులు
అర్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 35 సంవత్సరాలు మించకూడదు. వేతనం నెలకు రూ.30,000- రూ.1,20,000
ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ద మేనేజర్(హెచ్ఆర్) రిక్రూట్‌మెంట్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, ఏవియానిక్స్ డివిజన్, బాలానగర్, హైదరాబాద్ చిరునామాకు పంపాలి.
చివరి తేదీ: మే 8
వెబ్‌సైట్: https://www.hal-india.co.in/career



ఎన్ఐఈలో ప్రాజెక్ట్ టెక్నికల్ పోస్టులు

తూత్తుకుడి(తమిళనాడు)లోని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ ...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-1(మెడికల్): 1 పోస్టు
2. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-1(హెల్త్ అసిస్టెంట్): 2 పోస్టులు
3. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-1(ఫీల్డ్ అసిస్టెంట్): 1పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా, ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయో పరిమితి: ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు 28 ఏళ్లు; ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు రీసెర్చ్ సైంటిస్ట్ పోస్టుకు రూ.67,000; ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు రూ.18,000 ఉంటుంది.
ఇంటర్వ్యూ తేదీ: ఏప్రిల్ 23
ప్రదేశం: ఐసీఎంఆర్-ఎన్ఐఈ, తూత్తుకుడి(తమిళనాడు)
వెబ్‌సైట్:https://nie.gov.in/oppurtunities/careers

ఎన్‌పీసీఐఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు

ఖాళీలు 400

ముంబయిలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ-న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ
విభాగాలు: మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్
అర్హత: కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయోపరిమితి: 2024 ఏప్రిల్ 30 నాటికి 26 సంవత్సరాలు మించకూడదు
ప్రారంభ వేతనం: నెలకు రూ.56,100
ఎంపిక ప్రక్రియ: గేట్ 2022/2023/2024 స్కోరు, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
దరఖాస్తు రుసుము: రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30
వెబ్‌సైట్: https://npcilcareers.co.in/MainSiten/default.aspx

లిటిల్స్



పనికి తగిన గుర్తింపు

ఉదయం.. సమయం తొమ్మిది గంటలు. రంగారావు అనే పెద్దాయన రోడ్డుమీద వెళ్తున్నాడు. అతని వయసు సుమారు అరవై ఏళ్లు. ఉన్నట్లుండి గాలి వచ్చింది. మట్టి అంతా కంట్లో పడింది. పైగా తన తలమీద పెట్టుకున్న క్యాప్ ఎగిరి దూరంగా పడింది. గాలికి ఎగురుతోంది. అదే సమయంలో బడి పిల్లల అరుపులు వినిపించాయి. ఇద్దరు స్నేహితులు బడికి వెళ్తున్నారు. 'బాబు.. క్యాప్ తీసుకొచ్చి సాయం చేయండి' అన్నాడు ఆ పెద్దాయన. మేం స్కూల్‌కి వెళ్లాలన్నారు. పైగా ఆ పెద్దాయనను చూస్తూ 'భలే భలే.. తాతా నీకు తలమీద జుట్టు ఎక్కడికి పోయింది. గాలికి పోయిందా?' అని నవ్వారు.
కాసేపయ్యాక అదే దారిలో లీల అనే విద్యార్థి వచ్చింది. 'నా క్యాప్ దూరంగా పడింది. తెచ్చివ్వండి బాబూ. పుణ్యం ఉంటుంది నాయనా' అనే పెద్దాయన మాటలు విని.. లీల పరిగెత్తింది. ఆ క్యాప్ తీసుకొని వచ్చి పెద్దాయనకు ఇచ్చింది. ఆయనెంతో సంతోషపడ్డారు. ఈ విషయాన్నంతా ఆ స్కూల్ టీచర్ గమనించింది. స్కూల్‌కి పిల్లలు వెళ్లారు. తరగతి గదిలోని పిల్లలతో టీచర్ ఇలా అంది- 'పిల్లలూ మీరంతా లేచి చప్పట్లు కొట్టండి. ఆ చప్పట్లు మన లీల కోసమే' అంది. 'ఎందుకు టీచర్' అని అడిగాడో విద్యార్థి. 'లీలకు హెల్పింగ్ నేచర్ ఉంది. ఉదయాన ఓ పెద్దాయనకు సాయం చేసింది. పెద్దలకు సాయం చేసే గుణమున్న లీలాకు కంపాస్ బహుమతిగా ఇస్తున్నా'నంది ఆ క్లాస్ టీచర్. లీలా ఆనందంగా బహుమతి తీసుకుంది. అదే సమయంలో తాతను ఆటపట్టించి.. నవ్విన ఆ పిల్లలు సిగ్గుతో తలవంచుకున్నారు.
నీతి: ఎవరినీ కించపరచకూడదు. వీలైనంత వరకూ కష్టాల్లో ఉన్న వారిని ఉన్నంతలో ఆదుకోవటం మంచి లక్షణం.


పదాలు కనుక్కోండి


FURNITURE

e	i	v	c	i	a	g	x	m	i	r	r	o	r	b	w
s	q	s	s	u	h	c	u	p	b	o	a	r	d	q	x
c	y	e	t	e	p	j	e	d	u	w	a	c	k	i	j
o	a	d	o	q	f	y	t	a	b	l	e	a	e	e	b
u	r	s	o	k	i	t	d	o	i	e	o	x	q	y	o
c	m	q	l	d	r	s	d	z	w	y	e	d	k	f	o
h	c	h	z	k	e	p	a	s	j	v	v	b	e	d	k
l	h	s	c	r	p	c	c	o	e						c
d	a	b	h	k	l	l	t	f	o						a
x	i	q	a	r	a	e	l	a	g						s
b	r	n	i	b	c	x	n	z	x						e
w	o	t	r	j	e	s	i	d	e	b	o	a	r	d	n

armchair
bed
bookcase
chair
couch
cupboard
fireplace
mirror
sideboard
sofa
stool
table

సరైన నీడ ఏది?





దారి కనుక్కోండి

10 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 286

						4	5	
	8		4					2
1	3		2				9	
	5				6			9
8								3
9			1				4	
	9				4		1	7
5					8		2	
	6	1						

సుడోకు - 285 సమాధానం

7	1	3	9	8	4	2	6	5
5	6	8	1	3	2	4	9	7
4	2	9	5	6	7	8	1	3
1	8	2	4	5	9	3	7	6
6	4	5	7	2	3	9	8	1
9	3	7	6	1	8	5	2	4
2	5	6	3	9	1	7	4	8
3	9	4	8	7	6	1	5	2
8	7	1	2	4	5	6	3	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.